RNI.No.TELTEL/2000/00272

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam

ASHISH MEDIA SERVICES (AMS)

You can download news from our 'AMS News Agency'

Logon to our website and registar.

www.ashishmediaservices.blogspot.com

Contant No. :9247698676

# వుదయం

Simultaneously published from Hyderabad, Adilabad, Khammam, Karimnagar, Guntur & Warangal

రిపోర్టర్లు కావలెను...

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వుదయం తెలుగు దిన పత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవజ్ఞులైన అభ్యర్థులు కావలెను.

- సిరికొండ అగస్టిన్
BA. L.L.B., M.C.J.
వుదయం ఎడిటర్

సెల్: 9247698676

సంపుటి : 28 | సంచిక :84 | హైదరాబాద్ | గురువారం, మే 01, 2025 | VOODAYAM Telugu Daily | వెల : రూ. 3.00 | పేజీలు : 12



## జనాభా లెక్కలతోనే కులగణన

- కులగణనపై కేంద్రం కీలక నిర్ణయం
- కులగణన పేరుతో కాంగ్రెస్ సర్వే చేయించింది
- ఆయా రాష్ట్రాల్లో చేపడుతున్న సర్వేల్లో పారదర్శకత లేదు
- తదుపరి దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కల ప్రక్రియలో కులగణనను చేర్చి పారదర్శకంగా చేపట్టాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పం
- ఏప్రిల్ 2020లోనే జనాభా లెక్కలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది

# బాలికలదే పైచేయి



- పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదల
- పది ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత
- బాలురు 91.32 శాతం, బాలికలు 94.26 శాతం ఉత్తీర్ణత
- ఒక్క విద్యార్థీ పాస్‌కాని స్కూళ్లు రెండు..
- జూన్ 3 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

హైదరాబాద్

తెలంగాణ టెన్త్ ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులతో కలిసి సీఎం విడుదల చేశారు. ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది కంటే ఈసారి 1.47 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. 94.26 శాతం మంది బాలికలు ఉత్తీర్ణత కాగా.. 91.32 శాతం మంది బాలురు పాసయ్యారు. అత్యధికంగా గురుకుల పాఠశాలల్లో 98.7 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ప్రైవేటు పాఠశాలల్లో -



### ఏ పథకం ఆగలేదు అనడానికి

## సీఎం రేవంత్‌కు సిగ్గుండాలి

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- నీ ఆరు గ్యారెంటీలు ఏమైంది, నీ 420 హామీలు ఏమైంది
- ఏడాదిలో రెండున్నర లక్షల ఉద్యోగాలు ఏమైంది
- ఒక్కసారి నీ మేనిఫెస్టో చూసుకో రేవంత్ రెడ్డి
- నీ మాట తప్పుడు ఏందో నీకే అర్థమైతది

హైదరాబాద్

తెలంగాణలో అన్ని సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి రవీంద్ర భారతి వేదికగా చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ప్రజలు కష్టాల్లో ఉంటే ఎందుకు రావడం లేదని నువ్వే అంటున్నావు, మరోవైపు ప్రజలకు కష్టాలు లేవు, మాది ప్రజా పాలన అంటున్నావు రేవంత్‌కు జపాన్ వెళ్లి వచ్చి మైండ్ పాడైనట్లుంది లేకుంటే రజతోత్సవ సభకు వచ్చిన జనాన్ని చూసి -



## చిగురిస్తున్న ఇండో-కెనడా స్నేహం

- కెనడాలో భారత హై కమిషనర్ దినేష్ కుమార్ పట్నాయక్!
- పట్టాలెక్కనున్న దౌత్య సంబంధాలు
- కెనడాలో మార్క్ కార్నీ మైనారిటీ ప్రభుత్వం!

### ఆగమైంది తెలంగాణ కాదు..

# కేసీఆర్ కుటుంబం



- తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా?
- కేసీఆర్‌పై సీఎం రేవంత్ ఫైర్
- కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కోతుల గుంపునకు అప్పగించినట్లయింది
- ప్రతిపక్ష నేత కుటుంబం తెలంగాణ మీద పడి దోచుకుంది
- కాళేశ్వరం, రైతు రుణమాఫీ, ఎస్సీ వర్గీకరణ, కులగణన, రైతుబంధుపై చర్చిద్దామా?
- బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేసుకుంటే బస్సులు ఇవ్వాలని చెప్పాం
- సభకు అవసరమైన వెసులు బాటుకల్పించాలని అధికారులను ఆదేశించాం
- ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం బలంగా ఉండాలి

హైదరాబాద్

ఇటీవల ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభకు తాము సంపూర్ణంగా సహకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రవీంద్రభారతిలో నిర్వహించిన బసవేశ్వర 892 జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేసిన అనంతరం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. 12వ శతాబ్దంలోనే సమాజంలో అనేక మార్పులకు పునాదులు వేసిన విప్లవకారుడు బసవేశ్వరుడు. ఆయన జయంతి రోజున పదోతరగతి ఫలితాలు విడుదల చేసుకోవడం సంతోషం. పరీక్షలు పాసైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు. బసవన్న స్ఫూర్తితో మా ప్రభుత్వం పనిచేస్తోంది. కుల, మత, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన అభ్యుదయవాది బసవన్న. బసవేశ్వర స్ఫూర్తితోనే పంచాయతీ రాజ్ పార్లమెంటరీ వ్యవస్థను మనం తెచ్చుకున్నాం. ప్రతీ మనిషి గౌరవంగా బతికేలా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాలి. పాలకపక్షం తీసుకునే నిర్ణయాలలో లోపాలను ఎత్తి చూపేందుకే ప్రతిపక్షం అనే వ్యవస్థ ఉంది. భారాస రజతోత్సవ వేడుకల్లో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కోతుల గుంపునకు అప్పగించినట్లయిందంటూ సీఎం ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేత కుటుంబం -




## ఆపరేషన్ కగార్ సక్సెస్

- కర్రెగుట్టలపై జాతీయ జెండా
- త్వరలో అక్కడ బేస్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం
- 10 వేలకు పైగా సాయుధ బలగాల సిబ్బందితో కర్రెగుట్టను చుట్టుముట్టారు
- డ్రోన్లు, హెలికాప్టర్లతో కూంబింగ్

### జాతీయ భద్రతా సలహా బోర్డు

## ఛైర్మన్‌గా అలోక్ జోషి



- జాతీయ భద్రతా సలహా బోర్డును పునర్వ్యవస్థీకరించిన కేంద్రం
- బోర్డుకు నూతన ఛైర్మన్‌గా 'రా' మాజీ అధిపతి అలోక్ జోషి నియామకం
- మరో ఆరుగురు సభ్యులతో బోర్డు విస్తరణ
- మాజీ సైనిక, పోలీసు అధికారులకు బోర్డులో చోటు

# ఇది తెలంగాణ ప్రభుత్వ విజయం

- కులగణనపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం..
- కేంద్రం కుల గణన నిర్ణయంపై సీఎం రేవంత్ హర్షం
- ప్రధాని మోదీ, కేంద్ర కేబినెట్‌కు కృతజ్ఞతలు
- రాహుల్ గాంధీ విజన్ సాకారమైందన్న ముఖ్యమంత్రి
- తెలంగాణను దేశం అనుసరిస్తోందని వ్యాఖ్య
- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కూడా స్వాగతం, ప్రభుత్వ విజయమన్న వ్యాఖ్య



హైదరాబాద్

కులగణనపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ విజయమని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. జనగణనతో పాటు కులగణన నిర్వహిస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయమని ఆయన అన్నారు. కేంద్ర కేబినెట్ భేటీలో కులగణనపై నిర్ణయం తీసుకున్న అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. 'దేశ చరిత్రలో మొదటిసారిగా కులగణన నిర్వహించిన రాష్ట్రం తెలంగాణ. కుల గణన తో తెలంగాణలో ఏ కులం వారు ఎంత నిష్పత్తిలో ఉన్నారని తేల్చి చెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీది. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం నిర్ణయం తీసుకొని పారదర్శకంగా కుల గణన సర్వే నిర్వహించడం జరిగింది' అని ఆయన అన్నారు.

**స్పందించిన రేవంత్ రెడ్డి**

దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .

# సంపాదకీయం

## మాయదారి మధ్యవర్తిత్వం

పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చిందన్న చందంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు నడుం బిగించిన అగ్రరాజ్యాధినేత ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలతో పీటముడి మరింత బిగుసుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. క్రిమియా విషయంలో రష్యాకు అనుకూలంగా ఆయన చేస్తున్న ప్రకటనలు ఇందుకు ఆజ్యం పోస్తున్నాయి. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం అనంతరం అధికారికంగా ఉక్రెయిన్ కు దఖలుపడిన క్రిమియా.. రష్యాకే చెందుతుందంటూ ట్రంప్ మహాశయుడు ప్రకటించడం విడ్డూరం కాక మరేమిటి? రష్యా దౌర్జన్యంగా క్రిమియాను ఆక్రమించిందన్న సంగతి ఆయనకు తెలియదనుకోవాలా లేక అంతర్జాతీయ సమాజం ఇప్పటికీ క్రిమియాను ఉక్రెయిన్ లో అంతర్భాగంగా పరిగణిస్తోందన్న వాస్తవాన్ని ఆయన విస్మరించారనుకోవాలా? నయానో భయానో యుద్ధాన్ని విరమింపజేసి, ఆ ఘనతను తన ఖాతాలో వేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్న అమెరికా అధ్యక్షుడు అందుకు అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాల పట్ల ప్రపంచ దేశాలు విస్తుపోతున్నాయి. కయ్యానికి కాలుదువ్విన రష్యా అధినేత పుతిన్ తరపున వకాల్తా తీసుకుంటూ, ఉక్రెయిన్ అధ్యక్షుడిపై చీటికీ మాటికీ ఒంటికాలిపై లేస్తున్న ట్రంప్ తీరు గర్హనీయం. పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల అనంతరం ఉక్రెయిన్ అధ్యక్షుడితో భేటీ అయిన ట్రంప్%ొ% క్రిమియాను రష్యాకు అప్పగించేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందంటూ విలేఖరుల ఎదుట ఏకపక్షంగా ప్రకటించడం ఆయన తెంపరితనానికి నిదర్శనం. తమ భూభాగాన్ని రష్యా పరం చేయడం అంత తేలిక కాదని, రాజ్యాంగంలో మార్పులు చేయడంతోపాటు దేశవ్యాప్తంగా ఓటింగ్ నిర్వహించవలసి ఉంటుందని ఉక్రెయిన్ చెబుతున్న మాటల్ని ఆయన ఖాతరు చేయకపోగా, క్రిమియాలో అధికశాతం ప్రజలు రష్యన్ భాషనే మాట్లాడతారనీ, ఆ ప్రాంతంలో రష్యా ఎంతోకాలంగా తమ సబ్ మెరైన్లను మోహరించినందున అది రష్యాకే చెందుతుందనీ చేస్తున్న వితండవాదం నివ్వెరగొలుపుతోంది. మధ్యవర్తిగా ఇరు దేశాలకు సామరస్య పరిష్కారాన్ని చూపవలసిన బాధ్యతను విస్మరించి, ఒక పక్షాన్ని ఇలా భుజానికెత్తుకోవడం సిగ్గుచేటు. రష్యన్ భాషను ఎక్కువమంది మాట్లాడుతున్నంతమాత్రాన దానిపై అధికారం ఆ దేశానికే చెందుతుందని తీర్పు ఇవ్వడం సమంజసమేనా? ప్రజాస్వామ్యయుగంలో దురాక్రమణలు, దౌర్జన్యాలకు తావులేదని ఆయనకు చెప్పేదెవరు? పైపెచ్చు, యుద్ధ విరమణకు తాము రూపొందించిన శాంతి ఒప్పందంలో క్రిమియాను చేర్చి, ఉక్రెయిన్ ను ఒప్పించేందుకు ఆయన సామ దాన భేద దండోపాయాలన్నీ ప్రయోగిస్తున్నారు. దక్షిణ ఉక్రెయిన్ లో నల్లసముద్రం వెంబడి ఉన్న క్రిమియా ఓ ద్వీపకల్పం. సముద్రజలాల్లో దేశసరిహద్దుల పరిరక్షణకు క్రిమియా కీలకం కావడంతో రష్యా ఎప్పటినుంచో ఈ ప్రాంతంపై కన్నువేసింది. అందులో భాగంగానే క్రిమియాలో తమ నౌకాదళ స్థావరాల ఏర్పాటుకు సంబంధించి ఉక్రెయిన్ తో గతంలో కీలకమైన ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు క్రిమియాలోని కీలకమైన సెవస్తోపోల్ నౌకాశ్రయాన్ని 2042 వరకూ రష్యన్ నౌకాదళం వినియోగించుకునేందుకు ఉక్రెయిన్ అంగీకరించింది. ఈ ఒప్పందాన్ని 2047 వరకూ పొడిగించుకునే వెసులుబాటు కూడా ఉంది. ఈ నౌకాశ్రయంలో పదిహేనేళ్లుగా రష్యన్ ఆధిపత్యమే కొనసాగుతుండగా, అది చాలదన్నట్లు 2014లో యావత్తు క్రిమియాను ఆక్రమించుకోవడం పుతిన్ దురహంకారానికి నిదర్శనం. అంతేకాదు, 2022లో ఉక్రెయిన్ తో యుద్ధం ప్రారంభించాక, తమ దళాలను ఎక్కువగా క్రిమియాలోనే మోహరించింది. దాంతోపాటు, క్రిమియాను చేజిక్కించుకున్నాక ఇప్పటివరకూ ఎనిమిది లక్షలమంది రష్యన్లు ఆ ప్రాంతానికి వలస రాగా, లక్షకు పైగా ఉక్రేనియన్లు ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. క్రిమియాను స్థావరంగా చేసుకుని రష్యా సాగిస్తున్న దాడులను అడ్డుకునేందుకు ఉక్రెయిన్ గత్యంతరం లేని పరిస్థితుల్లో క్రిమియాపై దాడులు చేస్తోంది. రష్యాతో క్రిమియాను అనుసంధానించే కీలకమైన వంతెనను సైతం ఉక్రెయిన్ రెండు దఫాలుగా విచ్ఛిన్నం చేసింది. అమెరికా ఆధ్వర్యంలో ఒకవైపు శాంతియత్నాలు జరుగుతున్నా, పుతిన్ సంయమనం పాటించకుండా ఉక్రెయిన్ పై దాడులు జరుపుతూనే ఉన్నారు. రెండో ప్రపంచయుద్ధ విజయానికి 80వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు యుద్ధ విరమణను పాటిస్తున్నట్లు పుతిన్ ప్రకటించడం కంటితుడుపు చర్య మాత్రమే. ఆ తర్వాత మళ్లీ దాడులు ప్రారంభించరనే గ్యారంటీ ఏమీ లేదు. రష్యా దుందుడుకుతనానికి ముకుతాడు వేయవలసిన ట్రంప్ మహాశయుడు మాత్రం ఉక్రెయిన్ మెడలు ఎలా వంచాలా అన్నదే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయా దేశాల చరిత్ర తెలియకుండా, అక్కడి సంస్కృతి సాంప్రదాయాల గురించి అధ్యయనం చేయకుండా, ప్రజల మనోభావాలను పట్టించుకోకుండా ఫలానా దేశాన్ని స్వాధీనం చేసుకుంటాం, ఫలానా దేశాన్ని నాశనం చేస్తామంటూ వదరుబోతు మాటలు మాట్లాడటం ఆయనకు ఒక అలవాటుగా మారింది. ఒక భూభాగాన్ని ఆక్రమించి దీర్ఘకాలం తమ అధీనంలో ఉంచుకున్నంతమాత్రాన అది ఆ దేశానికే చెందుతుందని తీర్పు చెప్పడానికి తనకున్న అర్హతలేమిటో ట్రంప్ ఆత్మావలోకనం చేసుకోవడం మంచిది.

# శ్రామిక విజయానికి చిహ్నం...మే దినోత్సవం

## ప్రపంచ కార్మిక దినోత్సవం



మే దినోత్సవం కార్మిక ఐక్యతకు సంకేతం. చైతన్యానికి ప్రతిరూపం. చాకిరీకి వ్యతిరేకంగా నినదించిన నేపథ్యం. వేలాది గొంతుకలు ఒక్కటైన సమయం. కార్మిక వర్గ పోరాట పటిమకు నిలువెత్తు నిదర్శనం. ఎనిమిది పని గంటల దినం కోసం పోరాట సందర్భం. ప్రాణ త్యాగాలకు వెరవని వైనం. యాజమాన్యం దిగి వచ్చిన క్రమం. నెరవేరిన కార్మిక లక్ష్యం. కార్మికులు సాధించిన విజయానికి నిలువెత్తు సాక్ష్యం. కొందరు కార్మికుల రక్త తర్పణం తో కార్మిక ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చిన నేపథ్యం. 1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలో పరిమిత పని దినాలను కోరుతూ లక్షలాది మంది కార్మికులు సమ్మె చేశారు. ప్రదర్శనను చెదర గొట్టేందుకు పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. మార్కెట్ ప్రాంతమంతా రక్తసిక్తమై కార్మికుల హాహాకారాలతో దద్దరిల్లింది. ఒక పోలీసు సార్జెంట్‌ను హత్య చేశారనే నిరాధార అభియోగంతో కార్మిక నాయకులైన సార్సన్, స్పైస్, ఏంగెల్,ఫిషెలను దారుణంగా ఉరి తీశారు. ఉరికంబ మెక్కిన "స్పైస్" నేను ఉరి తీయబడినంత మాత్రాన ఈ అగ్ని జ్వాల అంతరించదు. "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అని ప్రభోదించాడు. స్పైస్ మరణ నినాదం శ్రామిక జన శంఖారావమై విశ్వవ్యాప్తంగా మార్మోగి శ్రామిక చైతన్యాన్ని రగుల్కొలిపింది. చికాగో అమరవీరుల సంస్మరణ దినంగా చరిత్రకెక్కిన మే 1 మేడే గా నిలిచి పోయింది. ఈ ఉద్యమం ప్రాదేశిక సరిహద్దులు దాటి ప్రపంచంలోని అన్ని దేశాలకు విస్తరించి చివరకు శ్రామిక విజయానికి చిహ్నంగా రోజుకు 8 గంటల పని చట్టబద్ధం చేయబడింది. అదే మేడే కు అంకురార్పణ. 1890 మే 1వ తేదీన అమెరికా కార్మిక సంస్థ (ఎ.ఫ్.ఎల్) ఏటా మే 1 అంతర్జాతీయ కార్మిక సంఘీభావ దినోత్సవంగా జరపాలని సూచించింది. నాటి నుండి నేటి వరకు ఈ మేడే విశ్వవ్యాప్తంగా ఆచరణీయమైంది. ట్రేడ్ యూనియన్లు గాని, పార్లమెంటు గానీ లేని రష్యాలో 1891 మే 1న మార్క్సిస్టులు రహస్యంగా తొలిసారిగా అంతర్జాతీయ కార్మిక సంఘీభావ దినోత్సవం జరిపారు. ఆనాటి నుండి మే దినోత్సవ సంబరం రష్యా కార్మిక వర్గ విప్లవాత్మక సంప్రదాయంగా పరిణమించింది. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో మే డే నాడు యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు చేపట్టేవారు. తరవాతి దశకంలో మే 1ని నాజీల వ్యతిరేక దినోత్సవంగా జరిపేవారు. హిట్లర్ పాలనలో ఆ రోజుని జాతీయ కార్మికుల దినోత్సవంగా జరుపుకునే వారు. ఇటలీలో ముసోల్నీ, స్పెయిన్‌లో జనరల్ ఫ్రాంకోలు మే డే పైన అనేక ఆంక్షలను విధించారు. భారత దేశంలో చికాగో కంటే ముందే కలకత్తాలో కార్మికులు నిర్ణీత పనిగంటల కోసం హౌరా రైల్వేస్టేషన్లో 1862లో సమ్మెచేశారు. అప్పటి వరకు ఆ రైల్వే కార్మికులు గంటలు పనిచేసే వారు. అప్పుడే బెంగాల్ పత్రికల్లో పాలక వర్గానికి చెందిన అధికారులు ఎన్ని గంటలు పని చేస్తారో మేము కూడా అన్ని గంటలే పని చేస్తామని డిమాండ్ చేశారు. కాగా, అది విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారలేదు. తొలిసారిగా భారత్‌లో 1923 సంవత్సరంలో మే 1వ తేదీ మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను జరుపు కున్నారు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటంతో అప్పటి నుంచే కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. ఈ చైతన్యంతో 'మే డే'ను పాటిస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమదోపిడీ, అధికంగా పనిచేయించు కోవడం కద్దు. నానాటికీ నిరుద్యోగ రక్కసి విజృంభిస్తున్న నేపథ్యంలో, ఎలాగైనా ఉద్యోగం పొందాలనే తపన, బలహీనత క్రమంలో, ప్రపంచ బ్యాంకు, బహుళజాతి కంపెనీల ఒత్తిళ్ళ ఫలితంగా... కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు హామీలిస్తున్నాయి. ఐ.టి.రంగంలో మార్కెట్ శక్తుల ద్వారా శ్రమ దోపిడీ నానాటికీ పెట్రేగి పోతున్నది. అమెరికా కేంద్రంగా వున్న కంపెనీలు... కార్మిక చట్టాలు అమలుకు నిచుకొని మన దేశంలో కంపెనీలు పెడుతూ, పని వేళలకు మించి రాచి రంపాన పెడుతున్నారు. అలా విద్యావంతులైన యువత అధిక జీతాలకు ఆశపడి, కంపెనీల నియంతృత్వ పోకడలకు తలొగ్గి, ఆరోగ్యాలను ఫణంగా పెట్టి, జీవితాలను కొవ్వొత్తుల్లా కరిగించు కుంటున్నారు. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో అమలుకై పోరాటం అత్యంత అవసరం, అనివార్యం. ఇక అసంఘటితరంగం. గురించి చెప్పాల్సిన అవసరం లేదు. కాంట్రాక్టు, పార్ట్‌టైం, ఔట్ సోర్సింగ్‌లోను ఉద్యోగులకు ఏ కార్మిక చట్టాల నియమాలు వర్తించవు. శతాబ్ద కాలం నాటి పరిస్థితులే పునరావృతం అవుతున్న వేళ...ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా... అలనాటి కార్మికవర్గ చైతన్యం మళ్లీ రావాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల...

# నిబద్ధతకు ప్రతిరూపం పుచ్చలపల్లి



ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు, సమసమాజం కోసం పోరాడిన విప్లవకారుడు. కులవ్యవస్థను నిరసించి పేరులో కులాన్ని సూచించే పదాన్ని తొలగించుకున్న ఆదర్శవాది. ఉద్యమాల కోసంతన వాటా కింద వచ్చిన యావదాస్తిని ప్రజా పోరాటాల కోసం ఖర్చు చేసిన మార్గదర్శి. ప్రజలకు, పార్టీకి పూర్తి కాలం ప్రజలకు, పార్టీకి సేవలు అందించాలనే ఉద్దేశంతో పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్న గొప్ప త్యాగశీలి. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట యోధుడు. ఇలా పేర్కొంటూ వెళితే, పేజీలు చాలవు. ఆయనే కామ్రేడ్ "పి.ఎస్". గా పిలువబడిన, "కమ్యూనిస్టు గాంధీ"గా పేరొందిన పక్కా కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య. ప్రపంచ కార్మిక దినోత్సవం రోజున జన్మించి, కమ్యునిజాన్ని ఔపోసన పట్టి, కన్ను మూసే వరకు ఆ భావజాలంలోనే కొనసాగిన పోరాట యోధుడు. పుచ్చలపల్లి సుందరయ్య, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో ఒక భూస్వామ్య కుటుంబంలో 1913, మే 1 న జన్మించారు. తండ్రి వెంకటరామిరెడ్డి, తల్లి శేషమ్మ. తల్లిదండ్రులు సుందరరామిరెడ్డి అని పేరు పెట్టారు. ఆరేళ్ళ వయసులో తండ్రి మరణించగా, ప్రాథమిక విద్యను వీధిబడిలోనే, తరువాత తిరువళ్ళూరు, ఏలూరు, రాజమండ్రి, మద్రాసు లలో చదివారు. గాంధీజీ నాయకత్వం పట్ల ఆకర్షితులై, సుందరయ్య 1930లో తన 17వ యేట ఉన్నత పాఠశాల రోజుల్లోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలలోను, ఉప్పు సత్యాగ్రహం లోను, సహాయ నిరాకరణోద్యమం లోను పాల్గొని కారాగార శిక్ష అనుభవించారు. అతనిని నిజామాబాద్, బోర్స్టల్ స్కూలులో ఉంచారు. ఆ సమయంలో ఆయనకు కమ్యూనిస్టులతో పరిచయం ఏర్పడింది. విడుదల అయినాక తన స్వగ్రామంలో వ్యవసాయ కార్మికులను సంఘటితం చేయడానికి కృషి చేశాడు. అమీర్ హైదర్ ఖాన్ స్ఫూర్తితో సుందరయ్య భారతీయ కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అప్పటికి ఆ పార్టీ నిషేధంలో ఉంది. 1930 దశకంలో దినకర్ మెహతా, సజ్జద్ జహీర్, ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్, సోలీ బాట్లివాలా వంటి జాతీయ కార్య నిర్వాహక వర్గ సభ్యులైన ప్రముఖ కమ్యూనిస్టు నేతలతో చేరి సుందరయ్య క్రమంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యదర్శి అయ్యారు. అమీర్ హైదర్ ఖాన్ అరెస్టు తరువాత దక్షిణాదిలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించే బాధ్యతను పార్టీ కేంద్ర కమిటీ సుందరయ్యకు అప్పగించింది. ఈ సమయంలోనే కేరళకు చెందిన నంబూద్రిపాద్, కృష్ణ పిళ్ళై వంటి నాయకులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీనుండి కమ్యూనిస్టు పార్టీలోకి మారారు. సుందరయ్య ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు శాఖను ప్రారంభించారు. ఇతర రాష్ట్రాలలో కమ్యూనిస్టు శాఖల ప్రారంభానికి కూడా స్ఫూర్తినిచ్చారు. 1936లో అఖిల భారత కిసాన్ సభ ప్రారంభించిన వారిలో సుందరయ్య ఒకరు. ఆ సభకు సంయుక్త కార్యదర్శిగా కూడా ఎన్నికయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటీషు ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించి నపుడు, 1939 నుండి 1942 వరకు, నాలుగేళ్ళు అజ్ఞాతంలో గడిపారు. 1943లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేశారు. బొంబాయిలో మొదటి పార్టీ కాంగ్రెస్ జరిగింది. తరువాత రెండవ పార్టీ కాంగ్రెస్ కలకత్తాలో జరిగింది. రెండుసార్లు కేంద్ర కమిటీ సభ్యునిగా సుందరయ్య ఎన్నికయ్యారు. కలకత్తా సమావేశంలో పార్టీ సాయుధ పోరాటంను సమర్థిస్తూ తీర్మానం చేసింది. దీనిని "కలకత్తా థీసిస్" అంటారు. అప్పటి సాధారణ కారదర్శి బి.టి.రణదివే ఈ తీర్మానాన్ని బలంగా సమర్థించారు. తత్ఫలితంగా కమ్యూనిస్టు కార్యకర్తలు ఆయుధాలను సమకూర్చుకోవడం ప్రారంభించారు. త్రిపుర, తెలంగాణ, తిరువాన్కూరు ప్రాంతాలలో సాయుధ పోరాటాలు జరిగాయి. వీటిలో అత్యంత ప్రముఖమైనది నిజాం పాలన కాలంలో సాగిన తెలంగాణా సాయుధ పోరాట ఘట్టం. ఆ పోరాటానికి ముఖ్యమైన నాయకులలో సుందరయ్య ఒకరు. పోరాట చివరి దశలో 1948 నుండి 1952 వరకు సుందరయ్య అజ్ఞాతంలో గడిపారు. 1952 లో ప్రత్యేక పార్టీ సమావేశంలో మళ్ళీ కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. పార్టీ అత్యున్నత స్థాయి సంఘమైన "పొలిట్ బ్యూరో" సభ్యునిగా కూడా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన మూడవ పార్టీ కాంగ్రెసులోను, పాలక్కాడ్‌లో జరిగిన నాలుగవ పార్టీ కాంగ్రెసులోను కూడా కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. తరువాత అమృత్‌సర్‌లో జరిగిన ఐదవ పార్టీ కాంగ్రెస్‌లో సెంట్రల్ ఎక్జిక్యూటివ్ కమిటీకి సభ్యునిగా ఎన్నికయ్యారు. ఈ సమయంలోనే పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. 1962 లో చైనాతో భారతదేశం యుద్ధం సందర్భంగా, పార్టీ నాయకత్వంలో ఎస్.ఎ. డాంగే వర్గం భారత ప్రభుత్వాన్ని సమర్థించింది. అంతే కాకుండా చైనా, రష్యా విభేదాలు తలెత్తిన నేపథ్యంలో డాంగే వర్గం రష్యాకు అనుకూలమైన పంథాను సమర్థించింది. అయితే పి.సి.జోషి, రణదివే వంటి నాయకుల వర్గం ఈ విధానాన్ని రివిజనిస్టు మార్గంగా భావించింది. డాంగే వర్గాన్ని లెఫ్టిస్టులనీ, రణదివె వర్గాన్ని రైటిస్టులనీ పిలిచారు. లెఫ్టిస్టు వర్గంలో ఉన్న ప్రముఖ నాయకుడైన సుందరయ్య అమృత్‌సర్ సమావేశం సమయంలో పార్టీ నాయకత్వంలో అధికుల (డాంగే వర్గం) దృక్పథాన్ని వ్యతిరేకిస్తూ, తన బాధ్యతలన్నింటికీ రాజీనామా చేశారు. 1962 నవంబరులో, చైనా యుద్ధం సమయంలో సుందరయ్యను అరెస్టు చేశారు. "తెలంగాణా ప్రజల పోరాటం – దాని పాఠాలు" అన్న నివేదికలో సుందరయ్య అప్పటి పరిస్థితులనూ, పార్టీ విధానాలనూ, పోరాట క్రమాన్నీ విశదంగా విశ్లేషించాడు. సుందరయ్య తయారు చేసిన ఈ నివేదికను భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 1972 డిసెంబరు నెలలో విడుదల చేసింది. అక్టోబరు – నవంబరు 1964 లో జరిగిన 7వ పార్టీ కాంగ్రెస్‌లో భారతీయ కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. అందులో లెఫ్టిస్టులన బడేవారు భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పేరుతో క్రొత్త పార్టీగా ఏర్పడ్డారు. ఆ పార్టీకి సుందరయ్య సాధారణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సమావేశం జరిగిన కొద్ది కాలంలోనే భారత జాతీయ కాంగ్రెసు ప్రభుత్వం అనేక మంది సి.పి.ఐ-ఎమ్ నాయకులను అరెస్టు చేసిన సమయంలో సుందరయ్యా మే 1966 వరకు నిర్బంధంలో ఉన్నారు. 1975 – 1977 కాలంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)ని ప్రకటించి నపుడు అరెస్టును తప్పించు కోవడం కోసం సుందరయ్య అజ్ఞాతంలోకి వెళ్ళారు. 1976 వరకు సుందరయ్య సి.పి.ఐ-ఎమ్ పార్టీ సాధారణ కార్యదర్శిగా కొనసాగారు. 1976 లో, ఎమర్జెన్సీ కొనసాగుతున్న సమయంలో, పార్టీలో "రివిజనిస్టు" భావాలను వ్యతిరేకిస్తూ సుందరయ్య సాధారణ కార్యదర్శి పదవికి, పొలిట్ బ్యూరో సభ్యత్వానికి రాజీనామా చేశారు. 1952 లో సుందరయ్య మద్రాసు నియోజక వర్గం నుండి పార్లమెంటు రాజ్యసభకు ఎన్నికయ్యారు. పార్లమెంటులో కమ్యూనిస్టు వర్గానికి నాయకుడయ్యారు. తరువాత రాష్ట్ర శాసనసభకు ఎన్నికై, 1967 వరకు శాసన సభా సభ్యునిగా కొనసాగారు. కొంత కాలం విరామానతరం 1978 లో శాసన సభకు ఎన్నికై, 1983 వరకు కొనసాగారు. లీలా అనే సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగిని 1943 ఫిబ్రవరి 27న పార్టీ ప్రధాన కార్యదర్శి పీసీ జోషీ, మరికొద్ది మంది పార్టీ నేతల సమక్షంలో వివాహం చేసుకుని, 1944 చివర్లో పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించు కోవడం ఆయన కుల పక్షపాత రాహిత్యాన్ని స్పష్టం చేస్తుంది. తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడై, కుల వ్యవస్థను నిరసించిన పుచ్చలపల్లి సుందర రామిరెడ్డి...కులాన్ని సూచించే రెడ్డి తోక పదాన్ని పూర్తిగా తొలగించుకున్న ఆదర్శ మూర్తి. పార్లమెంటు భవనానికి రాష్ట్ర విధానసభకు వెళ్ళినపుడు సైకిలును ఉపయోగించడాన్నిబట్టి ఆయన నిరాడంబరత తేటతెల్లం అవుతుంది. పేదరికం, దోపిడీ నుంచి పేదల విముక్తికి జీవితాన్ని అంకితం చేసిన సుందరయ్య 1985, మే 19న పుచ్చలపల్లి కన్నుమూశారు.

# మానవత్వానికి పట్టంగట్టిన మహనీయుడు

850 సంవత్సరాల క్రితమే ప్రజాస్వామ్య జ్యోతి ప్రగల్భింపజేసిన మహాత్ముడి కథ ఇది! అపూర్వ ప్రజాస్వామ్యవాది మహాత్మా బసవేశ్వరుడు, సమానత్వ జ్యోతిగా, సామాజిక న్యాయ గర్జనగా చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిన సామాజిక విప్లవకారుడు, విశ్వగురు, మహా మానవతావాది, సంఘ సంస్కర్త. 12వ శతాబ్దంలో కుల, మత, వర్గ, వర్ణ వ్యవస్థలకు వ్యతిరేకంగా గళమెత్తి, స్త్రీ-పురుష అసమానతలను తొలగించడానికి కృషి చేసిన అభ్యుదయవాది.

భారతదేశ మానవ హక్కుల చరిత్రలో తొలిపేజీని రాసిన గొప్ప మహనీయుడు, మానవ కల్యాణం కోసం స్వతంత్ర సమాలోచనలు చేసిన మొదటి వ్యక్తి, మూఢాచారాలను ధిక్కరించిన ధీరుడు, అనుభవ మంటపం ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిన మార్గదర్శకుడు. 'దేహమే దేవాలయం,' 'చేసే పనే దైవం' వంటి సందేశాలతో మానవతా విలువలను ప్రపంచానికి ప్రసాదించారు. కుల, మత, లింగ, వర్గ భేదాలతో కూడిన సమాజంలో అసమానతలను సవాలు చేస్తూ, %ఎవజూవఅఎవత్ం%:1, ఆయన రగిలించిన సామాజిక సంస్కరణ జ్యోతి నేటికీ స్ఫూర్తినిస్తోంది.

1134లో కర్ణాటకలోని బాగవాడి గ్రామంలో శైవ బ్రాహ్మణ కుటుంబంలో మాదిరాజు, మాదాంబిక దంపతులకు జన్మించిన బసవన్న బాల్యంలోనే మూఢాచారాలను ప్రశ్నించాడు. ఎనిమిదో ఏట ఉపనయనం చేయాలన్న తండ్రి మాటను తిరస్కరించి, అక్క నాగాంబిక వద్ద గురుకులంలో వేద శాస్త్రాలు, పురాణాలు, సాహిత్యం, గణితం, సంగీతం వంటి విద్యలలో ప్రావీణ్యం సంపాదించాడు. బిజ్జల చక్రవర్తి కొలువులో చేరి, మేనమామ బలదేవర కుమార్తెను వివాహమాడి, ప్రధానమంత్రి పదవికి ఎదిగాడు. నీతి, నిబద్ధత, సమాజసేవల ద్వారా ధర్మ పరిపాలనను ముందుకు నడిపించాడు. 12వ శతాబ్దంలో బసవన్న స్థాపించిన అనుభవ మంటపం ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి ప్రజాస్వామ్య వేదికగా నిలిచింది.

కుల, మత, లింగ, వర్గ భేదాలకు అతీతంగా, స్త్రీలు, దళితులు సమానంగా చర్చల్లో పాల్గొన్నారు. 'ప్రతి మనిషి ఒక ఓటు' సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టారు. మహిళలు వేదాలు బోధించి, నిర్ణయ ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు. ఇష్టలింగ ధారణ ద్వారా ఆధ్యాత్మిక సమానత్వాన్ని నెలకొల్పారు. అస్పృశ్యతను సవాలు చేసిన ఈ వేదిక నేటి పార్లమెంట్‌లకు స్ఫూర్తిగా నిలుస్తుంది. బసవేశ్వరుడు స్థాపించిన లింగాయత ధర్మం సమానత్వం, న్యాయానికి ప్రతీక. 'శ్రమే పూజ, కాయకమే కైలాసం' సిద్ధాంతంతో బాల్య వివాహాలు, సతీసహగమనం, నరబలి, పశు బలి వంటి మూఢాచారాలను నిర్మూలించారు. ఇష్టలింగ ధారణ ద్వారా ప్రతి భక్తుని స్వాతంత్ర్యాన్ని, కులాంతర వివాహాలను, దళితుల ఆలయ ప్రవేశాన్ని ప్రోత్సహించారు. 'పుట్టుకతో కాదు, కర్మతో గొప్పతనం' అంటూసమానత్వాన్ని బలపరిచారు. నిరాకార శివుడే సర్వేశ్వరుడని, శివతత్వ ప్రచారంతో లింగాయత ధర్మానికి బీజం వేశారు. శాఖాహారాన్ని స్వీకరించి, సహజ శివయోగాన్ని ప్రసరింపజేశారు. బసవేశ్వరుడు 64 లక్షలకు పెగా వచనాలు రాసినప్పటికీ, కొన్ని వేలు మాత్రమే లభ్యమవుతున్నాయి. 'కాయకమే కైలాసం', 'జ్ఞానమే గురువు' వంటి వచనాలు కుల వ్యవస్థను ఛేదించి, ప్రేమ, సమానత్వం, న్యాయ విలువలను వ్యాప్తి చేశాయి. ఈ వచనాలు మానవతా మార్గాన్ని చూపాయి, సమాజాన్ని సరిదిద్దాయి, ధర్మం అంటే నిజాయితీ అని బోధించాయి. అన్ని భాషలలో అనువదించి, ఈ వచనాలను నేటి తరానికి అందించాలి. తెలంగాణ ప్రభుత్వం బసవ జయంతిని అధికారికంగా జరుపుతూ, ట్యాంక్ బండ్‌పై విగ్రహం స్థాపించి, వీరశైవ లింగాయత కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు వీరశైవ లింగాయతుల సర్వతోముఖ అభివృద్ధి కోసం కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి, యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. బసవ చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చడం, బీసీ జాబితాలో వీరశైవ లింగాయతులను చేర్చడం కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత. భారత ప్రభుత్వం పార్లమెంట్ ప్రాంగణంలో బసవేశ్వరుని విగ్రహాన్ని, 2006లో 5, 100 రూపాయల నాణాలను విడుదల చేసింది. డాక్టర్ నీరజపాటిల్ కృషితో లండన్‌లో ప్రధాని మోడీ గారి చేతుల మీదుగా విగ్రహం ఆవిష్కరించబడింది.

## పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 724 మంది విద్యార్థులకు 680 మంది ఉత్తీర్ణత...

**మండల విద్యాధికారి గంగుల నరేశం**

కోరుట్ల ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి) బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కోరుట్ల మండలంలోని 18 వివిధ యాజమాన్య పాఠశాలల నుండి 724 మంది విద్యార్థులు హాజరుకాగా 680 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు మండలంలో 95.2 శాతం ఉత్తీర్ణత సాధించారు మండలంలోని ఐదు పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యూసుఫ్ నగర్ అయిలాపూర్ నాగుల పేట ఎకిన్ పూర్ కోరుట్ల సోషల్ వెల్ఫేర్ బాయ్స్ లో మండలంలో 555 మార్కులతో మోడల్ స్కూల్ కల్లూరు విద్యార్థిని కుమార్ టీ దీపిక ప్రథమ స్థానంలో 52 మార్కులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోహన్రావుపేటకు చెందిన విద్యార్థిని ఎస్ సాయి ద్వితీయ స్థానం సాధించినట్లు మండల విద్యాధికారి గంగుల నరేశం తెలిపారు

## భూగర్భజలాలు పెరిగితేనే రాబోయే తరాలకు మనుగడ ఎమ్మెల్యే జారె



అశ్వరావుపేట ,ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి): ఇందిరమ్మ చెరువు బాట కార్యక్రమం ద్వారా అశ్వారావుపేట మండలంలో పర్యటిస్తున్న గౌరవ శాసనసభ్యులు జారె ఆదినారాయణ మద్దికొండ మొద్దులమడ నందిపాడు కోయరంగాపురం నారాయణపురం అనంతారం గ్రామాలకు అనుసంధానంగా ఉన్న చెరువులు పంట కాలవలు చెక్ డ్యామ్ ల నిర్మాణం పునరుద్ధరణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే దిశగా వర్షపు నీటిని సమర్థవంతంగా నిల్వ చేసి రైతులకు మేలు కలిగించే లక్ష్యంతో చెరువుల మరమ్మత్తులు పంట కాలవల అభివృద్ధి నూతన చెక్ డ్యామ్ ల నిర్మాణం నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని ఈ రోజు నీటిని ఒడిసి పడితేనే భావితరాలకు ప్రాణదాతలుగా నిలుస్తామన్నారు భూగర్భ జలాలు అడుగంటకుండా చూసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుమ్మ రాంబాబు, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ ,ఇరిగేషన్ డిఈఈ ఎల్ కృష్ణ , ఏఈఈ కే ఎన్ బి కృష్ణ , ఆర్ఐ పద్మావతి , స్పెషల్ ఆఫీసర్ స్వప్న , మండల నాయకులు జూపల్లి రమేష్ , మొగల్పు చెన్నకేశవులు , జూపల్లి ప్రమోద్ ,సుంకవల్లి వీరభద్రరావు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు

## 10వ తరగతి ఫలితల్లో చిన్నాకిష్టాపూర్ పాఠశాల ప్రభంజనం





కుకునూర్ పల్లి ,ఏప్రిల్ 30 ప్రుదయం ప్రతినిధి): ఈరోజు వెలువడిన 10 వ తరగతి ఫలితల్లో కుకునూర్ పల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో లిచిన్నాకిష్టాపూర్ పాఠశాల విద్యార్థిని కె.శరణ్య 527 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి యెచ్. శ్రీనివాస్ గారు తెలిపారు. అలాగే 5 మంది విద్యార్థులు 500 పైగ మర్భ్ సాధించారు. వారిలో ఎస్.రమ్య (522), కె.కళ్యాణి (510), ఎస్. శ్రీహర్ష (503), టి. మౌనిక (500) మర్భ్ తో చిన్నాకిష్టాపూర్ విద్యార్థులు మంచి ప్రతిభ చూపించారని తెలిపారు. పాఠశాల నుండి 37 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 36 మంది విద్యార్థులు ఉత్తిర్ణత సాధించి 97.2% ఉత్తిర్ణతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో నే ప్రథమ స్థానం చిన్నాకిష్టాపూర్ పాఠశాల సాధించింది. రెండు విభాగల్లో మార్కుల్లో మరియు ఉత్తిర్ణత శాతంలో ప్రథమ స్థానంతో మంచి ఫలితాలను సాధించిందని తెలిపారు.

ఉపాధ్యాయుల కృషి విద్యార్థులు కష్టపడి చదవడంతో ఈ మంచి ఫలితలు సాధించామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలియజేయడం జరిగింది.

## అక్షయ తృతీయ నెల రోజులు ఉచితంగా మజ్జిగ పంపిణీ..

**తల్లిదండ్రుల పేరున మజ్జిగ పెరుగన్నం పంపిణీ...**
**శ్రీరాం రవీందర్ మహాసభ కోశాధికారి..**




పరకాల మార్చి 30 (వుదయం ప్రతినిధి): హనుమకొండ ఆర్యవైశ్య మహాసభ సభ్యుల ఆధ్వర్యంలో అక్షయ తృతీయ సందర్భంగా నెలరోజుల వరకు మజ్జిగ పంపిణీ చేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హేమ ప్రింటర్స్ సిద్ధి రవీందర్, నయీమ్ నగర్ రంగు బార్ సమీపంలో హనుమకొండలో మజ్జిగ దాతలు ఎవరైనా ముందుకు వస్తే వాసవి సేవాదళ్ అధ్యక్షులు పబ్బతి నాగభూషణం (9849090884)కి తెలియజేయాలని సూచించారు. తోట సురేష్ శ్రీరామ్ రవీందర్ మహాసభ కోశాధికారి అక్షయ తృతీయ సందర్భంగా వారి తల్లిదండ్రులు కీర్తిశేషులు శ్రీరామ్ బసవయ్య వజ్రాంబ గార్ల జ్ఞాపకార్థం మజ్జిగ మరియు పెరుగన్నము మంచినీళ్లు చల్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తోట సురేష్, ప్రధాన కార్యదర్శి దొడ్డ మోహన్ రావు, కోశాధికారి శ్రీరాం రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వేణు శెట్టి రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ మహాత్మ బసవేశ్వర 892వ జయంతోత్సవ వేడుకలు

**పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి**



నాగర్ కర్నూల్ ఏప్రిల్ 30(వుదయం ప్రతినిధి) జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శ్రీ మహాత్మ బసవేశ్వర 892 వ జయంతోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం నాడు జయంతి ఉత్సవ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి పాల్గొన్ని స్వామివారి చిత్రపటాన్ని పూలమలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు .శాసనసభ్యులు మాట్లాడుతూ 12 వ శతాబ్దంలో స్వామి వారు జన్మించాడని,బసవన్న బసవుడు అని, ఆయను విశ్వగురు అని పిలుస్తారని అన్నారు.సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ బేదాలను, లింగ వివక్షతను, సామూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది అని,లింగాయత్ ధర్మం స్థాపించారని కర్ణాటకలోని భాగేవాడే ఇతని జన్మస్థలం అన్నారు. 12వ శతాబ్దంలో కర్ణాటక దేశాన్ని పాలించాడని ప్రత్యేకంగా ఐదు రూపాయల నానంపై బసవేశ్వరుని చిత్రీకరించరని గొప్ప మహానుభావుడు బసవేశ్వరుడు అని తెలిపారు.ముందుగా శనేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమటం విశ్వనాథ శాస్త్రి స్థానిక ఎమ్మెల్యే కే.రాజేష్ రెడ్డి గారితో జ్యోతి ప్రజ్వలన,గణపతి పూజ చేయించడం జరిగింది.తర్వాత శ్రీ మహాత్మా బసవేశ్వర పూజ చేయించడం జరిగింది కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, అదన పు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రాజేశ్వరి కలెక్టరేట్ పరిపాలన అధికారిచంద్ర శేఖర్,నాగర్ కర్నూల్ మార్కెట్ చైర్మన్ రమణారావు,జిల్లా వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు జెమినీ సురేష్ ,అధ్యక్షులు కెంచే గిరిజా శంకర్, ప్రధాన కార్యదర్శి కెంచే రాజేష్ కుమార్ కోశాధికారి రాజశేఖర్,సంఘ సభ్యులు నాగ రవిశంకర్,శివశంకర్, ఆకుల రవిశంకర్ ,శెట్టిరాజేష్, మల్లికార్జున్,ఆకుల సాంబయ్య,శెట్టి శేఖర్,గంగాధర్, రాజ్ కుమార్,సూరజ్,కవిత, మంజుల మరియు వీరశైవ లింగాయతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పుష్కర మహోత్సవాలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు సమయానుకూలంగా పూర్తి చేయాలి

**రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**





జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 30(వుదయం ప్రతినిధి) పుష్కర మహోత్సవాలను దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు సమయానుకూలంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఆయన కాళేశ్వరంలో వివిఐపి ఘాట్, గోదావరి ఘాట్, 100 గదుల సత్రం మరియు వైద్యశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరిలో వ్యర్థాలు తొలగించి పరిశుభ్రం చేయాలని సూచించారు.సమయం చాలా తక్కువగా ఉందని, ఆశించిన స్థాయిలో ఇప్పటి వరకు పనులు జరగలేదని అధికారులు గుర్తించి నిర్దిష్ట కార్యాచరణతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన సదుపాయాలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున, అన్ని విభాగాలు అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి స్పష్టం చేశారు. పనులు వేగవంతం చేసేందుకు కూలీలను పెంచాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు.ఎస్పీ కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మహాదేవపూర్ మండల నాయకులు కోట రాజబాబు, మతిన్ ఖాన్, చల్ల తిరుపతి రెడ్డి, కట్కూ0 అశోక్,అక్బర్ ఖాన్, ఆశ్రర్ ఖురేసి, లేతకారి రాజబాబు, అశోక్, వామన్ రావు, కోట సమ్మయ్య, సాహిన్ ఖాన్,సోహెల్ ఖాన్, కామిడి శ్రీనివాస్ రెడ్డి, తోపాటు పలు శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

హైదరాబాద్,ఏప్రిల్30(వుదయం పతినిధి): యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో యాసంగి ధాన్యం కొనుగోలు, మిల్లులు, గోదాములకు తరలింపు, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు, అకాల వర్షాలు, ఎండ తీవ్రత దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ యాసంగి 2024- 25 వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, ఇందు కొరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్, గోనె సంచులు, టార్పాలిన్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేయబడిన మిల్లులకు వెంటనే తరలించాలని,అకాల వర్షాలు, వడగాలులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సి.ఎం.ఆర్ డిఫాల్టర్ రైస్ మిల్లులపై చర్యలకు ఉపక్రమించాలని తెలిపారు.




జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని,కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, గోనె సంచులు అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో రైతుల సౌకర్యార్థం త్రాగునీరు, ఓ ఆర్ ఎస్, అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. అకాల వర్షాలు, వడగాలుల పట్ల తగు చర్యలు తీసుకుంటున్నామని, బ్యాంకు గ్యారంటీ సమర్పించిన మిల్లులకు ధాన్యం పంపించడం జరుగుతుందని తెలిపారు. గత సీజన్ సి ఎం ఆర్ బియ్యం అందించని మిల్లులపై సమీక్షిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్షయ తృతీయ పర్వదినంను పురస్కరించుకొని పరకాల బస్టాండ్ ఆవరణలో మజ్జిగ పంపిణీ...



పరకాల మార్చి 30 (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణంలో అక్షయ తృతీయ పర్వదినంను పురస్కరించుకొని పరకాల అరుణ ఫర్టిలైజర్ పెస్టిసైడ్ %ఎ% సీడ్స్ ,సంజయ్ మెడికల్స్ స్టోర్స్ ,గంగా వాటర్ ప్లాంట్ ఆధ్వర్యంలో ఎండాకాలం వేసవి తాపం నుండి ప్రజలకు ప్రయాణికులకు దాహార్తిని తీర్చే సదుద్దేశంతో పరకాల బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో పరకాల కుంకుమేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు గారి చేతులమీదుగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా గందె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... వేసవికాలం ప్రారంభం నుండి బస్టాండ్ ప్రాంగణంలో బస్టాండ్ ఆవరణలో అరుణ ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ %ఎ% సీడ్స్, సంజయ్ మెడికల్స్ స్టోర్స్ ,గంగా వాటర్ ప్లాంట్ వారి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి చల్లని నీటిని ఉచితంగా ప్రయాణికులకు ప్రజలకు అందిస్తూ సేవ చేస్తున్న నేపథ్యంలో నేడు అక్షయ తృతీయ పర్వదినం అనగా పవిత్ర గంగానది భూమినీ తాకిన పర్వదినంగాను, అన్నపూర్ణాదేవి తన అవతారాన్ని స్వీకరించిన రోజుగా, వ్యాస మహర్షి మహాభారతాన్ని వినాయకుని సహాయంతో వ్రాయడం మొదలు పెట్టిన పర్వదినంగా కొనియాడే రోజు పాండవులకు సూర్య భగవానుడు అక్షయపాత్ర ఇచ్చిన రోజు ఇంతటి పవిత్రమైన రోజున ఆర్టీసీ సిబ్బందికి, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని ఈ చలివేంద్రమును ఎండాకాలం పూర్తి వరకు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రవిచంద్ర మరియు ఆర్టీసీ సిబ్బంది ,ప్రయాణికులు పాల్గొన్నారు

## ఉపాధి అవకతవకలపై అధికారి స్పందన..

**వుదయం దినపత్రికలో "ఉపాధిలో అవకతవకలు" అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారి స్పందన**




భద్రాద్రి కొత్తగూడెం ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి)సుజాతనగర్ మండలం సుజాతనగర్ గ్రామపంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఉపాధి కూలీలు ఎంతమంది పనులు చేస్తున్నారో అనే అవగాహన లేకుండా సుజాతనగర్ పంచాయతీ సెక్రెటరీ 550 మంది కూలీలు పనిచేస్తుండగా కేవలం 40 నుంచి 60 మంది కూలీల పని చేస్తున్నారని చెప్పడం పంచాయతీ పట్ల తమకున్న పట్టు ఎలాంటిదో కనబడుతోంది. ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశం వద్ద వారి ఫోటోలు ఏ రోజువి ఆ రోజే తీసి ఎన్ఎంఎంఎస్ యాప్ లో హాజరు అప్లోడ్ చేయకుండా 550 మంది కూలీలకు ఒకే ప్రింటెడ్ ఫోటో కాపీ తో ఎన్ఎంఎంఎస్ యాప్ లో హాజరు వేసి పెద్ద అవినీతి దాందాకు తెరలేపినట్లుగా 24వ తేదీన వుదయం దినపత్రికలో "ఉపాధిలో అవకతవకలు" అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సుజాతనగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో శోభారాణి స్పందించారు. సుజాతనగర్ గ్రామపంచాయతీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకాతవకలపై విచారణ జరిపి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై పై మెమో జారీ చేసి వారిపై చర్యలు తీసుకుంటామని సుజాతనగర్ మండల ఎంపీడీవో శోభారాణి అన్నారు .

## కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకుల పాఠశాలలు...

**100% ఫలితాలను సాధించిన విద్యార్థులు...**




రాయపర్తి ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి): ఎస్ఎస్సి పరీక్షా ఫలితాలలో రాయపర్తి గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి విజయకేతనాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ సరిత మాట్లాడుతూ పాఠశాలల్లోని 80 మంది విద్యార్థినీలకు గాను 80 మంది విద్యార్థులు ఉత్తీర్ణత 100% ఫలితాలను పొందారు. పదవ తరగతి పరీక్షలలో 600 మార్కులకు గాను జీ వైశాలి 546 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. జి వైష్ణవి 541/600, పి వైష్ణవి 540/600, డి వర్షిని తేజ 533/600, కే వైష్ణవి 528/600 మార్కులు సాధించి పాఠశాలకు టాపర్లుగా నిలిచారు.ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన టాపర్స్ లను ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

దీంతోపాటు 500 మార్కులకు పైగా 23 మంది విద్యార్థులు ఫలితాలను సాధించారన్నారు. పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 100% ఫలితాలు సాధించడం పట్ల ఉపాధ్యాయులను పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ సరిత అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు



జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 30(వుదయం ప్రతినిధి)భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో బుధవారం బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా బిసి సంక్షేమ అధికారి శైలజ బసవేశ్వరునికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూబసవేశ్వరుడు భారతదేశంలో సమానత్వానికి, మానవతా విలువలకు ప్రాతినిధ్యం వహించిన మహానుభావుడని కొనియాడారు.బసవేశ్వరుడు సిద్ధాంతంతో శ్రమకు గౌరవాన్ని, నైతికతను, సమాజంలో ఉన్న సాంఘీక అసమానతలు రూపుమాపడానికి సమాన హక్కులను ప్రతిపాదించారని అన్నారు. బసవేశ్వరునికి సేవలు నేటి తరాలకు తెలియాలనే లక్ష్యంతో ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వీర శైవ లింగయత్ మరియు వివిధ కుల సంఘాల నాయకులు, వివిద కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన భరత్ విద్యార్థులు



మధిర,ఏప్రిల్30(వృదయం ప్రతినిధి)తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాలలో ఖమ్మం జిల్లా మధిర పట్టణానికి చెందిన భరత్ విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ...... మండలంలోని 14 గవర్నమెంట్ పాఠశాలలో మధిర పట్టణంలోని తేళ్ల వసంతయ్య మెమోరియల్ హై స్కూల్ విద్యార్థి యశ్వంత్ కు 577 మార్కులు సాధించి మొదటి స్థానంలో ఉండగా రెండవ స్థానంలో జిల్లా పరిషత్ హై స్కూల్ మాటూరు పాఠశాలకు చెందిన కే దివ్య కు 549 మార్కులు, మూడవ స్థానంలో గవర్నమెంట్ హై స్కూల్ సిపిఎస్ మధిర విద్యార్థి కార్తికేయ కు 547 మార్కులు వచ్చాయి.అదేవిధంగా పట్టణంలోని 9 ప్రైవేట్ పాఠశాలల్లో భరత్ విద్యానికేతన్ విద్యార్థి ఎస్ రాజశేఖర్ రెడ్డి కు 579 మార్కులు సాధించి మొదటి స్థానంలో ఉండగా రెండవ స్థానంలో మధిర సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థి సిహెచ్ సంజనాకు 570 మార్కులు, మూడవ స్థానంలో నారాయణ ఫౌండేషన్ స్కూల్, మిలీనియం టాలెంట్ హై స్కూల్ విద్యార్థులకు 567 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భరత్ విద్యా సంస్థల అధినేతలు శీలం విద్యాలత వెంకటరెడ్డి మాట్లాడుతూ...శీలం రాజశేఖర్ రెడ్డి,తల్లపురెడ్డి సత్య భార్గవ్ రెడ్డి 579,చలువాది శైలేష్ 578, నరెడ్ల దేవాహర్ష రెడ్డి 577,రావిరాల కృతిక 574, ఇప్పల మోక్షజ్ఞ 570 కాగా, 550 మార్కులు పైగా 20 మందికి, 500 మార్కులు పైగా 45 మంది మార్కులు సాధించి మధిర మండలంలో భరత్ స్కూల్ ప్రథమ స్థానం సాధించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. అదేవిధంగా హాజరైన 62 మందికి 62 మంది ఉత్తీర్ణులై 100% పాస్ పర్సంటేజ్ సాధించి ఆల్ టైం రికార్డ్ సృష్టించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు,ఉమా,డీన్ రవీందర్ రెడ్డి,స్రవంతి,నాగరాజు,అజీమ్, ప్రసాద్,పాషా,త్రివేణి,భవాని తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ చట్టం అప్రజా స్వామీకమైనది. పోతినేని సుదర్శన్

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు.



మధిర ఏప్రిల్ 30 (వృదయం ప్రతినిధి) మధిరలో ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ మరియు వక్ఫ్ సవరణ చట్టంకు వ్యతిరేకంగా బహిరంగ సభకు హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారతదేశ ప్రజల మధ్య మత చిచ్చు రగిలించేందుకే ఈ చట్టాన్ని సవరణ చేసిందని ఈ సవర్ణ ముస్లిం మైనార్టీ వర్గాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ సవరణను వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం భారతీయులకు మత స్వేచ్ఛను ప్రసాదించిందని భారతీయులు తమకు నచ్చిన మతాన్ని స్వీకరించవచ్చని మత విషయాల్లో రాజకీయ జోక్యం తగదని అన్నారు. నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన తర్వాత దేశంలో చెప్పుకునే స్థాయిలో అభివృద్ధి సాధించలేక పోయిందని పేదరికం నిరుద్యోగం ఆకలి చావులు నిత్యం పెరుగుతున్నాయని ధరల పెరుగుదల సామాన్యుల సాధారణ ప్రజల నడ్డి విరుస్తున్నాయని వీటన్నిటినీ పక్కదారి పట్టించేందుకు ఇలాంటి చట్టాలు తీసుకురావడం వాస్తవాలను ప్రజలు గమనించకుండా చేయడం నరేంద్ర మోడీ ,బిజెపి ప్రభుత్వ విధానంగా మారిందని అన్నారు. ఈ సభ కార్యక్రమానికి సిపిఎం మధర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, మందా సైదులు, పార్టీ బోనకల్ మండల కార్యదర్శి కిలారి సురేష్, మధిర పట్టణ కార్యదర్శి పడకంటి మురళి, పట్టణ నాయకులు పాపినేని రామనసయ్య, తేలపోలు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



రాయపర్తి ఏప్రిల్ 30 (వృదయం ప్రతినిధి ):మండలం కొత్తూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాత్మ మహోత్సవంలో పాలకుర్తి శాసనసభ్యులురాలు మామిడాల యశస్విని రెడ్డి, పాల్గొని భక్తులతో కలిసి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి,బోనం ఎత్తి,ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కి ఘన స్వాగతం పలికారు,అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు శాలువాలతో సన్మానించి,ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూపెద్దమ్మ తల్లి దీవెనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రత్యేక మొక్కులు చెల్లించినట్లు ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి తెలిపారు, స్థానిక ప్రజలతో కలిసి ఉత్సవాలలో పాల్గొనడం సంతోషంగా ఉందని,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చెరువులను ఆధునీకరించడంతో మత్స్యకారులకు ఉపాధి మెరుపడిందన్నారు, మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని,గ్రామస్తుల కోరిక మేరకు ఆలయానికి ఉచిత విద్యుత్ అందించి, ఆల అభివృద్ధి కృషి చేస్తానని అన్నారు,ప్రజా ప్రభుత్వం ఏర్పడిన స్వల్పకాలంలోనే అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రారంభించిందని,నియోజకవర్గ ప్రజలందరికీ ఏ సమస్యలు ఉన్న నేరుగా తమకు తెలియపరచాలని కోరారు.

ఎమ్మెల్యే వెంట ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు హమ్య నాయక్, మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కందికట్ల యాకయ్య, మండల ముఖ్య నాయకులు, ముదిరాజ్ సంఘం సోదరులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతిలో గద్వాల జిల్లా 32వ నుంచి 26వ స్థానం

## 10.36% పెరుగుదలతో ఉత్తమ ఫలితం



గద్వాల ఏప్రిల్ 30 (వృదయం ప్రతినిధి)పదవ తరగతి పరీక్షలో 91.74% ఉత్తీర్ణతతో జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలో 26వ స్థానాన్ని సాధించినట్లు జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024%-%25 విద్యా సంవత్సరానికి పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లా 91.74% ఉత్తీర్ణత శాతం సాధించి రాష్ట్రవ్యాప్తంగా 26వ స్థానంని దక్కించుకుందని తెలిపారు. గత సంవత్సరం 81.38% ఉన్న ఉత్తీర్ణత ఈ సంవత్సరం 91.74%కి పెరిగి,ఏకంగా 10.36 శాతం పెరుగుదల నమోదైందని తెలిపారు. జిల్లాలో మొత్తం 7569 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 3759 మంది బాలురు, 3810 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. బాలురలో 89.49%, బాలికలలో 93.96% ఉత్తీర్ణత శాతం నమోదైందని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో పాఠశాలల పర్యవేక్షణ, ప్రధానోపాధ్యాయులతో సమీక్షలు, మౌలిక వసతుల అభివృద్ధి, హాజరు పెంపు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. గత సంవత్సరం 32వ స్థానంలో ఉన్న గద్వాల జిల్లా ఈ సంవత్సరం 26వ స్థానానికి చేరడం ఒక మంచి అభివృద్ధి సూచికగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కలసి చూపిన కృషి వల్లే ఈ ఉత్తమ ఫలితాలను సాధించగలిగామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాల కోసం మరింత కృషి చేసి విద్యా రంగాన్ని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. పదవ తరగతి ఫలితాల్లో విజయ సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు.

## జన్నారం మండలంలో వంద శాతం ఉత్తీర్ణత

### ఏంఈఓ విజయ్ కుమార్





జన్నారం, ఏప్రిల్ 30(వృదయం విలేకరి) జన్నారం మండలం పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిందని ఎంఈఓ విజయ్ కుమార్ తెలిపారు. కిష్టాపూర్ జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థి రాథోడ్ యోగేశ్వర్ టెన్త్ మండల టాపర్గా నిలిచారు. జన్నారం మండలంలో మొత్తం 620 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. కిష్టాపూర్ పాఠశాలకు చెందిన రాథోడ్ యోగేశ్వర్ 583 మార్కులు, అదే పాఠశాలకు చెందిన వేల్పుల నరేందర్ 570 మార్కులు సాధించారు. అలాగే పలు పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు. టెన్త్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఎంఈఓతో పాటు ఆయా పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

## నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే సంజయ్



జగిత్యాల ఏప్రిల్ 30 (వృదయం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియామకమైన రామకృష్ణారావుని వారి కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన జగిత్యాల నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్

# బసవేశ్వర జన్మదిన వేడుకలు...

## అదనపు కలెక్టర్ బి ఎస్ లత



జగిత్యాల ఏప్రిల్ 30 (వృదయం ప్రతినిధి) విశ్వ గురువు బసవేశ్వర జన్మదిన పురస్కరించుకొని జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సమీకృత కార్యాలయంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా అదన కలెక్టర్ బి ఎస్ లత ఎస్సి అభివృద్ధి అధికారి కే రాజ్ కుమార్ వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు బిసి అభివృద్ధి కార్యాలయ సిబ్బంది బిసి కుల సంఘాల నాయకులు లింగాయత్ కుల పెద్దలు తదితరులు పాల్గొని జయంతి వేడుకలు నిర్వహించారు అనంతరం అదనపు కలెక్టర్ బిఎస్ లత మాట్లాడుతూ బసవేశ్వరుని గొప్పతనాన్ని వివరిస్తూ వారు బోధించిన సమానత్వం సామాజిక న్యాయం మానవ విలువలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు

# శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో స్నేహితులతో కలిసి ఆనందంగా గడపాలి

**పదవి విరమణ చేసిన పోలీసు అధికారిని ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు**



అలంపూర్ ఏప్రిల్ 30(వృదయం ప్రతినిధి) పదవి విరమణ పొందిన పోలీస్ అధికారులు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో, స్నేహితులతో ఆనందంగా గడపాలని జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు ఐపీఎస్ అన్నారు. జిల్లాలో సుమరు 36 సంవత్సరాలుగా వివిధ హోదాలలో పనిచేసి ఈ రోజు పదవి విరమణ పొందుతున్న ఉండవల్లి పోలీస్ స్టేషన్ ఏ. ఎస్సై సుబ్బారెడ్డి దంపతులను జిల్లా ఎస్పీ తన ఛాంబర్ లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్మెంట్లో సుదీర్ఘంగా సర్వస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ చేయడం ఏంతో అభినందనీయం అని, ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని అన్నారు. వారి సర్వీస్ కు సంబంధించిన రిటైర్డ్ మెంట్ బెనిఫిట్ పత్రాలు అందచేశారు. పోలీస్ విభాగంలో సుధీర్ఘకాంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సిబ్బంది సేవను మరువమని పోలీసు రిటైర్ మెంట్ కేవలం తన వృత్తికే, కాని తన వ్యక్తిత్వానికి కాదు అని కొనియాడారు. విధి నిర్వహణలో పగలనక, రాత్రనక, పండగల సమయంలో భార్యా, పిల్లలకు దూరంగా ఉండి విధులు నిర్వహించినారని, పదవి విరమణ చేసిన పోలీసులు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ. మొగిలయ్య, కార్యాలయ ఏ.ఓ సతీష్ కుమార్, ఆలంపూర్ సీఐ రవి బాబు, ఉండవల్లి ఎస్సై మహేశ్, డీసీ అర్బి ఎస్సై షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో మీ సేవలు మరువలేనివి

## మాజీ జెడ్పిటిసి పైడి



దమ్మపేట, ,ఏప్రిల్ 30 (వృదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం దమ్మపేట గ్రామానికి చెందిన కనకదుర్గ సత్తుపల్లి లో చైల్డ్ డెవలప్ ఆఫీసర్ గా( సిడిపిఓ ) పదవి విరమణ పొందున శ్రీ నంగెడ్ల కనకదుర్గ ను మాజీ జెడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ తో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ విధి నిర్వహణలో మీ సేవలో మరువలేనివి అని అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం మారుమూల ముఖమామిడి నుంచి జిల్లాలో మీరు పని చేసిన చోట కనకదుర్గ అంటే తెలియని వారు ఎవరూ లేరు అని కొనియాడారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుత రావు, వాసవి క్లబ్ అంతర్జాతీయ కోఆర్డినేటర్ దారా మల్లికార్జునరావు, మెగడా సూరిబాబు, బొజ్జ రమేష్, బొల్లికొండ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు,

## పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు..

**తక్కువ మార్కులు వచ్చాయని ఉత్తీర్ణత సాదించలేక పోయామని నిరాశ చెందవద్దు...**

**తల్లిదండ్రులు పిల్లల మానసిక పరిస్థితిని గమనిస్తూ ధైర్యం కల్పించే విదంగా వాళ్లను ప్రోత్సహించాలి...**

**జిల్లా సుపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్**



జగిత్యాల ఏప్రిల్ 30 (వృదయం ప్రతినిధి) పదో తరగతి ఫలితాల సందర్భంగా విద్యార్థులు తమ ఫలితాలపై ఒత్తిడికి లోనవకుండా ఉండాలని ఆత్మహత్య వంటి తీవ్ర నిర్ణయాలను తీసుకోవద్దని జిల్లా సుపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ సూచించారు తక్కువ మార్కులు వచ్చాయని నిరాశ చెంది ఏదైనా అఘాయిత్యం చేసుకుంటే అలాంటి తరహా నిర్ణయాలు తల్లిదండ్రులు సమాజం విద్యారంగాన్ని చింతించే విధంగా మార్చేస్తాయన్నారు పరీక్షలలో మార్కులు జీవితానికి తుది నిర్ణయం కావని పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తే జీవితంలో ఓడినట్టు కాదని మార్కులు కేవలం కొలమానం మాత్రమేనని జీవితం మరెన్నో అవకాశాలతో నిండి ఉందన్నారు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఈ సందర్భంలో పిల్లలకు మానసికంగా ధైర్యం కల్పించే విదంగా తోడుగా ఉండాలి వాళ్లను ప్రోత్సహించాలి విఫలతల్ని అంగీకరించి దాన్ని మించిన విజయాల వైపు దారి చూపాలన్నారు ఈసందర్భంగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన...

## కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేపట్టాలి...

## జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్



జగిత్యాల ఏప్రిల్ 30 (వృదయం ప్రతినిధి) జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామంలో పాక్స్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ధాన్యం కొనుగోలు సెంటర్లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని సీరియల్ రిజిస్టర్ ప్రకారం ధాన్యం మ్యాచింగ్ చేయాలని ఆదేశించారు నాణ్యత ప్రమాణాలకు లోబడిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలన్నారు కొనుగోలు చేసిన ధాన్యాన్ని 24 గంటల లోపు మిల్లులకు తరలించాలన్నారు అలాగే ట్యాబ్ డేటా ఎంట్రీ నమోదు లారీ ట్రక్ సెట్ తప్పనిసరిగా ఎంట్రీ చేయాలన్నారు ప్రతి రోజు ఎన్ని లారీలు తరలించబడుతున్నాయి ఎంత ధాన్యం వస్తుందనీ ఒక్కో లారీలో ఎన్ని బస్తాలు అనే వివరాలు నిరంతరం నమోదు చేసి తగిన రికార్డులు నిర్వహించాలని సూచించారు ధాన్యం సెంటర్లలో తప్పనిసరిగా ప్యాడి క్లీనర్ ఉంచాలన్నారు రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని నీటి సదుపాయం ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని హమాలీలు ఉదయం సాయంత్రం సమయాల్లో పనులు చేయాలన్నారు ఈ కార్యక్రమంలో జగిత్యాల డివిజనల్ అధికారి మధుసూదన్ మండల తహసిల్దార్ రమేష్ ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# కలెక్టరేట్లో ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు

**జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్**



గద్వాల ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి) సమాజంలో కుల,వర్ణ,లింగ వివక్షతను వ్యతిరేకించిన గొప్ప అభ్యుదయవాది శ్రీ మహాత్మా బసవేశ్వరుడని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం ఆవరణంలో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వర జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని,బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి,జ్యోతి ప్రజ్వలన చేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ మహాత్మా బసవేశ్వరుడు కుల, వర్ణ, లింగ భేదాలు లేని సమసమాజ నిర్మాణం కోసం గళం విప్పి సమానత్వాన్ని ప్రబోధించి సమాజంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారని పేర్కొన్నారు. మహిళలకు గౌరవస్థానం ఇవ్వడం, సాధికారత కల్పించడంలో ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. శ్రమకు గౌరవం, నీతి, నిష్ఠ,సత్యాన్ని బసవేశ్వరుడు తన జీవిత విధానంగా మార్చుకున్నారని అన్నారు.ప్రతి ఒక్కరూ బసవేశ్వరుని ఆదర్శాలను అనుసరించి, సమాజంలో మంచి మార్పుకు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఆయన వచనాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు,బిసి సంక్షేమ అధికారి రమేష్ బాబు, ఏఓ నరేందర్, అధికారులు, సంఘం సభ్యులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాలలో ప్రతిభ చాటిన గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులు



జగిత్యాల ఏప్రిల్ 30(వుదయం విలేఖరి): జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులు బుధవారం తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో ఆల్మాస్ ఫాతిమా (574), జుబియా మహీవీన్ (571), మాసర్తి రాహుల్ (571), పి చరిత(570),సామ రోహిత్ (567), సాతాల బాలాజి (560), బండ శశాంక్(557)మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు.పాఠశాలలో అత్యధిక శాతం విద్యార్థులకు 500 పైగా మార్కులు సాధించగా పాఠశాల మొత్తం 100% శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయురాలు అరుంధతి తెలిపారు.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో శారద స్కూల్ ప్రభంజనం.



పరకాల ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణంలోని ప్రముఖ పాఠశాల శారద విద్యాలయంలో విద్యార్థిని విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో 100కు 100% ఉత్తీర్ణతను సాధించి ప్రభంజనం సృష్టించారు. కూనూరు వర్షిత 580/600, మార్క మంజునాథ్ 570/600, తోట వైష్ణవి 565/600, గడ్డం శ్రావణ్ కుమార్ 556/600, ఇప్పసాయి చరణ్ 550/600, రావుల రణధీర్ 548/600,


500 మార్కులకు పైగా మార్కులు సాధించిన మా విద్యార్థులు 60 మంది అని తెలుపుటకు సంతోషిస్తున్నాము. ఈ సందర్భంగా పదవ తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పాఠశాలకు అందించిన విద్యార్థిని విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించి శాలువా తో సత్కరించారు.

# పౌర హక్కుల దినోత్సవ సమావేశంలో చట్టాలపై అవగాహన




జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 30(వుదయం ప్రతినిధి)మహాదేవపూర్ మండలంలోని బొమ్మాపూర్ గ్రామంలో అధికారులు పౌర హక్కుల దినోత్సవ సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు బుధవారం బొమ్మపూర్ గ్రామా పంచాయితీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన పౌర హక్కుల దినోత్సవ సమావేశంలో ఎంపీఓ ప్రసాద్, గిర్ధవర్ జగన్మోహన్ రెడ్డి లు పాల్గొని మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ తో పాటు మండల స్థాయి అధికారుల ఆదేశాల మేరకు పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు షెడ్యూల్డ్ తెగలు మరియు కులాల పై గ్రామంలో ఏదేని అంటరానితనం గాని, అస్పృశ్యత, వివక్షత ఉన్న వాటి గురించి చర్చించి, వాటిని నిర్మూలించుటకు ఎటువంటి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలనే చట్టాలపై అవగాహనా కల్పించారు ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్యామ్, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు లక్ష్మణ్, లింగాల రామయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాలలో ప్రతిభచాటిన విద్యార్థులు




బెల్లంపల్లి, ఎప్రిల్30 (వుదయం ప్రతినిధి) తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో తాండూరు మండల విద్యార్థులు ప్రతిభ చాటారు. మొత్తం 394 విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 97 % తో 384 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు బుధవారం ఎంఈఓ మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పి హెచ్. ఎస్. తంగళ్ళపల్లి, జెడ్పి హెచ్ ఎస్ ఉర్దూ మీడియం, ఎం జె పి పాఠశాల, విద్యాభారతి హైస్కూల్, సెయింట్ తెరిస్సా లు నూరు శాతం ఫలితాలు సాధించాయని వెల్లడించారు. ఎం జె పి పాఠశాల కు చెందిన చాటే హర్ష వర్ధన్ 583 మార్కులతో మండల టాపర్ గా, విద్యాభారతి హై స్కూల్ చెందిన జి లక్ష్మనరావు 568 మార్కులతో ద్వితీయ స్థానంలో, జెడ్పి హెచ్ ఎస్ అచ్చులపూర్ కి చెందిన పూజిత 567 మార్కులతో తృతీయ స్థానం వచ్చినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పదవ తరగతి 96% ఉత్తీర్ణతతో మెరుగైన ఫలితాలు సాధించిన మండల విద్యార్థులు...






అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 30 : (వుదయం ప్రతినిధి) మండలంలోని పదవ తరగతి విద్యార్థులు 96% ఉత్తీర్ణతతో మెరుగైన ఫలితాలు సాధించారని మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద్ కుమార్ పత్రిక ప్రకటన ద్వారా బుధవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మండల పరిధిలో 6 పాఠశాలల నుండి 303 మంది పదవ తరగతి పరీక్ష రాయగా 291 మంది ఉత్తీర్ణత సాధించారని,12 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారన్నారు.

కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో 48 మంది పదవ తరగతి పరీక్ష రాయగా 48 మంది విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారని, విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించడం జరిగిందని, రెసిడెన్షియల్ బాలికల పాఠశాల నుండి పి రుచిత 556 మార్కులతో మండల ప్రథమ స్థానంలో నిలిచిందని, ఎర్రగుంట పాఠశాలలో షేక్ అజ్మ 504 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందని, విద్యార్థి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించడం జరిగిందన్నారు..

# ముధోల్ కేజీబివిలో 100% ఉత్తీర్ణత




ముధోల్, మార్చ్30 (వుదయం ప్రతినిధి) ముధోల్ కేజిబివి విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫరహాత్ బేగం తెలిపారు. పాఠశాలలో 38 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 23 మంది విద్యార్థులు 500 పైన మార్కులు సాధించినట్లు తెలిపారు. అందరూ పాస్ అయ్యారని వెల్లడించారు. అత్యధికంగా అశ్విత -563, శ్రీవాణి-560, సుష్మిత- 547, అస్మిత- 545, స్వీటీ- 544, శృతి- 541 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆవే అభినందించారు.

# లక్ష ఒక్క రూపాయి పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ విరాళం.

**పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా మహా అన్నదానం కొరకు విరాళం.**

**ఆలయ చైర్మన్ మహాలక్ష్మి వెంకటనర్సయ్య.**



ఖానాపురం ఏప్రిల్ 30 వుదయం ప్రతినిధి.మండలంలోని బుధరావుపేట గ్రామంలోని శ్రీ భూ నీలా సమేత వెంకటేశ్వరస్వామి పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన ఆవుల కర్ణాకర్ ప్రమీల దంపతులు లక్ష ఒక్క రూపాయి మహా అన్నదానం కోసం ఉపయోగించాలని ఆలయ కమిటీకి అందజేసినట్లు ఆలయ చైర్మన్ మహాలక్ష్మి వెంకటనరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ గ్రామంలోని శ్రీ భూనీల సమేత వెంకటేశ్వరస్వామి పుష్కర(12వ) బ్రహ్మోత్సవాల సందర్భంగా మే 14 నుండి 18 వరకు నిర్వహించే శ్రీ భూ నీలా సమేత వెంకటేశ్వరస్వామి పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎవరికి తోచిన సహాయం వారు ఆలయ కమిటీకి అందించగలరని తెలుపుతూ తమరికి తోచిన విరాళం అందించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని దాతలను భక్తులను ప్రజలను గ్రామస్తులను ఆలయ కమిటీ తరపున కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు ముఖ్యులు బిక్కి మురళి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్దిని శాలువాతో సన్మానించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు.



ఖానాపురం ఏప్రిల్ 30 వుదయం ప్రతినిధి.ఏప్రిల్ 27న వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఎలుకతుర్తిలో బిఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రజతోత్సవ భారీ బహిరంగ సభకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసి బహిరంగ సభను కనివిని ఎరుగని రీతిలో విజయవంతం చేసి మన నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మండలంలోని అశోక్ నగర్ గ్రామంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామసహాయం ఉపేందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముచ్చ యాదగిరిరావు, ఆలయ చైర్మన్ జినుకల సురేష్, నాయకులు పిన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, ముద్దంగుల సంపత్, జరుపుల అశోక్, కూస లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ఆష్ట ప్రభుత్వ పాఠశాలలో 100% ఉత్తీర్ణత



ముధోల్, మార్చ్30 (వుదయం ప్రతినిధి) పదవ తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ముధోల్ మండలంలోని ఆష్ట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి గోపిడి రమణారెడ్డి తెలిపారు. పాఠశాలలోని రాజేష్- 549, అన్విత- 543, ఆలేఖ్య-540, నవనీత- 540 అత్యధిక మార్కులు సాధించినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఎడ్బిడ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని కీర్తన- 553 మార్కులు సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు

# ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో ఐక్య బహిరంగ సభ

**హిందూ ముస్లిం రాజకీయాలే వారి లక్ష్యం**

**రాంపూర్ ఎంపీ మౌలానా మొహిబుల్లా నద్వి ,**

**జె ఎన్ యు ప్రొఫెసర్ హఫీజ్ ల్ రెహమాన్**




మధిర ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి) దేశం లో మత విద్వేషం రగిలించడం, ప్రజాస్వామిక వ్యవస్థ బదులు హిందూ దేశం స్థాపనే వారి ధ్యేయం అని ప్రొపెసర్ , డాక్టర్ రామ్ పునియాని అన్నారు. బుధవారం మధిర లో ముసిం ఐక్య సంఘం మధిర నియోజక వర్గం అధ్యక్షులు మౌలానా ముజాహిద్ ఇషాతి ,ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్ అధ్యక్షతన ఈద్ మిలాప్, వక్ఫ్ సవరణ చట్టం వ్యతిరేక బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. మతం పేరుతో హింస, హత్యలు సాగిస్తూ 2 సీట్లతో ఎదిగి గత 11సంవత్సరాల నుండి అధికారం చెలాయిస్తూ మను ధర్మం తీసుకుని రావడాని కి ప్రయత్నిస్తున్నా వారు హిందూ , ముస్లింల ఐక్యతను దెబ్బ తీస్తున్నారని విమర్శించారు. వారి ప్రయత్నాలు హిందూ ముస్లింలకు మాత్రమే కాకుండా క్రిస్టియన్, జైన్ వంటి వారి కీ కూడా ప్రమాదమే అని ఆరోపించారు. వారి విద్వేషం కు వ్యతిరేకంగా మనం ప్రేమాభిమానాలు కురిపించాలని పిలుపు ఇచ్చారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన రాంపూర్ ( ఉత్తర ప్రదేశ్) సమాజ్ వాదీ పార్టీ ఎంపీ మౌలానా మోహిబ్బుల్లా నద్వి మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం కేవలం రాజ్యాంగం గానికి వ్యతిరేకం మాత్రమే కాకుండా మన ప్రజాస్వామ్యానికి ప్రమాద కరం అన్నారు. అంతే కాదు ఈ చట్టం రూప కల్పనలో డజన్ మందిలో ఒక్కరే ముస్లిం వ్యక్తి ఉండటం వక్ఫ్ ఆస్తుల సంరక్షణ, పేద ముస్లింల ప్రయోజనాలకు కోసం అనే వారి మాటల్లోని చిత్త శుద్ధి తెలుస్తుందన్నారు. వక్ఫ్ ఆ న్యాక్రాంతం విషయంలో కేంద్ర ప్రభుత్వం చేసిన సవరణ లో శిక్ష కాలాన్ని తగ్గించడం గమనిస్తే మరిన్ని ఆక్రమణలకు ప్రోత్సాహం కలిగించినట్లు ఉందని దుయ్యబట్టారు. ఈ విషయంలో రా జీ లేని పోరాటం ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివస్తుందని స్పష్టం చేశారు.జే ఎన్ యు ప్రొఫెసర్ హఫిజ్జుల్ రెహమాన్ మాట్లాడుతూ దేశంలో గత 11 సంవత్సరాల నుండి పరిపాలన చేస్తున్న భారతీయ జనతా పార్టీ హిందూ ముస్లిం పేరుతో రాజకీయాలు చేస్తూ మత కలహాలను సృష్టిస్తుందని ఆరోపించారు. ప్రస్తుతం వక్ఫ్ సవరణ చట్టం 2025 వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసమని అంటున్నా వాస్తవానికి ముస్లింల ఆస్తులనుదోచుకునేందు కే అని విమర్శించారు. రైతుల ప్రయోజనాల కంటూ రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకొచ్చినప్పుడు రైతులు ఏ విధంగా పోరాడి ఆ చట్టాలను వెనుకకు తీసుకునేటట్టు చేసిన తీరులోనే ఈ వక్ఫ్ సవరణ చట్టం ని కూడా వెనుకకు తీసుకోక తప్పదని హెచ్చరించారు. అప్పటివరకు మన పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. మైనార్టీ కమిషన్ తెలంగాణ చైర్మన్ తారీక్ అన్సారీ , మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహారావు , సిపిఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్ , ఎం బి టి అధికార ప్రతినిధి అంజాతుల్లా ఖాన్ ఖలీద్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా ఖమ్మం యూనిట్ బాధ్యులు మౌలానా మహమ్మద్ సయీద్ అహ్మద్ ఖాస్మీ , మహమ్మద్ అసాద్ , మహమ్మద్ ఇలియాస్ , ముఫ్తీ జలాలుద్దీన్ , మౌలానా అబ్దుల్ ఖాదర్ , హఫీజ్ మొహమ్మద్ జవ్వాద్ అహ్మద్ , టిఆర్ఎస్ ఖమ్మం జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పేటలో వైభవంగా బసవేశ్వర స్వామి జయంతి వేడుకలు



నారాయణపేట టౌన్ ఏప్రిల్ 30(వుదయం ప్రతినిధి) బసవేశ్వర జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని బసవేశ్వర స్వామి ఆలయంలో వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బసవేశ్వర జయంతి సందర్భంగా సరాఫ్ బజారులో గల శ్రీ బసవేశ్వర, వీరభద్రస్వామి ఆలయములో ఉదయం 7 నుండి 9 గంటలవరకు రుద్రాభిషేకము అష్టోత్రము మహా మంగళహారతి, నైవేద్యం ప్రత్యేక పూజాలతోపాటు 10 గంటలకు పతాకావిష్కరణ, 11: 30 లకు డోలారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రము 6 గంటలకు శ్రీవారి చిత్రపటముతో కాడేద్దుల జతలతో ఉరేగింపు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బసవేశ్వర దేవాలయం వ్యవస్థాపకులు ధర్మకర్త బుస్సయ్య స్వామి, మంజునాథ స్వామి, బాల్ లింగం, జాజాపూర్ జయప్ప, మంగల్గి సంగన్ బసప్ప , ఎలిగర్ శశిధర్, మనీ మోడీ, పవిత్ర, అవికా మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన రాఘవేంద్ర లిటిల్ హన్స్



జన్నారం, ఏప్రిల్ 30(వుదయం విలేకరి) పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో రాఘవేంద్ర లిటిల్ హాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ మరోసారి విజయకేతనం ఎగురవేసింది.రాఘవేంద్ర లిటిల్ హాన్స్ పాఠశాల లో చదువుతున్న మల్యాల శైనిత 600 మార్కులకు గాను 577 మార్కులు సాధించి మండలంలోనే 2వ స్థానం సాధించింది.టి.సిరివెన్నెల (563), బి.గంగోత్రి (559), ఏ.అభిరామ్ (557), ఎన్.సహస్ర (555), డి.మానస (551) మార్కులు సాధించారు.మొత్తం 29 మంది విద్యార్థులకు గాను 23 మంది విద్యార్థులకు 500 మార్కులకు పైగా సాధించారు.వంద శాతం ఉత్తీర్ణత సాధించినందుకు విద్యార్థులను ఉపాధ్యాయులను రాఘవేంద్ర విద్యాసంస్థల అధినేత ఎర్ర చంద్రశేఖర్, రాఘవేంద్ర విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎర్ర సంపత్ అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఏ.శ్రీనివాస్,డీన్ హేమలత షిండే, ఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 10 ఫలితాలలో సత్తా చాటిన పీఎం శ్రీ బాయ్స్ హై స్కూల్ కోదాడ విద్యార్థిని




కోదాడ రూరల్ ఏప్రిల్ 30(వుదయం) తెలంగాణ ఎస్ఎస్సి ఫలితాలలో పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ బాయ్స్ కోదాడ పాఠశాల విద్యార్థిని తాళ్లూరి రేఖ శ్రీ 571 మార్కులు సాధించి సత్తా చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ సలీం షరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య అందిస్తున్నట్లు అందుకు నిదర్శనమే ఈ మార్కులను తెలిపారు. విద్యార్థుల విజయానికి కృషిచేసిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను అభినందించారు.

# పది ఫలితాలలో ప్రతిభ చూపిన శ్రీ స్కూల్ విద్యార్థులు




కోదాడ టౌన్ ఏప్రిల్ 30(వుదయం) తెలంగాణ రాష్ట్ర ఎస్ఎస్సి ఫలితాలలో కోదాడ పట్టణంలోని శ్రీ స్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల ప్రిన్సిపల్ పి శ్రీనివాస్ తెలిపారు. సిహెచ్ అక్షయ 521 మార్కులు ఎండి రిదామహీన్ 558 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

# ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ...



కోదాడ రూరల్ ఏప్రిల్ 30(వుదయం) కోదాడ మండల పరిధిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ కాపుగల్లు విద్యార్థులు పదోతరగతి ఫలితాలలో నోటీ నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. 551 మార్కులతో బి లక్ష్మీ రూపిక మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన లక్ష్మీరూపిక సాయి చైతన్యలను అభినందించారు.

# పది పరీక్షల్లో మండల టాపర్గా గ్రీన్ వుడ్ పాఠశాల విద్యార్థులు




జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 30(వుదయం ప్రతినిధి) పదవ తరగతి పరీక్షల్లో మహాదేవపూర్ మండల టాపర్గా గ్రీన్ వుడ్ కాన్సెప్ట్ హై స్కూల్ విద్యార్థులు ర్యాంకును సాధించారు బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024 25 సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి పరీక్షల ఫలితాలను విడుదల చేయడంతో మహాదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్ వుడ్ కాన్సెప్ట్ హై స్కూల్ విద్యార్థులైన బి.వైదీక్ సాయి 577 మార్కులు సాధించి మొదటి ర్యాంకులో నిలిచి జి.అనూన్య 565 మార్కులు సాధించి రెండో ర్యాంకర్ గా మార్కులు సాధించింది ఎస్ ఎస్ సి ఫలితాలలో మహాదేవపూర్ మండలానికి సంబంధించి గ్రీన్ వుడ్ కాన్సెప్ట్ హైస్కూల్ విద్యార్థులు మండల స్థాయి టాపర్ గా మార్కులు సాధించడంతో పాఠశాల యజమాన్యం చీర్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ ఆకుతోట రాజ్ కుమార్ తో పాటు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు ఉపాధ్యాయుల బృందం తోపాటు ప్రజలు మండల టాపర్గా మార్కులు సాధించిన గ్రీన్ వుడ్ పాఠశాల విద్యార్థులను అభినందించారు.

# 13 సంవత్సరాలుగా నూటికి నూరు శాతం ఉత్తీర్ణత



కోదాడ టౌన్ ఏప్రిల్ 30(వుదయం) నిన్న విడుదలైన ఎస్ఎస్సి ఫలితాలలో కోదాడ పట్టణంలోని ఎస్ వి హై స్కూల్ విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ వల్లి పద్మ తెలిపారు. 554 మార్కులు సాధించి బట్టు త్రిష పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆమె తెలిపారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను ఆమె అభినందించారు.

# జిల్లా టాపర్ గా మహాత్మ జ్యోతిబాపూలే విద్యార్థి



బెల్లంపల్లి, ఎప్రిల్30 (వుదయం ప్రతినిధి)తాండూరు మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో పదవ తరగతి ఫలితాలలో చాటే హర్షవర్ధన్ 600 మార్కులకు గాను 583 సాధించి జిల్లా టాపర్ గా నిలిచాడు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వినోద్ కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయ కుటుంబానికి చెందిన విద్యార్థి మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల్లో చాటే హర్షవర్ధన్ అత్యధిక మార్కులు సాధించడం గర్వకారణం అని అన్నారు. అలాగే పదవ తరగతిలో మార్కులు సాధించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



పెద్దవంగర, ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి): మండలంలోని బావోజీ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు బానోత్ రాంసింగ్– సునిత దంపతుల కుమార్తె సునీత– రఘురాం వివాహ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి హాజరై నూతన వధూవరులకు పట్టువస్త్రాలు అందించి, ఆశీర్వదించారు. ఆమె వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, మండల ఇంచార్జి విజయ్ పాల్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బానోత్ గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి పొడిశెట్టి సైదులు గౌడ్, మాజీ సర్పంచ్ బానోత్ జమున, బీసీ సెల్ మండల అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోత్ సీతారాం నాయక్, యూత్ అధ్యక్షుడు బీసు హరికృష్ణ గౌడ్, సుంకరి మురళీధర్, జాటోత్ వెంకన్న, సుధగాని రాంబాబు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎరుకుల సమ్మయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

# పిఎసి చైర్మన్ అరికపూడి గాంధీతో కలిసి పెట్రోల్ బంక్ ని ప్రారంభించిన స్థాని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి




శేర్లింగంపల్లి ,ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి): శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోగల గోపనపల్లిలో నూతనంగా ఏర్పాటుచేసిన పెట్రోల్ బంకును స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మరియు పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు బిక్షపతి యాదవ్ మరియు భారతీయ జనతా పార్టీ నాయకులు రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు నిమిత్తం అందుబాటులోకి పెట్రోల్ బంక్ రావటం సంతోషంగా ఉందని అన్నారు. కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన భారత పెట్రోల్ బంక్ అందరికీ అందుబాటులో ఉండటమే కాకుండా వాహనదారుల అవసరాలు తీర్చడానికి తోడ్పడుతుందని ఆయన తెలిపారు. మాజీ శాసనసభ్యులుబిక్షపతి యాదవ్ మాట్లాడుతూ ప్రజా సేవతో పాటు పదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో వ్యాపారాన్ని వృద్ధి చేయడం కోసం గంగాధర్ రెడ్డి చేస్తున్న సేవ రాణించినట్టే వ్యాపార రంగంలో కూడా అడుగుపెట్టి పదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో గంగాధర్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బిపిసిఎల్ హైదరాబాద్ చర్లపల్లి టెరిటరీ మేనేజర్ గురురాజ్ సాంచ్, టెరిటరీ కోఆర్డినేటర్ కార్తీక్,

మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, పలువురు బిజెపి నాయకులు గోపనపల్లి గ్రామ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# చెక్ బౌన్స్ కేసులను పెద్దమొత్తంలో పరిష్కారానికి కృషి చేయాలి



జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 30(వుదయం ప్రతినిధి) చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించాలనే ఉద్దేశంతో జూన్ 09 నుండి 14 వ తేదీ వరకు నిర్వహించబోయే స్పెషల్ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున పరిష్కారం చేసేందుకు కృషి చేయాలనీ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఏ. నాగరాజు తెలిపారు.న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్లు, న్యాయవాదులతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ బ్యాంకులలో మరియు కోర్టులలో పెండింగులో ఉన్నటువంటి చెక్ బౌన్స్ కేసులను పరిష్కారం చేయడానికి బ్యాంకు మేనేజర్లు, న్యాయవాదులు కలిసిరావాలని అన్నారు. ఆర్థిక నేరాలను కట్టడి చేయడం నేటి అవసరం అని జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వి.శ్రావణ్ రావు, సీనియర్ న్యాయవాదులు మెరుగు రవీందర్, స్పెషల్ పి.పి. ఎన్. విష్ణువర్ధన్ రావు, సి.హెచ్. రాజేందర్, కే.కవిత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ప్రియాంక, ఏ. జి. పి. ఇందరపు శివకుమార్, రేగుల రాకేష్, భూక్యా రమేష్ నాయక్, ఎస్. బి. ఐ మరియు ఐ. సి. ఐ.సి. ఐ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

# హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో మహాత్మా బసవేశ్వర 892 వ జయంతి వేడుకలు



శేర్లింగంపల్లి ,ఏప్రిల్ 30 వుదయం (ప్రతినిధి) శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని ఆఫీస్ పెట్ డివిజన్ పరిధిలో గల హుడా కాలనీలో హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో శ్రీ మహాత్మ బసవేశ్వర892 జయంతి వేడుకలు పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ తో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ మాట్లాడుతూ హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతి వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో సంతోషించదగిన విషయమని ఆయన అన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పేద మహిళలకు సుమారు 200 మంది కి చీరలు పంపిణీ చేయడం జరుగుతుంద నీ ఆయన తెలిపారు. విద్య ,సమాజం, సమానత్వం ,గురించి పోరాటం చేసిన మహనీయుడు సామాజిక ఆధ్యాత్మి విప్లవకారుడు బసవేశ్వరుని జయంతి వేడుకలు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుళ్ల శ్రీనివాస్ యాదవ్, మల్లికార్జున్ శర్మ ,నరేంద్ర బల్ల ,పుట్టా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదవర్గాలకు గౌరవప్రదమైన జీవన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కృషి

మంత్రి శ్రీధర్ బాబు




జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 30(వదయం ప్రతినిధి)పేదవర్గాలకు గౌరవప్రదమైన జీవన వాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని దానిలో భాగంగానే ఇండ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.బుధవారం మహాదేవపూర్ మండలం ఎల్కేశ్వరం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇండ్లు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సమాజంలోని పేదవర్గాలకు గౌరవప్రదమైన జీవన వాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం ద్వారా నివాస అవసరాలను తీర్చడమే కాదు, మెరుగైన మౌలిక వసతులు కూడా కల్పించనున్నామని తెలిపారు. ప్రభుత్వ సంకల్పం మేరకు ప్రతి కుటుంబానికి ఇల్లు మౌలిక వసతులను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో నాణ్యత, సమయ పాలన పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయ లక్ష్మీ, ఎంపిడిఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోట రాజబాబు,చల్ల తిరుపతిరెడ్డి, అక్బర్ ఖాన్ ,మతిన్ ఖాన్, కటకం అశోక్, కోట సమ్మయ్య, అశ్రర్, రామన్ రావు, సోయల్ ఖాన్,తదితరులు పాల్గొన్నారు.

# ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో 100% ఉత్తీర్ణత




పెద్దవంగర:, ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి):పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా సర్కారు పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఔరా అనిపించారు. మండలంలోని పెద్దవంగర, చిట్యాల, బొమ్మకల్, అవుతాపురం, జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటుగా, కేజీబీవీ, ఎంజేపీ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. వడ్డెకొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 8 మంది పాసయ్యారు. కేజీబీవీ విద్యార్థులు 2020 నుండి వరుసగా వంద శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించారు. మండలంలో మొత్తం 275 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 274 మంది ఉత్తీర్ణులయ్యారు. పెద్దవంగర జెడ్పీ పాఠశాల విద్యార్థి కన్నె మేఘన 577 మార్కులు, చిట్యాల జెడ్పీ పాఠశాల విద్యార్థి రాపోలు లుకేష్ 577 మార్కులతో ప్రథమ స్థానం, ఎంజేపీ విద్యార్థి జి. జెశ్వంత్ 576 మార్కులతో ద్వితీయ స్థానం, పెద్దవంగర విద్యార్థులు ఎం. శ్రీవల్లి, ఎండీ అఫ్సర్ 574 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచినట్లు ఎంఈవో బుధారపు శ్రీనివాస్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎంఈవో అభినందనలు తెలిపారు.

# ఎస్ఎస్సి ఫలితాలలో జయ ప్రభంజనం



కోదాడ టౌన్ ఏప్రిల్ 30(వుదయం) ఎస్ ఎస్ సి 2025 ఫలితాలలో కోదాడ పట్టణంలోని జయ పాఠశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. కే శరణ్య 586 మార్కులతో మొదటి , వి హర్షవర్ధిని 583 మార్కులతో రెండవ, ఏ వేద 580 మార్కులతో మూడో స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ జయ వేణుగోపాల్ తెలిపారు. జయానికి కేరాఫ్ అడ్రస్ జయ స్కూల్ అని ఆయన తెలిపారు. విద్యార్థుల ఉత్తీర్ణత కొరకు పాటుపడిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

# పది ఫలితాల్లో శ్రీ చైతన్య ప్రభంజనం.




కోదాడ టౌన్ ఏప్రిల్ 30(వుదయం) తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఎస్ఎస్సి 2025 పరీక్ష ఫలితాలతో శ్రీ చైతన్య రెసిడెన్షియల్ బ్రాంచ్ కి చెందిన జి. విశిష్ట 590 మార్కులతో కోదాడ పట్టణంలో అత్యధిక మార్కులు. సాధించింది.అలాగే యన్ హేమంత్ హర్ష,అరీన్ పట్నాయక్ 589 మార్కులు,ఆర్ భవ్య 585 మార్కులు,వి ప్రద్యున్న 584 మార్కులు.ఇ జోషిత,జి రిషిత 583 మార్కులు,పి మధురిక,పి రిత్విక రెడ్డి,శ్రీ తేజన 581 మార్కులు సాధించారు.కోదాడ శ్రీ చైతన్య విద్యా సంస్థల నుండి 560 పైన 13 మంది 575 పైన 25 మంది మార్కులు సాధించారు.అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శ్రీ చైతన పాఠశాల ఈజియం మురళీకృష్ణ అభినందించారు.ఆర్ఐ వెంక టేశ్వర్లు,ప్రినిపాల్ గోపాల స్వామి,వీరారెడ్డి,విద్యార్థుల తల్లిదండులు పాల్గోన్నారు.

# పది" ఫలితాల్లో మండల స్థాయిలో ఆంగ్లోవేదిక్ పాఠశాల ప్రభంజనం



జోనాధన్. జోసెఫ్ 578 | మరియం మజహర్ 576 | సంఘనబట్ల. అక్షర 571

చిపిరిశెట్టి. రిత్విక 570 | అయ్యోరి. నిఖిత 569 | బుగ్గరపు. ప్రశస్త 564

ధర్మపురి ఏప్రిల్ 30(వుదయం విలేకరి):మండలంలో ఆంగ్లోవేదిక్ పాఠశాల విద్యార్థులు 10 పరీక్షా ఫలితాల్లో మండల స్థాయిలో ప్రభంజనం సృష్టించారు.మొదటి స్థానంలో జోనాధన్. జోసెఫ్ 578,ద్వితీయ స్థానంలో మరియం మోజహర్ 576,తృతీయ స్థానంలో సంఘనబట్ల.అక్షర 571,4వ స్థానంలో చిపిరిశెట్టి. రిత్విక 570,అయ్యోరి. నిఖిత 569,బుగ్గరపు. ప్రశస్త 564 మార్కులు వచ్చాయి .550 పైగా 11మంది,500 పైగా 48 విద్యార్థులు మార్కులు సాధించారు.మండలస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన ఆంగ్లోవేదిక్ పాఠశాల విద్యార్థులను ఎంఈఓ సీతాలక్ష్మీ,పాఠశాల కరస్పాండెంట్ సంఘనబట్ల. దినేష్, ప్రిన్సిపాల్ తోట. శంకర్, డైరెక్టర్ శ్రీనివాస్,ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి.




ఖానాపురం ఏప్రిల్ 30 వుదయం ప్రతినిధి. మండలంలోని అశోక్ నగర్ గ్రామానికి చెందిన వివోఏ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు కరుణవెంకన్న దంపతుల కుమారుని వివాహానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై నూతన వధూవరులు నీరుడు కిరణ్ కుమార్ కల్పనపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రామసహాయం ఉమారాణిఉపేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గొర్రె కవితరవి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముచ్చ యాదగిరిరావు, ఆలయ చైర్మన్ జినుకల సురేష్, మహిళా సంఘం సీఏలు బసనబోయిన రామ, కోనేరు శ్రీదేవి, దాసి శ్రీలత, కత్తి పద్మ, నజీమా, కారుణ, నీరజ, మంజుల, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయ సంఘాలు పాలకుల పక్షం కారాదు

**టీడబ్ల్యూజేఎఫ్ పాత్రికేయుల పక్షాన పోరాడుతుంది**
**రాష్ట్రవ్యాప్తంగా నెంబర్ వన్ స్థానంలో నిలవాలి**
**టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**
**హన్మకొండ,వరంగల్ జిల్లాల్లో భారీగా సభ్యత్వ నమోదు**
**ఫెడరేషన్ లో చేరిన సీనియర్ జర్నలిస్టు అంతడుపుల శ్రీనివాస్ ఇతర యూనియన్ నేతలు**





హనుమకొండ, ఏప్రిల్ 30(వుదయం జిల్లా ప్రతినిధి) : రాష్ట్రంలో జర్నలిస్టుల పక్షాన పోరాడే ఏకైక సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. జర్నలిస్టులకు అండగా ఉండేందుకు ఏర్పడిన ఏకైక ట్రేడ్ యూనియన్ ఇదే అని అన్నారు. రాష్ట్రవ్యాపితంగా జరుగుతున్న ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జర్నలిస్టుల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. గురువారం హన్మకొండ లోని టీజీవో భవన్ లో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ హన్మకొండ, వరంగల్ జిల్లాల సభ్యత్వ నమోదు కార్యక్రమం, వివిధ యూనియన్ ల నాయకుల చేరికల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితులు మరింత దారుణంగా మారుతున్నాయని, ఒకవైపు యాజమాన్యాలు, ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం, మరోవైపు దాడులు, అవమానాలు పెరిగిపోవడం జరుగుతుందని మామిడి సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు శిక్షణతో కూడిన వృత్తినైపుణ్యతను పెంపొందించుకొని విధినిర్వహణలో సమర్ధవంతంగా, సమిష్టిగా ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రధాన జర్నలిస్టు యూనియన్లు జర్నలిస్టుల పక్షం కాకుండా పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని విమర్శించారు. టీడబ్ల్యూజేఎఫ్ సంఘం పాలకుల పక్షాన కాకుండా కేవలం పాత్రికేయుల పక్షాన నిలిచి సమస్యలపై పోరాడుతుందని మామిడి సోమయ్య స్పష్టం చేశారు. ఈ సంఘంలో ఉన్న పాత్రికేయులు కూడా ప్రజల పక్షం ఉండాలని, ప్రజల సమస్యలపై స్పందించాలని కోరారు. పదవుల కోసం, పైరవీల కోసం పాలకుల కొమ్ముకాస్తూ జర్నలిస్టుల సంక్షేమాన్ని, సమస్యలను విస్తరిస్తున్న పాత్రికేయ సంఘాలను పాతరేసే సమయం ఆసన్నమైందని అన్నారు. ప్రభుత్వాల పక్షాన నిలిచి జర్నలిస్టులకు కనీసం ఇండ్ల స్థలాలు, పెన్షన్ సదుపాయం, చనిపోయిన జర్నలిస్టులకు తగిన ఆర్థిక సహాయం ఇప్పించలేక పోయిన సంఘాలను నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు జర్నలిస్టులను పూర్తిగా విస్మరించాయని, గత బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు రాకపోవడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్ కార్డులు, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు తగ్గింపు, ఇండ్ల స్థలాలు వంటి సమస్యలు పరిష్కరించాల్సి
వుందని అన్నారు. హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో ఫెడరేషన్ నిర్వహించబోయే ఉద్యమాల్లో జర్నలిస్టులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఫెడరేషన్ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు టీవీ రాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, వల్లాల జగన్, రాజశేఖర్, కార్యదర్శులు దయాసాగర్, చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జక్కుల విజయ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుడుతాడి బాపురావు, హన్మకొండ జిల్లా కార్యదర్శి గోపాల్, వరంగల్ జిల్లా కార్యదర్శి స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

**టీడబ్ల్యూజేఎఫ్ లో టీయూడబ్ల్యూజే సంఘం జర్నలిస్టులు**

హన్మకొండ,వరంగల్ జిల్లాలకు చెందిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే-143) యూనియన్ కు చెందిన దాదాపు వంద మంది నాయకులు, జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్ లో చేరారు. టీయూడబ్ల్యూజే అనుబంధ చిన్న పత్రికల సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు అంతడుపుల శ్రీనివాస్ తో పాటు ఆ సంఘానికి చెందిన దాదాపు యాభై మంది జర్నలిస్టులు, సీనియర్ జర్నలిస్టు దామెర రాజేందర్ తో పాటు వివిధ పత్రికలకు చెందిన జర్నలిస్టులు ఫెడరేషన్ లో చేరారు. వీరందరికి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సభ్యత్వం ఇచ్చి సంఘంలోకి ఆహ్వానించారు.

# పదవ తరగతి ఫలితాలలో శ్రీ కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రభంజనం



అలంపూర్ ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి) పదవ తరగతి ఫలితాలలో శ్రీ కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. 30 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు. టి. పద్మావతి 585/600 మార్కులు సాధించి మండల ఫస్ట్ ర్యాంక్ తో పాటు, జిల్లా స్థాయి రెండవ ర్యాంక్ సాధించి పాఠశాలకు, అయిజ పట్టణానికి మంచి పేరు సాధించింది. ఈ సందర్భంగా హెడ్ మాస్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారని, ఇట్టి విజయానికి కారణమైన విద్యార్థిని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల కు చెందిన యు.ప్రణయ్ కు 576/600 మార్కులు సాధించి మండలంలో రెండవ ర్యాంక్ సాధించాడు. తాగూర్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.కె.జోషిత 569/600 మార్కులు సాధించి మండల మూడవ ర్యాంక్ సాధించారు.

# బసవేశ్వరునితోనే సమాజంలో మార్పు,

**ఘనంగా శ్రీ మహాత్మ బసవేశ్వర 892,వ జయంతి ఉత్సవం.**
**నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ,**



నాగర్ కర్నూల్ ఏప్రిల్ 30(వుదయం ప్రతినిధి)నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో నాగర్ కర్నూలు జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ మహాత్మ బసవేశ్వర 892వ జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి , బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి , మాట్లాడుతూ...... సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులకు శ్రీకారం చుట్టిన గొప్ప సంస్కర్త మహాత్మా బసవేశ్వరుడని పేర్కొన్నారు. బసవేశ్వరుడు బోధించిన అభ్యుదయవాద సంప్రదాయమే నేడు లింగాయత్ ధర్మంగా మారిందన్నారు. 12వ శతాబ్దంలో జన్మించిన బసవేశ్వరుడు సమాజంలో కుల వ్యత్యాసాలను, లింగ వివక్షను, వర్ణభేదాలను వ్యతిరేకించిన గొప్ప సమానత్వవాది అని తెలిపారు. బసవేశ్వరుడు స్థాపించిన లింగాయత్ ధర్మం సామాజిక న్యాయం, సద్బుద్ధి, సేవాభావానికి నిలువెత్తు ఉదాహరణ అని పేర్కొన్నారు. బసవన్నను బసవుడు, విశ్వగురు అని పిలవడం అంతే గౌరవంతో కూడిన విషయం అని ఎమ్మెల్యే వివరించారు. కర్ణాటకలోని భాగేవాడే బసవేశ్వరుని జన్మస్థలమని, ఐదు రూపాయల నాణెంపై ఆయన చిత్రాన్ని ముద్రించడం ద్వారా బసవేశ్వరుని ప్రాశస్త్యాన్ని తెలియజేస్తుందన్నారు. సమాజ స్థాపన కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తిని బసవేశ్వరుడు చూపిన మార్గంలో మనమందరం నడవాలని కోరారు. మహాత్మ బసవేశ్వరుని జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ , మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు జిల్లా వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు జెమినీ సురేష్ అధ్యక్షులు కెంచే గిరిజా శంకర్ ప్రధాన కార్యదర్శి కెంచే రాజేష్ కుమార్ కోశాధికారి రాజశేఖర్ సంఘ సభ్యులు నాగ రవిశంకర్, శివశంకర్,శెట్టి రాజేష్, మల్లికార్జున్, ఆకుల సాంబయ్య, శెట్టి శేఖర్, గంగాధర్, రాజ్ కుమార్, సూరజ్, కవిత, మంజుల మరియు వీరశైవ లింగాయతులు, ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాలలో ప్రభంజనం సృష్టించిన టీవీఎం ఉన్నత పాఠశాల







మధిర ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి) పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో మధిర టీవీఎం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎం యస్వంత్ 577, సి హెచ్ సాయి గౌతమ్ 575 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తూ జిల్లా, రాష్ట్ర ర్యాంకులు సాధించడం జరిగిందని పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలప్రధానోపాధ్యాయులు మధిర మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్ విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఇంగ్లీష్ మీడియం విభాగం నుంచి 34 మంది విద్యార్థులు పరీక్ష వ్రాయగా 34 మంది విద్యార్థులు పాసై 100% ఫలితాలు సాధించారని, తెలుగు మీడియం విభాగం నుంచి 18 మంది పరీక్షకు హాజరు కాగా 15 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. చక్కని ఫలితాలు సాధనకు కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయ బృందంనకు, రాణించిన చిన్నారులకు అభినందనలు తెలియజేశారు.

# వెంకటేశ్వర స్వామి కళ్యాణ ఉత్సవాల్లో జువ్వడి కృష్ణారావు



మెట్ పల్లి ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి) కోరుట్ల నియోజకవర్గ పరిధిలోని మెట్పల్లి మండలం సత్తెక్కపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవంలో పాల్గొని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు జువ్వాడి కృష్ణారావుకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాద అందించి చేసి వేద ఆశీర్వచనాన్ని అందజేశారు అనంతరం ఆలయ కమిటీ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు జువాడి కృష్ణారావు ను సన్మానించారు ఈకార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు తో పాటు మెట్పల్లి బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు నాయిని సురేష్ కాంగ్రెస్ పార్టీ మెట్పల్లి పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి స్థానిక మాజీ సర్పంచ్ ఆరెళ్ళ రాజాగౌడ్ మాజీ ఎంపిటిసి వెంకటేష్ శంకర్ నేమురి భూమయ్య భూమేశ్వర్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# దేశ వ్యాప్తంగా కుల గణన చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకోవడం కాంగ్రెస్ పార్టీ విజయం...

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**



కోరుట్ల ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి) దేశ వ్యాప్తంగా కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన కులగణ నూటికి నూరు శాతం ప్రజామోదం పొందింది అనడానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు నియోజకవర్గ కేంద్రమైన కోరుట్ల పట్టణంలోని జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ఘన విజయమని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గతంలో కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడోయాత్ర నిర్వహించిన సందర్భంగా దేశంలో ఉన్న పరిస్థితులు దేశ ప్రజలందరికీ సమాన హక్కులు అవకాశాలు కల్పించాలంటే దేశంలో కుల గణన చేయాలని ఆనాడు నిర్ణయం తీసుకున్న దానికి అనుగుణంగా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కులగనణ చేపట్టిందని బుధవారం దేశ వ్యాప్తంగా కులగనణ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందంటే ఈ నిర్ణయం కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘన విజయమని అన్నారు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దూరదృష్టితో చెప్పింది నేడు అక్షర సత్యమని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా ఒప్పుకుని రానున్న జనాభా లెక్కల సందర్భంగా కుల గణన అమలుకు సిద్ధం అయిందని జువ్వడి కృష్ణారావు తెలిపారు

## పది ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 13వ స్థానం, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోనే మొదటి స్థానంలో వరుసగా 8 సార్లు కైవసం చేసుకుంటూ వస్తున్న నాగర్ కర్నూల్ జిల్లా





సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్, కేజీబీవీలు

నాగర్ కర్నూల్ జిల్లా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మరోసారి సత్తాచాటింది. బుధవారం విడుదలైన ఫలితాల్లో నాగర్ కర్నూల్ జిల్లా విద్యార్థులు 96.83 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో 13వ సానం కైవసం చేసుకున్నారు. గత ఏడాది జిల్లా 23వ స్థానంలో నిలువగా, ఈ ఏడాది 10 స్థానాలు ఎగబాకి 13వ స్థానానికి చేరింది. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోనే గత 8 సంవత్సరాలుగా వరుసగా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంటూ నాగర్ కర్నూలు జిల్లా కొనసాగుతూ చరిత్ర సృష్టిస్తుంది. గత ఏడాది 91.57 శాతం ఉత్తీర్ణత సాధించిన జిల్లా ఈ ఏడాది 96.83 శాతం సాధించి రాష్ట్ర స్థాయి లో 13వ స్థానంలో నిలిచింది. 100 పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలుజిల్లాలో 100 పాఠశాలలు పదోతరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించాయి. ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 60 పాఠశాలలు, ప్రైవేట్ యజమాన్యంలోని 40 విద్యాసంస్థలు ఇందులో ఉన్నాయి. ప్రైవేటు ప్రభుత్వ విద్యాసంస్థల నుంచి 10,530 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 10,196 ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలోని 20 కేజీబీవీలో 10 కేజీబీవీలు 100% ఉత్తీర్ణత సాధించగా, మరో 10 కేజీబీవీలు 98 శాతానికి పైగా ఉత్తీర్ణత శాతం సాధించాయి. జిల్లాలో 131ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటివరకు 30 కి పైగా పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించాయి. ఈ సారీ బాలికలదే పైచేయిఈ ఏడాదీ బాలికలే పైచేయి సాధించారు. 5230 మంది బాలురు, 5300 మంది బాలికలు కలిపి 10,530 మంది పరీక్షలు రాశారు. బాలురు 5013 (95.85 శాతం) మంది, బాలికలు 5183 (97.79 శాతం) ఉత్తీర్ణత సాధించారు. 2023-24 విద్యా సంవత్సరంలో మొత్తం 10,507 మంది పరీక్షలు రాయగా 9621 మంది (91.57శాతం) ఉత్తీర్ణత సాధించారు.

**పటిష్ట ప్రణాళికతో..**

పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో 13వ స్థానంలో నిలవడానికి జిల్లా విద్యాశాఖ ప్రణాళికా బద్ధంగా కృషి చేసింది. జిల్లా విద్యాశాఖాధికారి, ఇతర అధికారులు పాఠశాలల పునఃప్రారంభం నుంచి పదో తరగతిపై ప్రత్యేక దృష్టి సారించారు.
ఈ విద్యా సంవత్సరంలో సెప్టెంబర్ నుంచే ఉదయం, సాయంత్రం పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. హెచ్ఎంలు, సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చేలా పర్యవేక్షణ చేశారు.
100 రోజుల ప్రణాళికను అమలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చర్యలు చేపట్టారు.
స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంల నుంచి ఆర్జేడీ స్థాయి వరకు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. డిసెంబర్లో సిలబస్ పూర్తి చేసి, ప్రతి రోజూ రివిజన్ చేపట్టారు. జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ (డీసీఈబీ) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టెస్టులు తయారు చేసి విద్యార్థులకు వారాంతపు పరీక్షలు నిర్వహించారు. ఫలితాలు సంతృప్తికరంటెన్త్ ఫలితాల్లో రాష్ట్రంలో నాగర్ కర్నూల్ జిల్లా 13వ స్థానంలో నిలిచింది. గతేడాది 23వ స్థానంలో ఉండగా అది 10 స్థానాలు పైకి చేరి 13వ స్థానాన్ని సాధించాం.
ఫలితాలు సంతృప్తికరంగా వచ్చాయి. సంతోషంగా ఉంది.
ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు ప్రత్యేక తరగతులు, నిత్యం పరీక్షల నిర్వహణతోనే ఈ ఫలితాలు సాధించాం.
ఈ విజయంలో భాగస్వాములైన హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు అభినందనలు ఎ.రమేష్ కుమార్, నాగర్ కర్నూల్
జిల్లా విద్యాశాఖాధికారి

పది ఫలితాలపై జిల్లా విద్యాశాఖలో మిఠాయిలు పంచుకున్నారు.
ప్రధానోపాధ్యాయుల జిల్లా అధ్యక్షులు జె శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ రమేష్ కుమార్ ను శాలువాతో సత్కరించి, మిఠాయిలు పంచుకుని అభినందనలు తెలిపారు
ఈ కార్యక్రమంలో ఏసి రాజశేఖర్ రావు, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, ప్రధానోపాధ్యాయులు, తిరుపతయ్య, హనుమంత్ రెడ్డి, లక్ష్మారావు, జి సి డి ఓ శోభారాణి, ఏయంఓ షర్ఫుద్దీన్ టెస్ట్ బుక్ మేనేజర్ నరసింహులు, వెంకటేశ్వర్ల శెట్టి, పదో తరగతి సెక్షన్ క్లర్క్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

# మండల అధ్యక్షుని తండ్రి ని పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు



కోరుట్ల ఏప్రిల్ 30 (వుదయం ప్రతినిధి) కోరుట్ల నియోజకవర్గ పరిధిలోని ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి తండ్రి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతుండగా బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వడి కృష్ణారావు ఇబ్రహీంపట్నంలో శ్రీకాంత్ రెడ్డి స్వగృహానికి వెళ్లి వారి తండ్రి ని పరామర్శించారు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు ఈకార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు తో పాటు మెట్పల్లి బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ అధ్యక్షులు నాయిని సురేష్ ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఏలాల వెంకటరెడ్డి యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఎలేటి మహిపాల్ రెడ్డి మాజీ సర్పంచ్ దశరథం గడ్డం శంకర్ రెడ్డి భూమేష్ తిరుపతి గంగాధర్ వెంకటేష్ నేమూరి భూమయ్య తదితరులు పాల్గొన్నారు

# పంపిణికి సిద్దమైనా డబుల్ బెడ్రూం ఇండ్ల జాభితా





రామకృష్ణాపూర్/ఏప్రిల్ 30(వుదయం ప్రతినిధి)క్యాతనపల్లి మున్సిపాలిటీలో గత ప్రభుత్వ హయంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల జాబితాను రెవిన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది జాబితాను విడుదల చేసి అర్హుల లిస్టును స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నోటీస్ బోర్డుపై అంటించినట్లు కమిషనర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని పాత పోలీస్ స్టేషన్ సమీపంలో పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయడానికి అర్హుల జాభితా తుది దశకు చేరిందని 286 ఇండ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. 236 ఇండ్లను పంపిణీ చేయడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తుది నిర్ణయం జరిందిన్నారు. అర్హుల జాభితాలో ఎవరికైనా ఎలాంటి సందేహాలు ఉన్న, అనర్హులు అర్హులుగా నిర్ణయించిన తగిన ఆధారాలతో రాత పూర్వకముగా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని, అట్టి దరఖాస్తులను తప్పనిసరిగా పరిశీలన చేసి నిజమైన అర్హులకు న్యాయం చేయడం జరుగుతుందని తెలియజేశారు.
అలాగే దరఖాస్తు ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడునని కమిషనర్ కోరారు.


# పదవ తరగతి ఫలితాల్లో హెడ్ కోటర్ హైస్కూల్ ప్రథమ స్థానం.

**600 మార్కులకు గాను 535 మార్కులు సాధించిన బోడ వినయ్.**
**ఎంఈఓ శ్రీదేవి.**





ఖానాపురం ఏప్రిల్ 30 వుదయం ప్రతినిధి.తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో మండలంలోని 10 ప్రభుత్వ హైస్కూల్లోని మండల కేంద్రంలోని హైస్కూల్లో చదువుతున్న బోడ వినయ్ 600 మార్కులకు గాను 535 ర్యాంకులు సాధించి మండల టాపర్గా నిలిచినట్లు మండల విద్యాశాఖ అధికారిని డి శ్రీదేవి తెలిపారు. మండలంలోని 10 ప్రభుత్వ హైస్కూల్లోని చదువుతున్న విద్యార్థులలో మొదటి స్థానం మండల హెడ్ కోటర్ హైస్కూల్ కాగా రెండవ స్థానం అశోక్ నగర్ లోని కేజీవీబీ గురుకుల పాఠశాలలో చదువుతున్న ఏ అస్మిత 531 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచినట్టు తెలుపుతూ ప్రథమ రెండవ స్థానం సాధించిన విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ అలాగే మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ హైస్కూల్లోని విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయ బృందానికి విద్యార్థులకు సిబ్బందికి అభినందనలు తెలిపారు. అలాగే మండల టాపర్గా నిలిచిన బోడ వినయ్ కి పలువురు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# బిజినెస్



# ఎంఎస్ఎంఇ, మధ్యస్థ కార్పొరేట్ల అప్పులపై నీలినీడలు

- ♦ రిస్కులో రూ.21,800 కోట్ల రుణాలు
- ♦ టారిఫ్ యుద్ధం ప్రభావం
- ♦ ఇండియా రేటింగ్స్ రిపోర్ట్

న్యూఢిల్లీ : భారత్‌పై అమెరికా టారిఫ్‌ల పోటు దేశీయ ఎంఎస్ఎంఇ, మధ్యస్థ కార్పొరేట్ కంపెనీలను దెబ్బతీయనుంది. సుంకాల దెబ్బతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ)ల రుణాలు రిస్కులో పడనున్నాయని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్-రా) హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ విధానాలతో ఎంఎస్ఎంఇ, మిడ్‌కార్పొరేట్లకు చెందిన రూ.21,000 కోట్ల రుణాలు ప్రమాదంలో పడొచ్చని విశ్లేషించింది. ఈ రిపోర్ట్‌లో 1,898 లిస్టెడ్, అన్‌లిస్టెడ్ ఎంఎస్ఎంఇలు సహా 1,055 మధ్య తరహా కార్పొరేట్ సంస్థలను అధ్యయనం చేసింది. ఇండియా రేటింగ్స్ రిపోర్ట్ ప్రకారం.. ముఖ్యంగా రసాయనాలు, వస్త్రాలు వంటి రంగాలు దుర్బల పరిస్థితిని ఎదుర్కొన్నాయి. మధ్య తరహా కార్పొరేట్‌లు బలమైన ఆర్థిక నిల్వలను కలిగి ఉన్నప్పటికీ డిమాండ్ మందగించడం ద్వారా ప్రతికూల ప్రభావాన్ని చవి చూడనున్నాయి. అయితే అనుహ్య పరిణాలను ఎదుర్కోవడానికి మిడ్ కార్పొరేట్లు భారీగా నగదు నిల్వలను కలిగి ఉన్నాయి. 1898 ఎంఎస్ఎంఇల్లో 6 శాతం సంస్థలు అధిక రిస్కును కలిగి ఉన్నాయి. ఇవి దాదాపు రూ.8,100 కోట్ల మొత్తం అప్పులను కలిగి ఉన్నాయి. ఇవి ఇండియా రేటింగ్స్ సమీకరించిన సమాచారంలో మొత్తం అప్పులలో 16 శాతం వాటా కలిగి ఉన్నాయి.

మధ్య తరహా కార్పొరేట్‌లలో 5 శాతం సంస్థల అప్పులు అధిక రిస్క్ కేటగిరీలోకి రాగా.. 2023-24 నాటికి ఈ అప్పులు దాదాపు రూ.13,700 కోట్లుగా ఉన్నాయి. 2024 మార్చి 31 నాటికి 23 శాతం ఎంఎస్ఎంఇలు ఒత్తిడిలో ఉన్నాయి. ఎంఎస్ఎంఇలు సాధారణంగానే మూలధన పెట్టుబడుల సమస్యలతో ఎక్కువ ఇబ్బందుల్లో ఉంటాయని ఇండియా రేటింగ్స్‌లో ఎమర్జింగ్ కార్పొరేట్‌ల అసోసియేట్ డైరెక్టర్ నీర్మోరు షా పేర్కొన్నారు. టారిఫ్‌లతో డిమాండ్ మందగించడం ఎంఎస్ఎంఇలను మరింత తీవ్రంగా ప్రభావితం చేయవచ్చన్నారు. వడ్డీ రేట్లలో తగ్గింపు, మెరుగైన ద్రవ్య లభ్యత కొంత ఉపశమనం కలిగించవచ్చన్నారు. "గత మూడేళ్లుగా వడ్డీ రాయితీ పథకం, క్రెడిట్ లింక్డ్ క్యాపిటల్ సబ్సిడీ పథకం వంటి ప్రభుత్వ కార్యక్రమాలు మూలధనాన్ని కొద్దిగా పెంచాయి. టారిఫ్ వార్ 2.0 తీవ్రతరం కావడం వల్ల ప్రపంచ, దేశీయ డిమాండ్‌లో మందగమనం చోటు చేసుకోవడం ద్వారా మరింత మూలధనాన్ని ఖర్చు చేయడంలోనూ అవరోదాలను ఎదుర్కోనున్నాయి.." అని ఇండియా రేటింగ్స్ పేర్కొంది.



# తెలుగు రాష్ట్రాల్లో పాలసీల జారీలో 3 రెట్ల వృద్ధి

### టాటా ఏఐజి వెల్లడి
### కొత్తగా మెడికేర్ సెలెక్ట్ ఆవిష్కరణ




హైదరాబాద్ : వైద్య బీమా సంస్థ టాటా ఏఐజి గతేడాది వ్యవధిలో తెలుగు రాష్ట్రాల్లో పాలసీల జారీలో మూడు రెట్ల వృద్ధిని సాధించినట్లు వెల్లడించింది. 82,000 పైగా పాలసీదారులకు కవరేజీని అందించడం ద్వారా మెరుగైన ప్రగతిని కనబర్చినట్లు పేర్కొంది. మంగళవారం హైదరాబాద్‌లో టాటా ఏఐజి ఏజెన్సీ హెడ్ ప్రతీక్ గుప్తా, యాక్సిడెంట్ అండ్ క్లెయిమ్స్ హెడ్ రుద్రరాజు రాజగోపాల్ మీడియాతో మాట్లాడారు. అంతగా వైద్య బీమా సేవలందనీ మార్కెట్ల కోసం కొత్తగా మెడికేర్ సెలెక్ట్ పాలసీని అందుబాటులోకి తెచ్చామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 1600 పైగా హాస్పిటల్స్‌తో పటిష్టమైన నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నామన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రాంతంలో 97 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తిని సాధించామన్నారు.

14,500 అడ్వైజర్లతో సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, బీమా సేవలను విస్తరిస్తున్నామన్నారు. జాతీయ సగటు 13 శాతంతో పోల్చితే తెలుగు రాష్ట్రాల్లో వైద్య వ్యయం 16 శాతం పెరిగిందన్నారు. 2024-25లో నగదురహిత సేవల వినియోగం తెలంగాణలో 81 శాతంగా, ఆంధ్రప్రదేశ్‌లో 68 శాతంగా నమోదయ్యిందన్నారు. ప్రస్తుతం వైద్య బీమాలో 3.6 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నామని.. దీన్ని 5 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

# ఇన్ఫోసిస్‌లో నాలుగోసారి ట్రైనీలపై వేటు




బెంగుళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద టెక్ కంపెనీ ఇన్ఫోసిస్ తన ట్రైనీ ఉద్యోగులపై పదేపదే కన్నెర్ర చేస్తోంది. ఈ ఏడాదిలో వరుసగా నాలుగో సారి తొలగింపులకు పాల్పడింది. ఇటీవలే కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు క్యాంపస్‌లో శిక్షణ పొందుతున్న వందలాది మంది ట్రైనీలను తొలగించగా.. తాజాగా మరో 195 మందిని ఇంటికి పంపించింది. ఇంటర్నల్ అసెస్మెంట్‌లో ఉత్తీర్ణత సాధించకపోవడంతో వారిని తొలగించినట్లు రిపోర్టులు వస్తోన్నాయి. సిస్టమ్ ఇంజినీర్, డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజనీర్ విభాగంలోని ట్రైనీలు తొలగింపుకు గురైనట్లు ఆ సంస్థ తెలిపింది. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకూ సంస్థ దాదాపు దాదాపు 800 మంది ట్రైనీలకు ఉద్వాసన పలికింది.

# ఇండస్‌ఇండ్ బ్యాంక్‌కు అరుణ్ ఖురానా రాజీనామా

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని ఇండస్‌ఇండ్ బ్యాంక్ డిప్యూటీ సిఇఒ అరుణ్ ఖురానా తన పదవికి రాజీనామా చేశారు. ఇప్పటి వరకు ఆయన బ్యాంక్ ట్రెజరీ ఫ్రంట్ ఆఫీస్ బాధ్యతలను చూసుకునేవారు. కంపెనీ ఖాతాలపై అంతర్గత డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలను గుర్తించిన నేపథ్యంలో ట్రెజరీ ఫ్రంట్ ఆఫీస్ ఫంక్షనరీ, హెూల్ టైమ్ డైరెక్టర్, డిప్యూటీ సిఇఒ, బ్యాంక్ సీనియర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా తన పదవికి తక్షణమే రాజీనామా చేస్తున్నట్లు ఖురానా బ్యాంక్ బోర్డుకు పంపిన తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. మార్చి 2025తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.1960కోట్ల నష్టాన్ని చవి చూసింది.




# ఇంగ్లండ్‌కు వెళ్లే జట్టులో ఆర్‌సిబి కెప్టెన్‌కి చోటు..?

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ ముగిసిన తర్వాత భారత్.. ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ తలపడనుంది. అయితే ఈ టూర్‌కి వెళ్లే జట్టులో ఐపిఎల్‌లో రాణిస్తున్న పలువురికి స్థానం దొరికే అవకాశం. బార్డర్ గవాస్కర్ ట్రోఫీలో కెప్టెన్సీలో విఫలమైన.. రోహిత్ శర్మకు సెలక్టర్లు మరో అవకాశం ఇవ్వగా.. షామ్‌లో ఉన్న కరుణ్ నాయర్, ఆర్‌సిబి కెప్టెన్ రజత్ పటిదర్‌కి చోటు దొరికే అవకాశం ఉంది. ఐపిఎల్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడుతున్న సాయి సుదర్శన్‌కి కూడా చోటు దక్కొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అతనికి ప్రత్యమ్నాయ ఓపెనర్‌గా ఎంపిక చేస్తారని భావిస్తున్నారు. ఇక బౌలింగ్ విషయానికొస్తే.. కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఐపిఎల్ పూర్తి సీజన్‌ని గమనించి.. తుది నిర్ణయం తీసుకోనున్నారు.

# డుప్లెసిస్, అక్షర్ పోరాడినా.. ఢిల్లీకి తప్పని ఓటమి

## ఢిల్లీపై 14పరుగుల తేడాతో నైట్‌రైడర్ గెలుపు

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-18లో 48వ మ్యాచ్ కోల్‌కతా.. ఢిల్లీ మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో డుప్లెసిస్, అక్షర్ పోరాడినా ఢిల్లీకి తప్పని ఓటమి తప్పలేదు. కోల్‌కతా ఓపెనర్లు గుర్బాజ్, నరైన్‌కి తోడు మిడిలార్డర్‌లో రహానే, రఘువంశీ, లోయర్ ఆర్డర్‌లో రింకు సింగ్, ఆండీ రస్సెల్ సమిష్టిగా రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 204పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 9వికెట్లు కోల్పోయి 190పరుగులే చేసింది. దీంతో కోల్‌కతా 14పరుగుల తేడాతో విజయం సాధించింది. ఢిల్లీ జట్టు ఓపెనర్ డుప్లెసిస్(62) అర్ధసెంచరీకి తోడు అక్షర్ పటేల్(43), విప్‌రాజ్ నిగమ్(38) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. కోల్‌కతా బౌలర్లలో నరైన్‌కు మూడు, వరుణ్ చక్రవర్తికి



రెండు, అనుకుల్ రారు, వైభవ్ అరోరా, రస్సెల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ఓపెనర్లు శుభారంభం దక్కింది. సునీల్ నరైన్(27), రహ్మానుల్లా గుర్బాజ్(26)లు దూకుడుగా ఆడారు. దాంతో, పవర్ ప్లే 6 ఓవర్లలోనే 79పరుగులు వచ్చాయి. ఈ జోడీని విడదీసిన మిచెల్ స్టార్క్ విడదీశాడు. స్టార్క్ వేసిన 20వ ఓవర్లో రస్సెల్ తొలి బంతినే సిక్సర్‌గా మలవడంతో కోల్‌కతా స్కోర్ 200ల మార్క్ చేరింది. అయితే.. మూడో బంతికే పావెల్ ఎల్బీగా ఔట్ కాగా..

అనుకుల్ రారు(0)ని చమీర డైవింగ్ క్యాచ్‌తో డగౌట్‌కు పంపాడు. ఐదో బంతికి రస్సెల్ రనౌట్‌గా వెనుదిరిగాడు. అంతే.. స్టార్క్ హ్యాట్రిక్ మిస్ కాగా కోల్‌కతా 204కే పరిమితమైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నరైన్‌కు దక్కింది.

# చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ

### వెల్లువెత్తిన ప్రశంసలు

: ఐపిఎల్ పుణ్యమా అని ఎంతో మంది ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి వస్తున్నారు. రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్య, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, సంజు శాంసన్, రియాన్‌పరాగ్, అభిషేక్ శర్మ, జితేశ్ శర్మ, రింకూ సింగ్, ప్రియాంశ్ శర్మ, అశుతోష్ శర్మ, విప్రజ్ నిగమ్, శశాంక్ సింగ్ వంటి చిచ్చర పిడుగులు ఐపిఎల్‌లో రాణించడం ద్వారానే వెలుగులోకి వచ్చారు. దేశవాళీ క్రికెట్‌లో పెద్దగా రాణించక పోయినా వీరిలో చాలా మందికి టీమిండియాలో చోటు దక్కిందంటే దానికి ఐపిఎల్‌లో వీరు కనబరిచిన ప్రతిభే కారణమని చెప్పాలి. కిందటి సీజన్‌లో అభిషేక్ శర్మ, శశాంక్ సింగ్, రజత్ పటిదార్, రాహుల్ త్రిపాఠి, దేవ్‌దుత్ పడిక్కల్, యశస్వి జైస్వాల్ తదితరులు విధ్వంసక బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ రూపంలో మరో చిచ్చర పిడుగు అందుబాటులోకి వచ్చాడు. బిహార్‌కు చెందిన 14 ఏళ్ల వైభవ్‌ను ఈసారి జరిగిన ఐపిఎల్ మెగా వేలం పాటలో రాజస్థాన్ రాయల్స్ రూ.1.18 కోట్లకు సొంతం చేసుకుంది. అండర్19 వరల్డ్ కప్‌లో సూర్యవంశీ అసాధారణ ఆటను కనబరచడంతో ఐపిఎల్ వేలం పాటలో అతన్ని సొంతం చేసుకునేందుకు ఆయా జట్లు తీవ్రంగా పోటీ పడ్డాయి. 14 ఏళ్ల వయసులో వైభవ్ ఐపిఎల్‌లో అడుగు పెట్టాడు. ఈ మెగా టోర్నమెంట్‌లో ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలచి ఔరా అనిపించాడు. ఇక తన కెరీర్‌లో ఆడిన మూడో ఐపిఎల్ మ్యాచ్‌లోనే ఏకంగా సెంచరీ బాది పెను ప్రకంపనలు సృష్టించాడు. గుజరాత్ వంటి బలమైన బౌలింగ్ లైనప్ కలిగిన టీమ్‌పై 35 బంతుల్లోనే శతకం నమోదు చేసి నయా చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో ఐపిఎల్‌లో అత్యంత వేగంగా సెంచరీ సాధించిన భారత క్రికెటర్‌గా నిలిచాడు. క్రిస్ గేల్ తర్వాత ఐపిఎల్‌లో అతి తక్కువ బంతుల్లో శతకం నమోదు చేసిన ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ రికార్డును నమోదు చేశాడు. క్రిస్ గేల్ 30 బంతుల్లో శతకం సాధించి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. సూర్యవంశీ అతి చిన్న వయసులో సెంచరీ కొట్టి అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తాడు. అతని బ్యాటింగ్ విన్యాసాలకు ప్రపంచం మొత్తం ఫిదా అయిందంటే అతిశయోక్తి లేదు. వైభవ్ బ్యాటింగ్‌ను చూసిన అభిమానులు, క్రికెట్ విశ్లేషకులు అతన్ని భవిష్యత్తు సచిన్ టెండూల్కర్‌గా అభివర్ణిస్తున్నారు. విండీస్ క్రికెట్ దిగ్గజం ఇయాన్ బిషప్ కూడా అతన్ని సచిన్‌తో పోల్చాడు. రానున్న రోజుల్లో వైభవ్ టీమిండియా కీలక ఆటగాళ్లలో ఒకడిగా ఎదగడం ఖాయమని పలువురు మాజీ క్రికెటర్లు జోస్యం చెబుతున్నారు. ఇక చారిత్రక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న వైభవ్‌పై సోషల్ మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురుస్తోంది. టీమిండియా మాజీ క్రికెట్ దిగ్గజాలు సచిన్, సెహ్వాగ్, అజారుద్దీన్, యువరాజ్, రైనా, రవిశాస్త్రి, గవాస్కర్, హర్భజన్, గంగూలీ తదితరులు వైభవ్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. రానున్న రోజుల్లో వైభవ్ టీమిండియా స్టార్ ఆటగాడిగా ఎదగడం తథ్యమని పేర్కొన్నారు.

# టాప్‌లో చిదంబరం

న్యూఢిల్లీ: గ్రాండ్ చెస్ టూర్‌లో యువ గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం సత్తా చాటాడు. మంగళవారం జరిగిన చివరి రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన అలిరెజా ఫిరోజువాతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాడు. వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో ఈ టోర్నీ బరిలోకి దిగిన చిదంబరం అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. చివరి గేమ్‌లో స్లోవేనియా గ్రాండ్ మాస్టర్‌ను నిలువరించి డ్రా తో సరిపుచ్చుకున్నాడు. దీంతో 11పాయింట్లతో ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్‌తో సంయుక్తంగా టాప్‌లో ఉన్నాడు. భారత్‌కే చెందిన స్టార్ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద రొమేనియాకు చెందిన డేవిడ్ గావ్రిలెస్కును ఓడించి నాల్గోస్థానానికి ఎగబాకాడు. దీంతో ప్రజ్ఞానంద 10పాయింట్లతో నాల్గో స్థానంలో ఉన్నాడు.



# జాతీయం - అంతర్జాతీయం

## వ్యవసాయ కార్మిక, గ్రామీణ మహిళా కార్మికుల సమస్యలపై అఖిల భారత ఉద్యమం

- మే 9, 10 తేదీల్లో కేరళలో అఖిల భారత సదస్సు
- ముఖ్య అతిథిగా కేరళ సిఎం పినరయి విజయన్
- ఎఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్



-న్యూఢిల్లీ బ్యూరో : వ్యవసాయ కార్మిక, గ్రామీణ మహిళా కార్మికుల సమస్యలపై అఖిల భారత ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు ఎఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పేర్కొన్నారు. మంగళవారం కర్ణాటకలో గుల్బర్గాలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ, గ్రామీణ రంగంలో జరిగే పనుల్లో క్రమంగా మహిళల పాత్ర పెరుగుతోందన్నారు. ప్రత్యేకించి సంస్కరణలు అమలవుతున్న నేపథ్యంలో 60 నుండి 70 శాతం మహిళా కూలీలే వ్యవసాయం, గ్రామీణ ఉపాధిలో ఉన్నారన్నారు. యాంత్రీకరణ, పంటల్లో మార్పులు, ప్రభుత్వ విధానాల వల్ల పురుషులకు పనిదినాలు ఏడాదికి 40, 50 పని దినాలే గగనమయ్యాయని అన్నారు. వ్యవసాయమంటే మహిళలనే స్థితి ఏర్పడిందని అన్నారు. వ్యవసాయ కూలీలు, అందులోనూ మహిళల స్థితి అత్యంత అధ్వానంగా ఉందన్నారు. మహిళలుగా ప్రత్యేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వటం లేదన్నారు. అనేక రాష్ట్రాల్లో ఇళ్లు, సాగు భూమికి మహిళా పేరుతో పట్టాలు ఇవ్వటానికి పాలక పార్టీలు నిరాకరిస్తున్నాయన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల పట్ల వివక్ష మరింత పెరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ అండతోనే అత్యాచారాలు, అఘాయిత్యాలు ఎక్కువయ్యాయన్నారు. అందువల్ల వ్యవసాయ, గ్రామీణ పనుల్లో ఉన్న మహిళలందరినీ సమీకరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నిర్ణయించిందన్నారు. జాతీయ సదస్సులో డిమాండ్ చార్టర్‌పై చర్చించి, అఖిల భారత ఉద్యమానికి పిలుపునిస్తామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 500 మంది ప్రతినిధులుమే 9, 10 తేదీల్లో కేరళలోని మలప్పురం జిల్లాలో అఖిల భారత వ్యవసాయ కార్మిక, రూరల్ వర్కర్స్ సదస్సు జరగనుందని బి వెంకట్ తెలిపారు. దేశవ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. మే 9న కన్వెన్షన్ ప్రారంభ సభకు బృందాకరత్, వాసుకి పాల్గొంటారని తెలిపారు. మే 10న జరిగే సెమినార్‌లో ప్రొఫెసర్ మధుర స్వామినాథన్ ప్రసంగిస్తారని అన్నారు. అదే రోజు జరిగే మహిళా బహిరంగ సభకు ముఖ్య అతిథిగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హాజరుకానున్నారని తెలిపారు.

## త్వరలో భారత్‌తో వాణిజ్య ఒప్పందం

వాషింగ్టన్ : త్వరలో భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయనున్నట్లు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బసెంట్ ప్రకటించారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లను నిలువరించేలా.. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసిన మొదటి దేశాల్లో భారత్ ఒకటిగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం బసెంట్ జాతీయ మీడియాకిచ్చిన ఇంటర్వ్యూలో ఇతర దేశాలతో అమెరికా వాణిజ్య సంబంధాలపై తాజా పరిణామాలను వివరించారు. ఆసియా వాణిజ్య భాగస్వాములతో చర్చలు ఫలవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. గతవారం అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ భారత్‌లో పర్యటించారని, చర్చల్లో పురోగతి సాధించినట్లు చెప్పారని అన్నారు. దక్షిణ కొరియా, మిత్రదేశమైన జపాన్‌తోనూ చర్చల్లో పురోగతి ఉందని తాను భావిస్తున్నానని అన్నారు. చర్చలకు లోబడి 15 నుండి 18 రోజుల్లో ముఖ్యమైన



వాణిజ్య ఒప్పందాల్లో భారత్ ప్రత్యేకంగా నిలవనుందని అన్నారు. చాలా దేశాలు మంచి ప్రతిపాదనలతో వచ్చాయని, వాటిని నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు. తాము సంతకం చేసే వాణిజ్య ఒప్పందాల్లో మొదటి దేశంగా భారత్ నిలవనుందని అన్నారు.

## సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

- ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు సర్వాధికారాలు
- ప్రకటించిన ప్రధాని మోడీ
- సిడిఎస్, రక్షణమంత్రి, ఎన్ఎస్ఎలతో కీలక భేటీ



న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్ ఏ విధంగా స్పందించాలనే విషయమై సాయుధ బలగాలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చినట్లు ప్రధాని మోడీ ప్రకటించారు. ఏ సమయంలో ఎలా స్పందించాలి, లక్ష్యాలేమిటి అనే విషయమై నిర్ణయం తీసుకునేందుకు సైన్యానికి పూర్తి నిర్వహణాపరమైన స్వేచ్ఛ వుంటుందని తెలిపారు. సర్వాధికారాలు వారికే అప్పగించినట్లు తెలిపారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలన్నది జాతీయస్థాయిలో తీసుకున్న ఏకగ్రీవ తీర్మానమని పేర్కొన్నారు. భారత సాయుధ బలగాల శక్తి సామర్థ్యాల పట్ల తమకు పూర్తి స్థాయి విశ్వాసం వుందని పేర్కొన్నారు. పహల్గాం దాడి అనంతరం సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఢిల్లీలోనూ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాని మోడీ నివాసంలో మంగళవారం కీలక సమావేశం నిర్వహించారు. దాదాపు గంటన్నరపాటు సాగిన ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, త్రివిధ దళాల అధిపతులతో సహా ఉన్నత స్థాయి రక్షణశాఖ అధికారులు పాల్గొన్నారు. దేశంలో అంతర్గత భద్రతతోపాటు సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులపై చర్చించారు. ఉగ్రవాదాన్ని అణచివేయడం జాతీయ సంకల్పమని ఈ సందర్భంగా ప్రధాని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం దృఢనిశ్చయంతో వుందన్నారు. పహల్గాం దాడికి దీటైన బదులిస్తామని ప్రధాని తెలిపారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ రూపొందించుకోవడంలో భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిస్తున్నామని, ఎప్పుడు, ఎక్కడ ఎలా స్పందించాలో, ఏ లక్ష్యాలపై దాడులు జరపాలో అంతా సైన్యమే నిర్ణయం తీసుకుంటుందని మోడీ స్పష్టం చేశారు.

### కేంద్ర హెూంశాఖలో ఉన్నత స్థాయి సమావేశం

మరోవైపు కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. కేంద్ర హెూం కార్యదర్శి గోవింద్ మోహన్, బిఎస్ఎఫ్, అస్సాం రైఫిల్స్ జాతీయ భద్రతాదళం డైరెక్టర్ జనరల్స్ పాల్గొన్నారు. సిఐఎస్ఎఫ్, కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాల సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న తాజా పరిణామాలపై ఆ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది.

## బ్రెజిల్‌లో బ్రిక్స్ సమావేశాలు



బ్రసిలియా : బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం బ్రెజిల్‌లో జరగనున్నాయి. ఈ సమావేశాలు బ్రెజిల్‌లో రియో డి జనరీలో నగరంలో సోమవారం, మంగళవారం రెండురోజుపాటు జరగనున్నాయి. మొదట బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా దేశాలు స్థాపించిన ఈ బ్రిక్స్ సమూహంలో ఇప్పుడు ఈజిప్టు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, ఇరాన్, ఇండోనేషియా, సౌదీ అరేబియాలు కూడా చేరాయి. ప్రస్తుతం బ్రెజిల్‌లో జరుగుతున్న సమావేశానికి చైనా, ఇథియోపియా, ఇండోనేషియా, రష్యా, దక్షిణాఫ్రికా దేశాల విదేశాంగ మంత్రులు పాల్గొన్నారు. ఇతర దేశాల నుంచి దౌత్యస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థను బలోపేతం చేయడం, గ్లోబల్ సౌత్ దేశాల మధ్య సహకారాన్ని ప్రోత్సహించడం, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని సంస్కరించడం వంటి విషయాలపై చర్చించనున్నారు. అలాగే డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలపై బ్రిక్స్ విదేశాంగ మంత్రులు తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే గాజా, ఉక్రెయిన్‌లలో శాంతిని నెలకొల్పాలని బ్రిక్స్ పిలుపునిచ్చింది.

## కాశ్మీర్‌లో 48 పర్యాటక కేంద్రాల మూసివేత

**మరిన్ని ఉగ్రదాడులకు అవకాశం**
**ఇంటెలిజెన్స్ వర్గాల హెచ్చరిక**



శ్రీనగర్: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి తర్వాత భారత భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ముష్కరులను పట్టుకునేందుకు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో కాశ్మీర్‌లో మరిన్ని ఉగ్ర దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. పహల్గాం దాడి అనంతరం కాశ్మీరీ లోయలో స్లీపర్ సెల్స్ యాక్టివేట్ అయినట్టు తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్మూ కాశ్మీర్‌లోని ఉగ్రవాదుల ఇళ్లను సైన్యం పేల్చేస్తుండడంతో దానికి ప్రతీకారంగా వారు పెద్దఎత్తున దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్టు తమకు సమాచారం అందిందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు, పర్యాటకులు అప్రమత్తంగా వుండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే భద్రతా బలగాలకు సమాచారం ఇవ్వాలని నిఘా వర్గాలు సూచించాయి. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కాశ్మీర్ వ్యాప్తంగా ఉన్న మొత్తం 87 టూరిస్టు కేంద్రాల్లో 48 కేంద్రాలను మూసివేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. కాశ్మీర్‌లోని ప్రధాన ప్రదేశాలైన గుల్మార్గ్, సోనామార్గ్ దాల్ లేక్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన పర్యాటక ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించాయి.

### ఉగ్రదాడి సీన్ రీక్రియేట్ చేస్తున్న ఎన్ఐఎ

పహల్గాం ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ ఘటనకు సంబంధించి పలు వీడియోలు, అందిన సమాచారం ఆధారంగా ఉగ్రవాదులను గుర్తించడానికి విచారణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా దాడి జరిగిన ప్రదేశంలో సీన్ రీక్రియేట్ చేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఆ సమయంలో అక్కడ వున్న పర్యాటకులు, స్థానిక ప్రజలను ప్రశ్నిస్తున్నారు. అక్కడ వారు తీసుకున్న ఫొటోలు, వీడియోలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

### పహల్గాం టెర్రరిస్టుల గుర్తింపులో కీలకం గత ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఉగ్రవాది ఫోన్‌లో మూసా ఫొటో

కొన్ని నెలల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఒక ఉగ్రవాది వద్ద నుంచి స్వాధీనం చేసుకొన్న ఫోన్ నుంచి పహల్గాం మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మూసా ఫొటో బయటకు వచ్చింది. బైసరన్ లోయలో జరిగిన ఉగ్ర దాడిలో పాల్గొన్న విదేశీ టెర్రరిస్టులు జమ్మూ కాశ్మీర్‌లోకి చాలాకాలం క్రితమే ప్రవేశించినట్టు దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి. దాదాపు ఏడాదిన్నర క్రితమే ఒక బృందం సాంబా %-% కథువాల మధ్య సరిహద్దు కంచెను కత్తిరించింది. ఆ బృందంలో పహల్గాం దాడిలో పాల్గొన్న అలిభారు అలియాస్ తాలా, హాషీమ్ ముసా అలియాస్ సులేమానీ వున్నట్టు తెలుస్తోంది. వీరు అప్పటినుంచి పలు దాడుల్లో పాల్గొన్నారు. వీటిపై మొదలైన దర్యాప్తుల్లో చొరబాటు అంశం బయటకు వచ్చింది. ఈ విషయంపై ఇప్పటికే కేంద్ర హెూంశాఖ, బిఎస్ఎఫ్ సీనియర్ అధికారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రస్తుతం సైన్యం, రాష్ట్రీయ రైఫిల్స్ బృందాలు అనంతనాగ్‌లోని పర్వతశ్రేణుల్లో వీరి కోసం గాలింపును ముమ్మరం చేశాయి. సాంకేతిక ఆధారాలు, స్థానిక జాతుల సహకారంతో ఈ వేట సాగుతోందని అధికారులు పేర్కొన్నారు. గతేడాది సోన్‌మార్గ్ దాడిలో ఏడుగురు వ్యక్తులను ఉగ్రవాదులు హత్య చేశారు. ఇక బైసరన్ దాడిలో ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం సిసి కెమెరా దృశ్యాలు, స్థానిక గైడ్లు, పర్యాటకుల నుంచి సేకరించిన సమాచారంతో ఉగ్రవాదులను తాజాగా గుర్తించారు. కాశ్మీర్ లోయలో చురుగ్గా ఉన్న టెర్రరిస్టుల ఫొటోలను వారికి చూపగా మూసాను గుర్తించారు. గతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో స్థానిక ఉగ్రవాది జునైద్ అహ్మద్ భట్‌ను మట్టుబెట్టిన భద్రతా దళాలు అతడి ఫోన్‌ను స్వాధీనం చేసుకొన్నాయి. ఆ ఫోన్లో మూసా ఫొటో భద్రతా దళాలకు దొరికింది. సోన్‌మార్గ్ దాడి సమయంలో సిసి కెమెరా దృశ్యాల్లోనూ మూసా ఉన్నాడు. ఇక జునైద్ నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్‌లో ఇతర ఉగ్రవాదుల చిత్రాలు కూడా ఉన్నాయి. అలీభారు ఫొటో ఆ విధంగానే దళాలకు లభించింది.

## మరిన్ని వర్క్ వీసాలు ఇవ్వండి.. బ్రిటన్‌ను కోరిన భారత్




లండన్ : ఐటి, ఆరోగ్య రంగాల నిపుణులకు మరిన్ని వర్క్ వీసాలు మంజూరు చేయాలని భారత ప్రభుత్వం బ్రిటన్‌ను కోరింది. బ్రిటన్‌తో జరుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య చర్చల సందర్భంగా భారత ప్రతినిధులు ఈ డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. ప్రస్తుతం భారత్ ప్రతి ఏటా వంద అదనపు వర్క్ వీసాలు మాత్రమే పొందుతోంది. ఈ సంఖ్యను పెంచాలని కేంద్రం ఎప్పటి నుంచో బ్రిటన్‌ను కోరుతోంది. రెండు రోజుల బ్రిటన్ పర్యటనలో ఉన్న భారత వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయుష్ గోయల్ లండన్‌లో ఆ దేశ వాణిజ్య మంత్రి జొనాథన్ రేనాల్డ్స్‌తో సమావేశమయ్యారు. ఐదు రోజుల యూరప్ పర్యటనలో భాగంగా గోయల్ బ్రసెల్స్, ఓస్లో కూడా వెళతారు. రేనాల్డ్స్‌తో సమావేశం అనంతరం గోయల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో 'అమెరికా వాణిజ్య మంత్రితో ఫలప్రదమైన సమావేశం జరిగింది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలను మరింత ముందుకు తీసుకుపోవాలని, రెండు దేశాల ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని అభిప్రాయపడ్డాం' అని పోస్ట్ చేశారు. ఒప్పందంపై భారత్ కంటే బ్రిటన్ ఎక్కువ సానుకూలత కనబరుస్తోందని వాణిజ్య అధికారిని ఉటంకిస్తూ న్యూస్ వెబ్‌సైట్ పొలిటికో తెలిపింది. ప్రధానంగా వీసా రాయితీలే భారత్‌కు ఎదురు దెబ్బగా భావించవచ్చు. తమ దేశానికి చెందిన నిపుణులైన ఉద్యోగులకు మరిన్ని బ్రిటన్ వీసాలు మంజూరు చేయాలని భారత్ కోరుతోంది. ముఖ్యంగా ఐటి, ఆరోగ్య నిపుణులకు ఇస్తున్న వర్క్ వీసాల సంఖ్యను గణనీయంగా పెంచాలని డిమాండ్ చేస్తోంది.

వలసల సంఖ్యను పరిమితం చేయాలంటూ బ్రిటన్‌లో రాజకీయ ఒత్తిడులు పెరుగుతున్నాయి. ఏటా తమకు వందకు మించి వర్క్ వీసాలు అవసరం లేదని తొలుత అంగీకరించిన భారత్, ఇప్పుడు వాటిని పెంచాలని కోరుతోంది. మూడు సంవత్సరాల కంటే తక్కువ కాలపరిమితి కలిగిన తాత్కాలిక వర్క్ వీసాలు ఇవ్వాలని సూచిస్తోంది. దీనివల్ల బ్రిటన్ కూడా ఆర్థిక ప్రయోజనాలు పొందుతుందని చెబుతోంది.

## పౌరసత్వ నిరూపణకు ఆధార్, పాన్, రేషన్ కార్డులు చెల్లవు

**అక్రమ నివాసితుల గుర్తింపునకు కేంద్రం మార్గదర్శకాలు విడుదల**

న్యూఢిల్లీ : ఒక వ్యక్తి భారత పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి ఆధార్ కార్డు, పాన్‌కార్డు లేదా రేషన్ కార్డు ఇకపై చెల్లవని కేంద్రం పోలీసులకు మార్గదర్శకాలు విడుదల చేసింది. వీటి ప్రకారం విదేశీ పౌరులుగా అనుమానించిన వ్యక్తుల నుంచి పౌరసత్వ రుజువుగా ఓటరు గుర్తింపు కార్డు లేదా పాస్‌పోర్ట్ మాత్రమే అంగీకరించనున్నట్లు ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఢిల్లీ పోలీసు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. గత ఏడాది అక్టోబర్ నుంచి జరుగుతున్న వెరిఫికేషన్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో అక్రమ విదేశీ పౌరులు, ముఖ్యంగా బంగ్లా దేశీయులు, రోహింగ్యాలు ఉన్నారని చెప్పారు. వారి వద్ద ఆధార్, పాన్ , రేషన్ కార్డులతో పాటు యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ (యుఎన్‌హెచ్‌సిఆర్) జారీ చేసిన కార్డులు కూడా ఉన్నాయని వివరించారు. తాజా మార్గదర్శకాల ప్రకారం ఇప్పుడు ఓటరు ఐడి కార్డ్ లేదా ఇండియన్ పాస్‌పోర్ట్ తప్పనిసరి చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు.

# చక్కని ఆరోగ్యం


## పీచ్ పండుతో కలిగే ప్రయోజనాలు..



పీచ్ పండు దీనిని స్టోన్ ఫ్రూట్, పర్షియన్ ఫ్రూట్ అని కూడా పిలుస్తారు. పసుపు, తెలుపు రంగులో ఉండే ఈ పండుతో పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వీటిని నేరుగా లేదంటే.. జ్యూస్ రూపంలో కూడా తినొచ్చు. తరచూ పీచ్‌ఫ్రూట్‌ని మీ డైట్ లో చేర్చుకోవడం వల్ల ఊహించని లాభాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. పీచ్ పండులో విటమిన్స్, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. పీచ్ పండు కంటి ఆరోగ్యానికి కూడా మంచిది. ఈ పండులో విటమిన్ ఏ తో పాటు బీటా కెరోటీన్ కూడా పుష్కలంగా ఉండటం వల్ల కంటి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆరోగ్యకరమైన కంటి చూపును మెరుగుపరిచి ఇది క్యాటరాక్ట్ సమస్యలు రాకుండా నివారిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది అద్భుతమైన పండు. కేలరీలు తక్కువగా ఉండే పీచ్ పండు తినటం వల్ల బరువు కూడా నియంత్రణలో ఉంచుకొవచ్చు అంటున్నారు నిపుణులు. పోషకాలు పుష్కలంగా ఉంది, ఫైబర్ అధిక మోతాదులో ఉంటుంది. పేగు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పీచ్‌లో ఫైబర్ కంటెంట్ ఎక్కువ మోతాదులో ఉండటం వల్ల అధిక తినాల్సిన కోరిక రాదు. అయితే ఇది జీర్ణ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణ ఆరోగ్యం మెరుగుపడుతుంది.. అంతేకాదు డయేరియా, మలబద్ధక సమస్యలను దరిచేరకుండా చేస్తుంది.. ఆరోగ్యకరమైన పేగు కదలికలకు తోడ్పడుతుంది. పీచ్ పండు క్యాన్సర్ కణాలు అభివృద్ధికి వ్యతిరేకంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారిస్తుంది. మోనోపోజ్ మహిళలు రోజుకు కనీసం రెండు పీచు పండ్లు అయినా తినాలని వైద్యులు సూచిస్తున్నారు.. అంతేకాదు పీచ్ పండులో పాలిఫెనల్స్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది నొప్పి సమస్యలను తగ్గించుతాయి. పీచెస్ రక్తపోటును, అధిక కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని నివారిస్తుంది. రక్తంలో హిస్టమైన్ ఉత్పత్తిని నిరోధించి, అలెర్జీ లక్షణాలను తగ్గిస్తుంది. ఇందులో విటమిన్ సి, ఫోలేట్ ప్రెగ్నెన్సీ మహిళలకు కూడా మేలు చేస్తుంది. పీచ్ పండ్లను నేరుగా తినవచ్చు.. లేదా స్మూథీ రూపంలో తీసుకోవచ్చు. ఇది మన చర్మ ఆరోగ్యకరమైన కనిపించేలా చేస్తుంది.

## థైరాయిడ్ సమస్య ఉన్నవారికి

### ఈ డ్రింక్స్ మస్తు మంచివట..!



థైరాయిడ్ సమస్యలను నియంత్రించాలంటే జీవన విధానంలో కొన్ని మార్పులు తప్పనిసరి. రోజు వారీ అలవాట్లను మెరుగు పరచడం ద్వారా థైరాయిడ్ పని తీరు ను బాగా పర్యవేక్షించవచ్చు. ప్రత్యేకించి ఆరోగ్యకరమైన డ్రింక్ లను త్రాగడం వల్ల థైరాయిడ్ ఆరోగ్యం చాలా మెరుగవుతుంది శరీరానికి అవసరమైన పోషకాలను అందించే ఆరోగ్యకరమైన డ్రింక్ లను తగిన జాగ్రత్తలతో తీసుకుంటే హార్మోన్ల సమతుల్యతను నిలుపుకోవచ్చు. థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తిని సహజంగా ప్రోత్సహించే ఈ ప్రత్యేక డ్రింక్ లు శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మద్దతు అందిస్తాయి. పసుపులో ఉండే కర్కుమిన్ అనేది శరీరంలోని వాపును తగ్గించే గుణం కలిగి ఉంటుంది. క్రిములను నిర్మూలించే శక్తి కూడా ఇందులో ఉంటుంది. నల్ల మిరియాలలో ఉండే పైపెరిన్ వల్ల పసుపు శరీరానికి బాగా గ్రహించబడుతుంది. పసుపు, నల్ల మిరియాలు, పాలతో కలిసి తయారు చేసే పసుపు పాలు తాగడం వల్ల థైరాయిడ్ ఆరోగ్యం మెరుగవుతుంది. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. మజ్జిగ అనేది ప్రోబయోటిక్స్ కు మంచి ఆధారం. ఇది గట్ మైక్రోబయోటాను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. మంచి గట్ ఆరోగ్యం వలన శరీరంలో వాపు తగ్గుతుంది. ఇంట్లో తయారు చేసిన తాజా మజ్జిగను తీసుకోవడం శ్రేయస్కరం. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. బీట్‌రూట్, క్యారెట్ కలయికతో తయారు చేసిన రెడ్ కలర్ జ్యూస్ ఫైటోన్యూట్రియెంట్లను అందిస్తుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్ గుణాలు కూడా ఉంటాయి. తాజాగా తయారు చేసిన ఈ జ్యూస్ తాగడం వల్ల థైరాయిడ్ పనితీరు మెరుగవుతుంది. శరీరానికి కావలసిన ముఖ్యమైన పోషకాలు అందుతాయి. ఇది శక్తి స్థాయిని పెంచడంలో సహాయపడుతుంది. ఆకుకూరలతో తయారు చేసే గ్రీన్ జ్యూస్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. తాజా పాలకూర, కొత్తిమీర, పుదీనా వంటి ఆకుకూరలు తీసుకుని దోసకాయ రసం లేదా నిమ్మరసం కలిపి ఈ డ్రింక్ తయారు చేయాలి. ఆకుకూరలలో ఉండే క్లోరోఫిల్ శరీరానికి శుభ్రతను అందిస్తుంది. శరీరంలోని టాక్సిన్లు బయటికి వెళ్లేందుకు ఇది సహాయపడుతుంది. ఆపిల్ సైడర్ వెనిగర్ ఆల్కలీన్ లక్షణం కలిగి ఉంటుంది. 1 టేబుల్ స్పూన్ ఆపిల్ సైడర్ వెనిగర్ తీసుకుని గోరువెచ్చని నీటిలో కలిపి తాగాలి. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల ఎక్కువసేపు కడుపు నిండినట్లు అనిపిస్తుంది. ఆకలిని నియంత్రించడంలో కూడా ఇది సహాయపడుతుంది. దోసకాయ రసం తరచుగా తాగడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. ఇది శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. దోసకాయ నీరు శరీరాన్ని శుభ్రపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ ఆరోగ్యం మెరుగుపడేందుకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. నిమ్మకాయ నీరు తాగడం వల్ల శరీర సమతుల్యత మెరుగవుతుంది. నిమ్మకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ గుణాలు కలిగి ఉంటుంది. శరీరంలో ఉన్న విషాలను, అదనపు నీటిని బయటకు పంపించడంలో ఇది సహాయపడుతుంది. రోజూ ఉదయాన్నే గోరువెచ్చటి నిమ్మకాయ నీటిని తాగడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

## మామిడి పండుతో కలిపి ఇవి తింటున్నారా..?



వేసవి మామిడి పండ్ల సీజన్ వచ్చేసింది. ఈ రుచికరమైన పండ్లను ఆస్వాదించడానికి ప్రజలు ఎదురు చూస్తూ ఉంటారు. మామిడి పండును ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. చాలా మందికి మామిడి పండు రోటీ, పూరీతో తినడానికి ఇష్టపడతారు. కానీ, మామిడి పండుతో కలిపి తినకూడని ఆహారాలు కొన్ని ఉన్నాయి. వాటిని తినటం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. సీజనల్‌ఫ్రూట్ మామిడి పండు ఆరోగ్యానికి చాలా మంచిది. మామిడి పండును ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. కానీ కొందరు దీన్ని పెరుగుతో కలిపి తింటారు.

ఈ రెండు కలయికలు కలిసినప్పుడు శరీరంలో విష పదార్థాలు ఉత్పత్తి అవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మామిడి శరీరంలో వేడిని కలిగిస్తుంది. పెరుగు చల్లదనాన్ని ఇస్తుంది. ఈ రెండు లక్షణాలు శరీరంలో ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. దీనివల్ల జీర్ణవ్యవస్థలో సమస్య, చర్మంలో అలెర్జీ వస్తుంది. కాబట్టి మామిడి తిన్న తర్వాత కొంత సమయం గడిచిన తర్వాత పెరుగు తినడం మంచిది. మామిడి పండ్లను సిట్రస్ పండ్లు, పుల్లని రుచి కలిగిన వాటిని కలిపి తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే అవి శరీరం జూం సమతుల్యతకు అంతరాయం కలిగిస్తాయి. మామిడి శరీరంపై వేడి ప్రభావాన్ని చూపుతుంది. దానిని పెరుగుతో కలిపి తీసుకోవడం మంచిది కాదు. అలా తినకండి, ఎందుకంటే అది జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. మామిడి పండ్లను కూల్‌డ్రింక్స్‌తో కూడా కలిపి తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే అది రక్తంలో చక్కెర స్థాయిని పెంచుతుంది. భోజనం తర్వాత మామిడి పండ్లు సరిగ్గా జీర్ణమయ్యేలా కొంత సమయం విరామం తీసుకుని తినండి. అలా తినడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. మామిడిపండు తిన్న వెంటనే, తినక ముందు స్పైసీ ఫుడ్ కూడా తినకూడదని అంటున్నారు. ఇలా తినటం వల్ల ఎసిడిటీ, గుండెల్లో మంట, మలబద్ధకం, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే, మామిడి పండ్లు తిన్న తర్వాత, తినక ముందు.. మంచి నీళ్లు తాగకూడదని చెబుతున్నారు.

## నేరేడు పండు పిల్లలకు, పెద్దలకు మస్తు మంచిది..!



నేరేడు పండు అనేక ఆరోగ్య ప్రయోజనాలకు ప్రసిద్ధి. పిల్లలు, పెద్దలు ఇష్టపడే ఈ పండు విటమిన్లు, ఖనిజాలతో నిండిపోయి ఉంటుంది. శరీరానికి అవసరమైన పోషకాలను అందించే ఈ పండు బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఎంపికగా నిలుస్తుంది. ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ పండును తీసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. నేరేడు పండు పిల్లలకు, పెద్దలకు మస్తు మంచిది..! కానీ వేసవిలో నేరేడు పండు విస్తృతంగా లభిస్తుంది. ఈ కాలంలో దాహాన్ని తగ్గించడంలో శరీరాన్ని చల్లబరచడంలో నేరేడు మంచి పాత్రను పోషిస్తుంది. ఇది పేగు సంబంధిత సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో రక్తపోటును సమతుల్యంలో ఉంచడంలో కూడా ఇది సహకరిస్తుంది. ఆరోగ్యాన్ని బలోపేతం చేయడంలో నేరేడు కీలక పాత్ర పోషిస్తుంది. నేరేడు పండు ఆరోగ్యానికి మేలు చేస్తుంది కాని దీనిని అధికంగా తినడం వల్ల కొన్ని సమస్యలు వస్తాయి. ఇందులో ఫైబర్, టానిన్లు అధికంగా ఉంటాయి. ఎక్కువగా తినడం వల్ల పేగులపై ఒత్తిడి పెరిగి కడుపు నొప్పి, ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు తలెత్తుతాయి. కొంతమందికి జీర్ణక్రియ సమస్యలు కలుగుతాయి. అందువల్ల మితంగా తినడం అవసరం. నేరేడు విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది. చర్మానికి మేలు చేయడంలో ఇది సహాయపడుతుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ప్రకాశవంతంగా కనిపించడంలో ఇది ఉపయోగపడుతుంది.

అయితే కొంతమందిలో మొటిమలు, చిన్న చర్మ రుగ్మతలు వచ్చే అవకాశం ఉంది. కనుక ఎక్కువగా తినకుండా జాగ్రత్తగా ఉండాలి. నేరేడు పండులో ఉండే ఆమ్లత్వం దంతాలపై ఉన్న ఎనామిల్‌ను బలహీనపరుస్తుంది. దీని వల్ల దంతాలు నెమ్మదిగా బలహీనపడే ప్రమాదం ఉంది. ఇందులో ఆక్సలేట్‌లు కూడా ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో కాల్షియంతో కలసి మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంది. అందువల్ల నేరేడు తినేటప్పుడు పరిమితిని పాటించాలి. నేరేడు తిన్న వెంటనే నీరు తాగడం మంచిది కాదు. అలాగే పండు తినడానికి ముందు లేదా తిన్న వెంటనే పాలు తాగకూడదు. ఊరగాయలు వంటి కారమైన ఆహారాలతో కూడా ఈ పండును తీసుకోవడం మంచిది కాదు. ఇవి జీర్ణ సమస్యలకు దారితీయవచ్చు. సరైన పద్ధతిలో తీసుకుంటే మాత్రమే ఈ పండులోని మేలు పొందవచ్చు. నేరేడు తక్కువ గ్లైసెమిక్ సూచిక కలిగి ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ఇది సహాయపడుతుంది. అయితే అధికంగా తీసుకుంటే రక్తపోటు తగ్గడం, వికారం వంటి సమస్యలు కలుగుతాయి.

## ఈ ఆహార పదార్థాలతో థైరాయిడ్‌కి చెక్ ?

ప్రస్తుతం చాలా మంది మహిళలు థైరాయిడ్ సమస్య బారిన పడుతూ చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. చూడటానికి చిన్నగా కనిపించినా ఇది శరీరంపై చాలా ప్రభావాన్ని చూపుతుంద. ముఖ్యంగా శారీరక, మానసిక స్థితిపై కూడా దీని ప్రభావం చాలా ఉంటుంది. అందువలన థైరాయిడ్ సమస్య నుంచి త్వరగా బయటపడాలంటే తప్పకుండా ఈ ఆహార పదార్థాలు మీ డైట్ లో చేర్చుకోవాలంట. కొబ్బరి నూనె శరీరానికి చాలా మంచిది. దీనితో రుచి మాత్రమే కాకుండా ఇది థైరాయిడ్ పనితీరును మెరుగు పరుస్తుంది. దీనిలోని మీడియం-చైన్ ఫ్యాటీ యాసిడ్స్ కారణంగా, ఇది హార్మోన్ల పనితీరుకు మద్దతు ఇస్తుంది. అందువలన తప్పకుండా కొబ్బరి నూనెను మీ ఆహారంలో చేర్చుకోవాలంట. పెరుగు అంటే చాలా మందికి ఇష్టం ఉంటుంది. దీని రుచి కూడ చాలా బాగుంటుంది. కానీ ఇది రుచే కాకుండా థైరాయిడ్ సమస్య నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుందంట. ఇందులోని జింక్, అయోడిన్ థైరాయిడ్ హార్మోన్ పనితీరును మెరుగు పరుస్తుందంట. అందువలన తప్పకుండ రోజులో ఒకసారి పెరుగు తినాలంట. గుమ్మడి గింజలు శరీరానికి చాలా మంచిది. ఇవి థైరాయిడ్ సమస్యతో బాధపడేవారు తీసుకోవడం తప్పనిసరి. ఎందుకంటే, ఇందులో ఉండే జింక్, థైరాయిడ్ హార్మోన్లు ఉత్పత్తి చేయడానికి, అలాగే రోగనిరోధక శక్తి పెంచడానికి సహాయపడుతాయంట. మెంతులు సాధారణంగా వంటగదిలో ఉపయోగించేవి. కానీ ఇవి మీ థైరాయిడ్ గ్రంథికి చాలా ఉపయోగపడుతుంది. అవి హార్మోన్లను సమతుల్యం చేయడంలో, థైరాయిడ్ పనితీరుకు మద్దతు ఇవ్వడంలో సహాయపడతాయి. వాటిని రాత్రంతా నానబెట్టడం తీసుకోవడం వలన జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తాయి. బ్రెజిల్ గింజలు సెలీనియం యొక్క గొప్ప మూలం, ఇది మీ థైరాయిడ్ హార్మోన్లను తయారు చేయడానికి అవసరమైన ఖనిజం. రోజుకు ఒకటి లేదా రెండు బ్రెజిల్ గింజలు మీ థైరాయిడ్ సరిగ్గా పనిచేయడానికి సహాయపడతాయి. మీరు వాటిని స్నాక్‌గా తినవచ్చు లేదా క్రంచీ, రుచిని పెంచడానికి ఓట్ మీల్ లేదా పెరుగుతో కలిపి చూర్ణం చేయవచ్చు.

## గుండె జబ్బులు రావొద్దంటే ఇవి తినాల్సిందే..!



పిస్తాపప్పులు అనేక పోషకాలను అందించే అద్భుత ఆహారం. వీటి ద్వారా శరీరానికి ఆరోగ్యం, కంటి ఆరోగ్యం, హృదయ ఆరోగ్యం, మెదడు ఆరోగ్యం పెరుగుతాయి. విటమిన్ బీ6, యాంటీ ఆక్సిడెంట్లు, మంచి కొవ్వులు వంటి పోషకాలు ఇందులో అధికంగా ఉంటాయి. ఇవి బరువు తగ్గడంలో సహాయపడతాయి, అనేక రుగ్మతల నుండి రక్షిస్తాయి. పిస్తాపప్పులలో విటమిన్లు, ఖనిజాలు, ఇతర అనేక పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి మంచి ఆరోగ్యాన్ని అందిస్తాయి. పిస్తాపప్పులలో ఉండే విటమిన్ బీ6 రక్తంలో హిమోగ్లోబిన్ పెరగడానికి సహాయపడుతుంది. హిమోగ్లోబిన్ పెరిగితే శరీర కణాలకు ఆక్సిజన్ సమృద్ధిగా అందుతుంది. ఆక్సిజన్ సరిపడా అందడం వల్ల శరీరంలోని అన్ని అవయవాలు సక్రమంగా పనిచేస్తాయి. రోగనిరోధక శక్తి బలపడటానికి పిస్తాపప్పులు సహకరిస్తాయి. దీని వల్ల చిన్న చిన్న వైరల్ వ్యాధుల నుంచి శరీరం రక్షించబడుతుంది. ఒక అమెరికన్ విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనం ప్రకారం పిస్తాపప్పులు కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తేలింది. పిస్తాపప్పులలో లుటిన్, జియాక్సంతిన్ అనే సూక్ష్మపోషకాలు ఉంటాయి. గుడ్లలో కేవలం లుటిన్ మాత్రమే ఉంటుంది. కానీ పిస్తాపప్పులలో రెండు సూక్ష్మపోషకాలు కలిసి పనిచేస్తాయి. ఇవి కంటి రెటీనా ఆరోగ్యాన్ని కాపాడటంలో ముఖ్యమైనవి. కంటి చూపు మందగించకుండా చూసుకోవాలంటే పిస్తాపప్పులు సహాయపడతాయి. వయస్సు పెరుగుతున్నప్పుడు వచ్చే మాక్యులర్ డిజనరేషన్ వంటి కంటి సమస్యలు తగ్గడానికి ఇది సహకరిస్తుంది. పిస్తాపప్పులలో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి హృదయ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మంచి కొవ్వులు అయిన మోనో, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడతాయి. దీని వల్ల గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. అదనంగా శరీరంలోని శక్తి స్థాయిని పెంచటానికి కూడా ఇవి ఉపయోగకరంగా ఉంటాయి. ఆరోగ్యవంతమైన జీవనవిధానాన్ని అలవర్చుకోవాలంటే పిస్తాపప్పులు ఖచ్చితంగా తినాలి. వృద్ధాప్యంలో దృష్టి మందగించడాన్ని చాలా మంది ఎదుర్కొంటారు. ఈ సమస్యను తగ్గించడంలో పిస్తాపప్పులు సహాయపడతాయి. 57 గ్రాముల పిస్తాపప్పులను 12 వారాల పాటు నిరంతరం తినడం వల్ల రెటీనా ఆరోగ్యం మెరుగుపడుతుందని పరిశోధనలు వెల్లడించాయి. రెటీనా బలంగా ఉంటే కంటి చూపు క్రమంగా మెరుగవుతుంది.

# సినిమా



## అప్పుడు థ్రిల్లర్.. ఇప్పుడు హారర్

తెలుగులో చాలామంది హీరోలు ఉన్నారు. వాళ్లలో ఒకడు బెల్లంకొండ శ్రీనివాస్. పదేళ్లకు పైనే ఇండస్ట్రీలో ఉన్నాడు కానీ చెప్పుకోదగ్గ సినిమాలు ఒకటి రెండు మాత్రమే ఉన్నాయి. చివరగా 2023లో ఛత్రపతి చిత్రాని హిందీలో రీమేక్ చేసి ఘోరంగా ఫెయిలయ్యాడు. దీంతో చాలా గ్యాప్ తీసుకుని ఒకేసారి నాలుగు సినిమాల్ని రెడీ చేస్తున్నాడు. అందులో 'భైరవం' త్వరలో రిలీజ్ అవుతుంది. ఇప్పుడు 'కిష్కింధపురి' అని మరో మూవీ ప్రకటించాడు. తాజాగా గ్లింప్స్ రిలీజ్ చేశారు. పాడుబడ్డ పెద్ద భవంతి, అందులో హీరో అండ్ గ్యాంగ్ వెళ్తారు. తర్వాత ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయనే అంశాలతో ఈ 'కిష్కింధపురి' తీసినట్లు అనిపిస్తుంది. గతంలో బెల్లంకొండ హీరోతో 'రాక్షసుడు' సినిమాలో నటించిన అనుపమ.. ఇందులో హీరోయిన్. తొలిసారి హారర్ జానర్ సినిమాతో బెల్లంకొండ శ్రీనివాస్ రాబోతున్నాడు. ఈ వర్షాకాలంలోనే మూవీ రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. కౌశిక్ పెగళ్లపాటి దర్శకుడు. మరి ఈసారైనా బెల్లంకొండ హిట్ కొడతాడా? ఈ గ్లింప్స్ చూస్తుంటే విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ బాగుంది. చివర్లో హీరో... అహం మృత్యు అని చెప్పిన డైలాగ్, ఆ టైంలో కళ్లు దెయ్యం కళ్లలా ఉండటం చూస్తుంటే ఈసారి ప్రేక్షకుల్ని భయపెడతారనిపిస్తోంది. గతంలో అనుపమతో థ్రిల్లర్ మూవీ చేయగా.. ఇప్పుడు హారర్ చేశాడు శ్రీనివాస్.

## అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పిన ఎన్టీఆర్



ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా నుంచి కీలకమైన అప్డేట్ వచ్చేసింది. ఈ సినిమా విడుదల తేదీని తాజాగా ఎన్టీఆర్ ప్రకటించారు. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) మూవీని అత్యంత భారీ బడ్జెట్‌తో పీరియాడికల్ స్టోరీతో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది . ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏప్రిల్ 22 నుంచి షూటింగ్‌లో ఎన్టీఆర్ ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. 'దేవర' తర్వాత ఎన్టీఆర్.. 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ ఇలా ఇద్దరూ తెలుగులో కలిసి చేస్తున్న చిత్రమిదే కావడంతో అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అభిమానులకు ఎన్టీఆర్ శుభవార్త చెప్పారు. చిత్రాన్ని 2026 జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు. ఎన్టీఆర్ బర్త్ డే కానుకగా మే 20న ఈ మూవీ నుంచి స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇద్దరు డైనమిక్ వ్యక్తుల కాంబినేషన్‌తో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్ద విధ్వంసమే జరగనుంది. ఆ అనుభూతి పొందేందుకు సిద్ధకండి అంటూ మైత్రీ మూవీ మేకర్స్ పేర్కొంది. వచ్చే సమ్మర్‌లో బాక్సాఫీస్ వద్ద ఫుల్ సందడి వాతావరణం కనిపించడం గ్యారెంటీ అని చెప్పవచ్చు. ప్రస్తుతం కర్ణాటకలో ఈ మూవీ షూటింగ్ జరుగుతుంది. మొదట వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్ర యూనిట్ ప్రకటించింది. అయితే, కథ వల్ల వీఎఫ్ఎక్స్ పనులతో పాటు చిత్రీకరణ విషయంలోనూ మరింత స్ట్రాంగ్‌గా ప్లాన్ చేయడం వల్లే కాస్త ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు. పోస్ట్ ప్రొడక్షన్స్ పనులు కూడా మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ విషయానికి వస్తే.. తారక్ నటిస్తోన్న 31వ చిత్రమిది. షూటింగ్‌లో భాగంగా కొద్దిరోజుల క్రితమే రామోజీ ఫిల్మ్ సిటీలో ఓల్డ్ కోల్‌కతా బ్యాక్‌డ్రాప్‌లో ఓ ప్రత్యేక సెట్‌ను సిద్ధం చేసి అక్కడ కొన్ని సీన్స్ చిత్రీకరించారు. ఇప్పటికే చాలా వరకు షూటింగ్ పనులు కూడా పూర్తి అయ్యాయి. అయితే, ఎన్టీఆర్‌తో తెరకెక్కించబోయే సీన్లు మాత్రం కాస్త ఆలస్యంగా ప్రారంభించారు. శ్రీలంకలోని కొలంబోలో కూడా ఎన్టీఆర్‌తో షూటింగ్ షెడ్యూల్స్ ఉన్నాయి. ఆల్రెడీ యూనిట్‌లోని కీలక సాంకేతిక నిపుణులు కొలంబో వెళ్లి, అక్కడి లొకేషన్స్‌ను ఫైనల్ చేశారని తెలిసింది.



## ఏడాది తర్వాత.. మరో ఓటీటీలోకి కామెడీ ఎంటర్‌టైనర్..

శ్రీవిష్ణు కథానాయకుడిగా శ్రీహర్ష కొనుగంటి తెరకెక్కించిన కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓం భీమ్ బుష్' గతేడాది మార్చిలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఆడియన్స్‌కు నవ్వులు పంచి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులో ఉన్న ఈ సినిమా ఇప్పుడు మరో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చేస్తోంది. సింప్లీ సౌత్ వేదికగా మే 2 నుంచి ప్రసారం కానుంది. శ్రీవిష్ణుతో పాటు ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రలు పోషించిన ఇందులో ప్రీతి ముకుందన్, అయేషాఖాన్, ఆదిత్య మీనన్ తదితరులు నటించారు.

కథేంటంటే: లెగసీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ విద్యార్థులు బ్యాంగ్ బ్రదర్స్ క్రిష్ (శ్రీవిష్ణు), వినయ్ గుమ్మడి (ప్రియదర్శి), మ్యాడీ రేలంగి (రాహుల్ రామకృష్ణ). వీళ్లు చేసే పనులు భరించలేక తక్కువ సమయంలోనే ముగ్గురికీ డాక్టరేట్లు ఇచ్చి పంపించేస్తారు కళాశాలలోని ప్రొఫెసర్. దాంతో వీరు భైరవపురం చేరుకుంటారు. ఏ టు జెడ్ సర్వీసెస్ పేరుతో ఓ దుకాణం తెరిచి ఎలాంటి సమస్యలకైనా పరిష్కారం చూపిస్తామని ప్రచారం చేసుకుంటారు. కానీ ఈ ముగ్గురూ ఊరి జనాల్ని బురిడీ కొట్టిస్తున్నారనే విషయం బయటపడుతుంది. దాంతో ఊరి సర్పంచ్ ఓ పరీక్ష పెడతారు. సంపంగి మహల్‌లో ఉన్న నిధిని కనిపెట్టి తీసుకొస్తే వారిని నమ్ముతామని చెబుతారు. దెయ్యం ఉన్న ఆ మహల్‌లోకి నిధి కోసం వెళ్లాక ఈ బ్యాంగ్ బ్రదర్స్‌కి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఇంతకీ ఆ మహల్‌లో ఉన్న సంపంగి దెయ్యం కథేమిటి?అనేది సినిమాలో చూపించారు.

## రాజమౌళి సినిమా కోసం మరీ ఇంత చేంజా!

సూపర్ స్టార్ మహేష్ బాబు టాలీవుడ్ స్టార్ హీరోలలో ఒకరు. ఆయన గ్లామర్‌కి ఎవరైన ఫిదా కావల్సిందే. కృష్ణ నటవారసుడిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మహేష్ తనదైన నటనతో స్టార్ హీరోగా ఎదిగాడు. ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు తన 29వ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఇండియన్ సినిమా చరిత్రలోనే రాజమౌళి ఈ చిత్రాన్ని అత్యంత భారీ చిత్రంగా రూపొందిస్తున్నారు. ఏకంగా 1000 కోట్ల బడ్జెట్ లో ఈ చిత్రం తెరకెక్కుతుండగా, ఈ మూవీతని ఆఫ్రికా అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్ చిత్రంగా రాజమౌళి అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. అయితే రాజమౌళి సినిమాలో హీరో లుక్ గత సినిమాల కన్నా భిన్నంగా ఉంటుందనే విషయం మనకు తెలిసిందే. ఇప్పుడు మహేష్ బాబు లుక్ ఎలా ఉంటుందనే చర్చ గత కొన్ని రోజులుగా నడుస్తుంది. ఈ క్రమంలో మహేష్ బాబు లేటెస్ట్ లుక్ లీక్ అయింది. ఇందులో హెయిర్, గడ్డం పొడవుగా కనిపిస్తున్నాయి. లేటెస్ట్ లుక్ మాత్రం ఫ్యాన్స్ కి షాకింగ్ గా ఉంది.



## నితిన్‌కి 'ఎల్లమ్మ' కష్టాలు!



'బలగం' తర్వాత దర్శకుడు వేణు చాలా గ్యాప్ తీసుకున్నాడు. తన రెండో సినిమా 'ఎల్లమ్మ' అని ప్రకటించి చాలా రోజులైంది కానీ, ఇంకా పట్టాలెక్కలేదు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రంలో తొలుత నాని హీరోగా నటిస్తారనే ప్రచారం జరిగింది. నాని కూడా వేణుతో సినిమా చేస్తానని చెప్పారు. ఏం జరిగిందో తెలియదు కానీ నాని ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నాడు. చివరకు ఈ కథ అటు తిరిగి ఇటు తిరిగి నితిన్ దగ్గర వెళ్లింది. కథ బాగా నచ్చడంతో నితిన్ ఈ చిత్రాన్ని వెంటనే ఓకే చేశాడు. డేట్స్ కూడా అరేంజ్ చేసుకున్నాడు. నిర్మాత దిల్ రాజు కూడా సినిమా షూటింగ్ స్టార్స్ చేసేందుకు రెడీగా ఉన్నాడు. కానీ ఈ సినిమాకు కీలకమైన హీరోయిన్ మాత్రం దొరకడం లేదట. 'ఎల్లమ్మ' కోసం అటు దిల్ రాజు, నితిన్.. ఇటు వేణు తెగ వెతుకుతున్నారట. బలగం మాదిరే ఈ కథ కూడా రూరల్ నేపథ్యంలోనే సాగుతుదంట. దర్శకుడు వేణు చాలా పకడ్బంధీగా ఈ సినిమా స్క్రిప్ట్ రెడీ చేసుకున్నాడట. అయితే ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రకి చాలా ప్రాధాన్యత ఉంటుందట. కథ మొత్తం ఆమె చుట్టునే తిరుగుతుంది. అందుకే ఓ స్టార్ హీరోయిన్‌ని ఆ పాత్రకు తీసుకోవాలనుకున్నారట. తొలుత సాయి పల్లవి అయితే బాగుంటందని ఆమెను సంప్రదించారు. అయితే సాయి పల్లవి ఈ సినిమా చేయలేనని చెప్పేసిందట. దీంతో మరో స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ అయితే 'ఎల్లమ్మ'కు న్యాయం చేస్తుందని ఆమెను సంప్రదించారట. అయితే కథ, పాత్ర బాగా నచ్చినప్పటికీ.. డేట్స్ ఖాళీగా లేకపోవడం నో చెప్పేసిందట. శ్రీలీలను తీసుకుందామంటే.. అల్రెడీ నితిన్‌తో రెండు సినిమాలు చేసింది. అవి కూడా ఫ్లాప్ అవ్వడంతో దిల్ రాజు వెనకడుకు వేస్తున్నాడట. ఇక రష్మిక, సమంత లాంటి హీరోయిన్లు కూడా ఖాళీగా లేరు. నితిన్ ఎప్పుడైన తన సినిమాలకు ట్రెండింగ్ హీరోయిన్‌ని తీసుకుంటాడు. కానీ ఈ సారి మాత్రం అది వర్కౌట్ అయ్యేలా లేదు. స్టార్ హీరోహీరోయిన్లు అంతా బిజీగా ఉన్నారు. మరి 'ఎల్లమ్మ'గా ఎవరు ఎంట్రీ ఇస్తారో చూడాలి.

# ఆగమైంది తెలంగాణ కాదు.. కేసీఆర్ కుటుంబం

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ మీద పడి దోచుకుందన్నారు. 'తెలంగాణ ఆగమైంది.. కాంగ్రెస్ విలన్' అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం తీవ్రంగా మండిపడ్డారు. మరో పదేళ్ల దోచుకోవడం ఆగిందని తెలంగాణ ఆగమైందా? తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం, రైతు రుణమాఫీ, ఎస్సీ వర్గీకరణ, కులగణన, రైతుబంధుపై చర్చిద్దామా? అంటూ ఈ సందర్భంగా సవాల్ విసిరారు. ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు కేసీఆర్ ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు.

### ప్రభుత్వ నిర్ణయాల్లో ఎక్కడా మంచి కనబడట్లేదా?

"బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేసుకుంటే బస్సులు ఇవ్వాలని చెప్పాం. సభకు అవసరమైన వెసులు బాటుకల్పించాలని అధికారులను ఆదేశించాం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం బలంగా ఉండాలి. బీఆర్ఎస్ సభకు మేం సంపూర్ణంగా సహకరించింది నిజం కాదా? ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంలో ఎక్కడా మంచి కనబడటం లేదా? ప్రభుత్వాన్ని భుజం తడుతూ వైఫల్యాలను ప్రశ్నించాలి. మా వైఫల్యాలపై ఎండగట్టాలి.. కానీ, ప్రతిపక్ష నేత ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా ప్రభుత్వ వసతులు అనుభవిస్తున్నారు. 16 నెలలుగా జీత భత్యాలు తీసుకొని ఫాంహౌస్‌లోనే ఎందుకు ఉంటున్నారు?

ప్రభుత్వ జీతం తీసుకుంటూ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదు?. ఇన్నాళ్లుగా ఆయన ఇంట్లో నుంచి కాలు కదపకుండా జీతభత్యాలు తీసుకున్నారు.. ఇది ఏ చట్టంలో ఉంది?. ప్రతిపక్ష నాయకుడిగా రూ. 65 లక్షలు, వాహనాలు, పోలీస్ భద్రత తీసుకున్నారు. మరి ఎందుకు ప్రతిపక్ష నాయకుడిగా పని చేయకుండా ఫామ్ హౌస్‌లో పడుకున్నారని ప్రజలు



ప్రశ్నిస్తున్నారు

ఫామ్ హౌజ్‌లో పడుకుని ప్రజలకు ఏం సందేశం ఇవ్వదలచుకున్నారు?. సంక్షేమ పథకాలు ఆగిపోయాయని ఆయన మాట్లాడిండు. రైతు బంధు, ఆరోగ్యశ్రీ, ఉచిత కరెంటు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి వీటిలో ఏది ఆగిపోయింది?. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం.. ఇవేవీ మీకు కనిపించడంలేదా?. మీరు ఏ మత్తులో తూగుతున్నారో మీకే తెలియాలి. కడుపు నిండా విషం పెట్టుకుని విద్వేష పూరితప్రసంగం చేసి ప్రజల్ని రెచ్చగొట్టి ఏం చేయాలనుకుంటున్నారు?

కేసీఆర్ మాటల్లో.. కళ్ళల్లో విషం కనిపిస్తోంది. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ విలన్ ఎలా అవుతుంది?. పదేళ్లు దోచుకున్న మీకు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదు. ఆగమైంది తెలంగాణ కాదు.. కేసీఆర్ కుటుంబం. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రకు వెళ్లినట్లు కేసీఆర్ వరంగల్ వెళ్లారు. ఆయన వరంగల్ వెళ్లి పాపాలు కడిగేసుకున్నానుకుంటున్నారు.. కానీ అక్కడికి వెళ్లి అబద్ధాలు మాట్లాడి ఇంకో తప్పు చేశారు. వరంగల్ సభలో నా పేరు కూడా పలకలేకపోయారు

బసవేశ్వరుడి స్ఫూర్తితో 'రాష్ట్ర ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి' అనే విధానంతో మా ప్రభుత్వం ముందుకు వెళుతున్నాం. ప్రజలకు మేలు చేయడమే మా పని ప్రచారం చేయాల్సింది మీరే. మీరే మా బ్రాండ్ అంబాసిడర్లు" అని రేవంత్ అన్నారు.

### ఇవేవీ కనబడటం లేదా?

అసెంబ్లీకి రాను.. మా పిల్లల్ని పంపామని చెబుతున్నారు. పిల్లలను సభకు పంపితే మీరెందుకు ప్రతిపక్ష నేతగా ఉన్నారు? సభకు రాని ప్రతిపక్ష నేతకు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు ఉందా? ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు ఎందుకు వెళ్లడంలేదు. అధికారం ఉంటే చెలాయిస్తాం. లేకపోతే ఫాం హౌస్‌లో ఉంటామంటున్నారు. గత ప్రభుత్వ పథకాలు నిలిపివేసినట్లు చెబుతున్నారు. మీరు హయాంలోని పథకాలు ఏం ఆగిపోయాయి? రైతుబంధు ఆగిందా?, షాదీముబారక్, కల్యాణలక్ష్మీ, ఫీజురియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ ఆగాయా? రాష్ట్రంలో ప్రజా పాలన ఎక్కడైనా ఆగిందా? మేం సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఇళ్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. రెండున్నర లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. ప్రైవేటులో లక్ష ఉద్యోగాలు కల్పించాం. హైదరాబాద్‌ను విస్తరించేందుకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఇవేమీ మీకు కనడటంలేదా?. కడుపు నిండా విషం నింపుకొని విద్వేషపూరిత ప్రసంగంతో ప్రజల మధ్య చిచ్చుపెట్టాలనే ప్రయత్నం మంచిదికాదు" అన్నారు.

# ఏ పథకం ఆగలేదు అనడానికి సీఎం రేవంత్‌కు సిగ్గుండాలి

-మొదటిపేజీ తరువాయి

మైండ్ బ్లాంక్ అయినట్లుంది. సిగ్గులేకుండా ఏ పథకం ఆగిపోయిందో చెప్పాలి అంటున్నడు కేసీఆర్ కిట్టు ఆగిపోలేదా, దళిత బంధు ఆగిపోలేదా, బీసీ బంధు ఆగిపోలేదా, గొర్రెల పంపిణీ ఆగిపోలేదా, రెండు నెలల పింఛన్లు ఆగలేదా, డబుల్ బెడ్ రూం ఇళ్లలు ఆగలేదా, స్కాలర్ షిప్స్ ఆగలేదా, ఫీజు రీయింబర్స్ మెంట్ ఆగలేదా. మీ 15 నెలల పాలనలో ఆగని పథకం ఏదైనా ఉందా? విద్యార్థులను ముందు పెట్టుకొని, ఇచ్చిన మాట మీద నిలబడుతా అని గొప్పలు చెప్పి సప్పట్లు కొట్టించుకుంటున్నవు అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్ అయ్యారు.

నీ ఆరు గ్యారెంటీలు ఏమైనయి, నీ 420 హామీలు ఏమైనయి, ఏడాదిలో రెండున్నర లక్షల ఉద్యోగాలు ఏమైనయి జాబ్ క్యాలెండర్ ఏమైంది, విద్యార్థులకు విద్యాభరోసా కార్డు ఏమైంది, విద్యార్థినులకు స్కూటీ ఏమైంది, మహిళలకు 2500 ఏమైంది, తులం బంగారం ఏమైంది, కౌలు రైతులకు భరోసా ఏమైంది, 15వేల రైతు భరోసా ఏమైంది, ఇంకా సిగ్గు లేకుండా మాట తప్పను, శత్రువులు కూడా నన్ను ఏమనరు




అంటడు. ఒక్కసారి నీ మేనిఫెస్టో చూసుకో రేవంత్ రెడ్డి. నీ మాట తప్పుడు ఏందో నీకే అర్థమైతది నీ సవాల్‌ను నేను స్వీకరిస్తున్నా రేవంత్ రెడ్డి, నువ్వు అన్నట్లు కాళేశ్వరం మీద చర్చ పెడుదామా? రుణమాఫీ మీద పెడుదామా? రైతు బంధు మీద పెడుదామా? నీ బోగస్ 60 వేల ఉద్యోగాల మీద పెడుదామా, కులగణన మీద పెడుదామా? దేని మీదైనా చర్చకు సిద్ధం, ప్లేస్, టైం నువ్వే చెప్పు అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు సవాల్ విసిరారు. రుణమాఫీ మీద చర్చ అని ఇప్పటికే తోకముడిచినవు ఇప్పుడు కూడా అలా చేసి తప్పించుకోకు పదేళ్లు అధికారంలో ఉంటా అని పగటి కలలు కంటున్న రేవంత్ రెడ్డి, ఉన్న మూడేళ్లు నీ కుర్చీ సక్కగ ఉండేలా చూసుకో. ఏ పక్క నుంచి ఎవరు వచ్చి లాక్కుంటరో చూసుకో నువ్వు ఎంత మేకపోతు గాంభీర్యం చూపినా, కాంగ్రెస్ సర్కారు అట్టర్ ఫ్లాప్ అన్నది రోజుకోసారి నిరూపితమవుతున్నది. ఇదెక్కడి దిక్కుమాలిన ప్రభుత్వం అని అనుకోని ప్రజానీకం ఉందా అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ఇంత ఘోరంగా విఫలమైన ప్రభుత్వం మరొకటి లేదు అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల ప్రజలతో తిట్లు తింటున్న ఏకైక సీఎం రేవంతే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. శిశుపాలుడి లెక్క తప్పు మీద తప్పు చేస్తున్న నీ వైఖరిని ప్రజలు అందరూ గమనిస్తున్నారు. తగిన సమయంలో బుద్ధి చెబుతారు. నీ పేరును కేసీఆర్ పలకాలని ఎన్నో రోజుల నుంచి అడుక్కుంటున్నవు. కుసంస్కారం, కుంచిత స్వభావం ఉన్న నీలాంటి వారి పేరును కేసీఆర్ తీయవలిసిన అవసరం ఏమిటి? అని సీఎంను హరీశ్‌రావు ప్రశ్నించారు.

# కుల వివక్షపై పోరాడిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడు

**వికారాబాద్ :** లింగ వివక్షతలను రూపుమాపడానికి కృషి చేసిన అభ్యుదయ వాది మహాత్మా బసవేశ్వరుడని రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. బుధవారం మహాత్మా బసవేశ్వర 892 వ జయంతోత్సవం సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని ఎన్నేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతలను రూపుమాపడానికి కృషి చేసిన అభ్యుదయ వాది బసవేశ్వరుడని కొనియాడారు. కులం లేదు, మతం లేదు, అందరం సమానమే అని నినదించిన వ్యక్తి బసవేశ్వరుడని పేర్కొన్నారు. మనుషులందరూ ఒక్కటే, కులాలు లేవు, ఉప కులాలు లేవు అని చాటాడు. బసవేశ్వరుడి ఆధ్వర్యంలో ఆనాడే కులాంతర వివాహాలు జరిగాయని పేర్కొన్నారు. కులాల పేరుతో విడిపోకుండా అందరు కలిసి జీవించే విధంగా హైందవ మతాన్ని సంస్కరించారని తెలిపారు. కుల రహిత సమాజం కోసం శతాబ్దాల క్రితమే కృషి చేసిన గొప్ప వ్యక్తి బసవేశ్వర మహారాజ్ అని కొనియాడారు. బసవేశ్వరుని బోధనలను ఆదర్శంగా తీసుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలు, మతాలను సమాన దృష్టితో చూస్తుందని వివరించారు. మనమందరం బసవేశ్వర మహారాజ్ బోధనలను ఆదర్శంగా తీసుకొని వాటిని నిజ జీవితంలో ఆచరించాలని, అప్పుడే సమాజంలో అందరూ



సుఖ, సంతోషాలతో ఆనందంగా జీవిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్‌పటేల్, బార్‌అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మైండ్ గేమ్‌లో మావోయిస్టులు

**వరంగల్ :** బచావో కర్రెగుట్టల పేరుతో.. భద్రతా బలగాలు దూసుకెళ్లాయి. దాదాపు ఏడు రోజులుగా జల్లెడ పడుతున్నాయి. భారీ సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో సాయుధ బలగాలు ముందుకెళ్లినా.. ఫలితం లేదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయితే.. మావోయిస్టులు కావాలనే భద్రతా బలగాలను కర్రెగుట్టల వైపు రప్పించారా.. బలగాల దృష్టి మరల్చి మరో ప్రాంతానికి వెళ్లారా అనే చర్చ జరుగుతోంది. మావోయిస్టులు మరేదో వ్యూహం పన్నారనే చర్చ నడుస్తోంది. రెండు వారాల కిందట మావోయిస్టులు ఓ లేఖను విడుదల చేశారు. తమ రక్షణ కోసం కర్రెగుట్టల్లో బాంబులు అమర్చామని.. ఆదివాసీలు ఇటువైపు రావొద్దని హెచ్చరించారు. ఆ లేఖ కాస్త చర్చనీయాంశంగా మారింది. అయితే.. రాజ్యానికి బలం ఎక్కువ అని తెలిసి.. తాము ఉన్నచోటును మావోయిస్టులు ఎందుకు చెప్తారనే ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ లేఖ ద్వారా బలగాలను ఇటువైపు రప్పించి.. మావోలు మరో ప్రాంతానికి వెళ్లారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కర్రెగుట్టల్లో బాంబులు అమర్చినట్టు మావోయిస్టులు ప్రకటన చేసి.. అగ్రనేతలను సేఫ్ ప్లేస్‌కు తరలించినట్టు ప్రచారం జరుగుతోంది. వ్యూహాత్మకంగానే మావోలు ఈ ప్రకటన చేశారని.. తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల్లోని అడవుల్లో కూంబింగ్ చేస్తున్న బలగాలు కూడా ఇక్కడికి రావడంతో.. మావోయిస్టులు వేరే ప్రాంతానికి సులభంగా వెళ్లి ఉంటారనే చర్చ జరుగుతోంది. దీనిపైనా బలగాలు ఆలోచిస్తున్నట్టు సమాచారం. నిజంగా మావోయిస్టులు కర్రెగుట్టల్లో ఉంటే.. బలగాలు డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా ఆ ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించాయి. కానీ.. ఆశించిన స్థాయిలో మావోల కదలికలు గుర్తించలేదు. అంటే అసలు కర్రెగుట్టల్లో వారు లేరనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఒకవేళ ఉంటే.. ఇన్నిరోజులు కూంబింగ్ జరుగుతున్నా.. వేలాది మంది జవాన్లు జల్లెడ పడుతున్నా.. ఎవ్వరూ ఎందుకు కనిపించరనే ప్రశ్న.. హాట్ టాపిక్‌గా మారింది. వాస్తవానికి కర్రెగుట్టలు చాలా ఎత్తులో ఉంటాయి. ఒకవేళ నిజంగా మావోయిస్టులు ఆ గుట్టలపై ఉన్నారనుకున్నా.. వారికే అనుకూల పరిస్థితులు ఉంటాయి. బలగాలు కింది నుంచి గుట్టలపైకి ఎక్కాలి. ఈ క్రమంలో కాల్పులు జరిగితే.. ఇరువైలా భారీగా ప్రాణ నష్టం ఉండేది.. అని గతంలో ఆ ప్రాంతంలో పనిచేసిన ఓ రిటైర్డ్ పోలీస్ అధికారి వెల్లడించారు. ఇప్పటికే మావోయిస్టులు ఎత్తైన ప్రాంతంలో ఉంటే.. పైనుంచి కాల్పులు జరపడం ఈజీ అని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. కర్రెగుట్టల ప్రాంతంలో వడగాలులు బలంగా వీస్తున్నాయి. ఇలాంటి సమయంలో కూంబింగ్ సజావుగా సాగడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే చాలామంది జవాన్లు వడదెబ్బకు గురయ్యారు అనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బలగాలు ప్లాన్ మార్చుకున్నట్టు తెలుస్తోంది. ఇలా కూంబింగ్, దాడులు కాకుండా.. బేస్ క్యాంపులు ఏర్పాటు చేస్తే మంచిదనే అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

## బాలికలదే పైచేయి

-మొదటిపేజీ తరువాయి

94.21 శాతం విద్యార్థులు పాసయ్యారు. ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్లను ఎస్ఎస్‌సీ బోర్డు ఇచ్చింది. ఇక ఈ ఏడాది 4,629 స్కూల్స్ 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. రెండు పాఠశాలలు మాత్రం సున్నా శాతం ఫలితాలు పొందాయి. మహబూబాబాద్ జిల్లా 99.29 శాతంతో అగ్రస్థానంలో నిలవగా, వికారాబాద్ జిల్లా 73.97 శాతంతో చివరి స్థానంతో సరిపెట్టుకుంది. తెలంగాణ గురుకుల పాఠశాలలు 98.79 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఎయిడెడ్, జడ్పీ, గవర్నమెంట్ స్కూల్స్ రాష్ట్ర సరాసరి ఉత్తీర్ణతా శాతం 92.78 కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించాయి.

సీజీపీఏ విధానాన్ని తొలగించిన నేపథ్యంలో సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడింగ్స్ ఇచ్చారు. రాష్ట్రంలో మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి వార్షిక పరీక్షలను జరిగిన విషయం తెలిసిందే. దాదాపు 5లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

### జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయని ఎస్ఎస్‌సీ బోర్డు ప్రకటించింది. ఫీజు చెల్లింపునకు తుది గడువు మే 16గా నిర్ణయించారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 15వరకు అవకాశం కల్పించారు. ఇందుకోసం సబ్జెక్టుకు రూ.500 చొప్పున చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తుకు అవకాశం కల్పించారు.

### ఒక్క విద్యార్థీ పాస్ కాని పాఠశాలలు రెండు

ఈ ఏడాది రెండు ప్రైవేటు పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు. ఈ ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 99.29శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. వికారాబాద్‌లో అతి తక్కువగా 73.97శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ఈ ఏడాది పరీక్షల నుంచే టెన్త్‌లో ఇంటర్నల్స్ రద్దు చేయాలని భావించారు. కానీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఆలస్యం కావడంతో ఈ ఏడాది ఇంటర్నల్స్ కొనసాగించారు. వచ్చే ఏడాది నుంచి ఇంటర్నల్స్ ఉండవు. మొత్తం 100 మార్కులు రాత పరీక్షతోనే కేటాయించనున్నారు. తెలంగాణలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 21న ప్రారంభం కాగా, ఏప్రిల్ 4న ముగిశాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు నిర్వహించారు.

## 'ఇది తెలంగాణ ప్రభుత్వ విజయం'

-మొదటిపేజీ తరువాయి



స్పందించారు. కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఆయన, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర క్యాబినెట్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దార్శనికత నెరవేరబోతోందని అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయగలిగారని పేర్కొన్నారు. దేశంలో కుల గణన ప్రక్రియను ప్రారంభించిన తొలి రాష్ట్రం తెలంగాణ అని, రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగానే రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.

కుల గణన ఆవశ్యకతపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాటం చేసిందని, తెలంగాణ కాంగ్రెస్ నేతలు సైతం ఢిల్లీ వేదికగా ఆందోళనలు నిర్వహించారని ఆయన గుర్తు చేశారు. "తెలంగాణ చేసింది.. దేశం అనుసరిస్తోంది" అనే విషయం మరోసారి స్పష్టమైందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

### కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

దేశవ్యాప్తంగా కులగణన చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. 'భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా కులగణన జరగాల్సిందేనని తేల్చి చెప్పారు. రాహుల్ గాంధీ సూచన మేరకు తెలంగాణలో రేవంత్ రెడ్డి కులగణన చేశారు. రాహుల్ గాంధీ పోరాటం.. రేవంత్ రెడ్డి ఆలోచన విధానం వల్లనే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇది కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయం.. రాహుల్ గాంధీ సాధించిన విజయం. దేశ వ్యాప్తం గా ఉన్న బడుగు బలహీన వర్గాల విజయం ఇది. రాహుల్ గాంధీ పోరాటానికి భయపడే బీజేపీ ప్రభుత్వం కులగణన కోసం ముందుకు వచ్చింది. రాహుల్ , రేవంత్ దెబ్బకు కేంద్రం దిగివచ్చింది. బీసీ బిడ్డ కాకపోయినా సీఎం రేవంత్ రెడ్డి కులగణనకు ముందుకు వచ్చారు. 56.36 శాతం బీసీలు ఉన్నారని తెలంగాణలో రేవంత్ రెడ్డి లెక్క తీశారు.

## హైదరాబాద్‌లో పలు పోలీస్ స్టేషన్ల పేరు మార్పు..

## 146 మంది సీఐల బదిలీ




**హైదరాబాద్:** నగరంలోని ప్రఖ్యాత ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని పోలీస్‌స్టేషన్లు, డివిజన్ల పేర్లను మార్చుతున్నట్లు హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. 72వ లా అండ్ ఆర్డర్ పీఎస్‌గా టోలిచౌకి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెక్రటేరియట్ పీఎస్‌ను లేక్ పోలీస్‌స్టేషన్‌గా, హుమాయున్‌నగర్ పీఎస్‌ను మెహదీపట్నం పీఎస్‌గా, షాహినాయత్‌గంజ్ పీఎస్‌ను గోషామహల్ పీఎస్‌గా మార్చినట్లు వెల్లడించారు. "35 ఏళ్ల తర్వాత హైదరాబాద్ కమిషనరేట్‌లో ఠాణాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. నగరంలో 71 లా అండ్ ఆర్డర్, 31 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. రెండేళ్లుగా పోలీస్‌స్టేషన్ల హద్దుల్లో సమస్యలు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ ఠాణాపై గందరగోళం నెలకొంది. ప్రభుత్వానికి నివేదిక పంపితే మార్పులకు ఆమోదం తెలిపింది. పోలీస్‌స్టేషన్ల వివరాలను హైదరాబాద్ సిటీ పోలీస్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తాం" అని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు.

### 146మంది సీఐల బదిలీలు

మరోవైపు, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ ప్రక్షాళన చేపట్టారు. పెద్ద ఎత్తున సీఐలను బదిలీ చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో146 మంది సీఐలను బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు ఇచ్చారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020, Telangana. **Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail :** voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.